ఆంధ్రభూమి

సంపుటి 59 సంచిక 101 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | గురువారం 10 జనవరి, 2019 | 20 పేజీలు | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ చవితి మ.1.51
నక్షత్రం: శతభిషం రా.2.57
వర్జ్యం: ఉ.8.22 నుండి 10.08 వరకు
దుర్ముహూర్తం: ఉ.10.00 నుండి 10.48 వరకు
తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు
రాహుకాలం: మ.1.30 నుండి 3.00 వరకు



భువనేశ్వర్‌లో బుధవారం 15వ ఫైనాన్స్ కమిటీ ఛైర్మన్ ఎన్‌కే సింగ్‌తో సమావేశమైన ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

పెద్దలూ ఆమోదించారు

రాజ్యసభలోనూ నెగ్గిన ఈబీసీ రిజర్వేషన్ల బిల్లు • ఇక రాష్ట్రపతి ఉత్తర్వులే తరువాయి

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 9: దేశంలోని అన్ని మతాలకు చెందిన అగ్రవర్ణాల్లోని పేదలకు ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 124 రాజ్యాంగ సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోద ముద్ర వేసింది. ఈ సవరణ బిల్లుకు అనుకూలంగా 165 ఓట్లు పడగా, కేవలం ఏడుగురు సభ్యులు మాత్రమే వ్యతిరేకించారు. రిజర్వేషన్ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలన్న డీఎంకే తీర్మానం వీగిపోయింది. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలన్న మరో తీర్మానం కూడా వీగిపోయింది. వెనుకబడిన కులాలకు చెందిన ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నత వర్గాలలోని బీద ప్రజలకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థలలో 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక అంశమని సామాజిక న్యాయ శాఖా మంత్రి తావర్ చంద్ గెహ్లాట్ వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఈ బిల్లును మంగళవారం భారీ మెజారిటీతో ఆమోదించడం తెలిసిందే. లోక్‌సభ ఆమోదించిన పది శాతం రిజర్వేషన్ల బిల్లును రాజ్యసభ బుధవారం రాత్రి భారీ మెజారిటీతో ఆమోదించింది. కేంద్ర సాంఘిక న్యాయ శాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ ప్రతిపాదించిన పదిశాతం రిజర్వేషన్ల బిల్లుపై రాజ్యసభలో దాదాపు తొమ్మిది గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిపిన అనంతరం సభ్యులు దీనిని ఆమోదించారు. లోక్‌సభలో మెజారిటీ పార్టీలు మద్దతు ఇచ్చినందున రాజ్యసభలో కూడా అన్ని పార్టీలు భారీ మెజారిటీతో బిల్లును ఆమోదించాలని తావర్‌చంద్ గెహ్లాట్ విజప్తి చేశారు. కాగా, పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన పది శాతం రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిస్తారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ దీనికి ఆమోద ముద్ర వేయగానే ప్రభుత్వ గెజిట్ జారీ అవుతుంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వివరించినట్టు ఈ రాజ్యాంగ సవరణ బిల్లును యాభై శాతం రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదించవలసిన అవసరం లేనందువల్ల ఇది వెంటనే అమలులోకి వస్తుందని సమాచారం. ఆయా రాష్ట్ర

- మిగతా 6వ పేజీలో



రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందిన అనంతరం కేంద్ర మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ విజయ సంకేతం

ఎవరేమన్నారంటే...

సిక్సర్ కొట్టాం..!

శీతాకాల సమావేశాల ఆఖరు రోజు మోదీ ప్రభుత్వం రిజర్వేషన్ల సిక్సర్ కొట్టింది.. ఇకమీదట కూడా మరిన్ని సిక్సర్లు కొడతాం.

- కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్

అనాలోచిత నిర్ణయం

ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగం అంగీకరించక పోవచ్చు.

- కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబల్

బిల్లును స్వాగతిస్తున్నాం

అగ్రవర్ణాల్లో పేదలకు ఉపయోగపడుతుంది. ఇంత హడావిడిగా బిల్లును తీసుకురావడం దురదృష్టకరం.

- ఎంపీ సుజనా చౌదరి

ఏ కూటమిలోనూ చేరేది లేదు

◆ స్పష్టం చేసిన ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్

భువనేశ్వర్, జనవరి 9: ఒడిశాలో అధికారంలో ఉన్న బీజూ జనతాదళ్ పార్టీ (బీజేడీ) కాంగ్రెస్ లేదా ఎన్డీఏ కూటమిలో చేరదని ఆ పార్టీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్ స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ ఏ కూటమితోనూ అంటకాగదన్నారు. బుధవారం ఇక్కడ విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరంగా ఉంటామన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని మహాఘటబంధన్‌కు తమ పార్టీ దూరంగా ఉంటుందన్నారు. ఈ ఏడాది ఒడిశా అసెంబ్లీకి లోక్‌సభతోపాటు ఎన్నికలు జరగనున్నాయి. 2000-2009 సంవత్సరాల మధ్య బీజేడీ,

- మిగతా 6వ పేజీలో

కోటి లేఖలు రాస్తాం

ఓటర్ల జాబితా సవరణలపై ఈసీ విప్లవాత్మక నిర్ణయం

- జనవరి 25 వరకు ఫిర్యాదుల స్వీకరణ
- ఎన్నికల వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ
- రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి రజత్ కుమార్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: ఓటర్ల జాబితా సవరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని 1.05 కోట్ల కుటుంబాలకు లేఖలు రాస్తున్నామని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి డాక్టర్ రజత్ కుమార్ తెలిపారు. సచివాలయంలో బుధవారం మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రస్తుతం రాష్ట్రంలో ఓటర్ల జాబాతా సవరణ జరుగుతోందన్నారు. ఈ నెల 25 వరకు జాబితాలో పేర్లను చేర్చేందుకు, తొలగించేందుకు, చిరునామా సవరణ, పేర్లు తొలిగిపోయినవారు తిరిగి దరఖాస్తు చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను పేర్కొంటూ రాష్ట్రంలోని దాదాపు ప్రతి కుటుంబానికి లేఖలు రాస్తున్నామన్నారు. బూత్‌స్థాయి అధికారులు ఈ లేఖలను ప్రతి ఇంటికీ పంపిణీ చేస్తారన్నారు. రాష్ట్రంలో 2.81 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, సరాసరిన ముగ్గురు ఓటర్లకు ఒక కుటుంబం అనుకున్నా, రాష్ట్రంలోని దాదాపు అన్ని కుటుంబాలకు ఈ లేఖలు పంపిస్తున్నామన్నారు. 'ఓటు మీ హక్కు- ఓటు వేయడం మీ బాధ్యత' అంటూ లేఖలను రూపొందించామన్నారు.

2018 డిసెంబర్ 31 వరకు 18 సంవత్సరాలు నిండినవారు తమ పేర్లను ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు అవకాశం ఉందని ఇందుకోసం ఫాం-6 ను భర్తీ చేసి సంబంధిత అధికారికి లేదా ఆన్‌లైన్‌లో పంపించవచ్చని సీఈఓ తెలిపారు. ఓటర్ల జాబితాకు సంబంధించి తమ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉన్నాయన్నారు. రజత్ కుమార్ రాసిన లేఖతో పాటు సీఈఓ చిరునామాతో ఉండే పోస్టు కార్డు జత చేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఈ లేఖలో తమ అభిప్రాయాలను రాసి సీఈఓకు పోస్ట్‌ద్వారా పంపించాల్సి ఉంటుందన్నారు.

ఓటర్ల జాబితా సవరణ ఇటీవల ప్రారంభించిన తర్వాత 9,54,827 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో కొత్తగా పేర్లు నమోదు చేసుకునేందుకే 8,64,128 దరఖాస్తులు ఉన్నాయన్నారు. ఈ నెల 25 వరకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లలో చైతన్యం కలిగించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపడుతున్నామన్నారు. పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో చేపట్టే ఓటర్ల చైతన్య కార్యక్రమంలో స్వల్ప మార్పులు చేశామన్నారు.

ఇదీ చరిత్ర

తెలంగాణలో ఓటర్ల సంఖ్య వివిధ సంవత్సరాల్లో ఇలా ఉంది. 2015 జనవరి 1 వరకు 2.83 కోట్లు, 2016 జనవరి 1 వరకు 2.60 కోట్ల మంది ఓటర్లకు తగ్గింది. 2017 జనవరి 1 వరకు ఈ సంఖ్య 2.62 కోట్లకు పెరిగింది. 2018 జనవరి 1న జారీ అయిన జాబితా ప్రకారం 2.53 కోట్లుగా ఉంది. 2018 నవంబర్ 19న జాబితా ప్రకారం 2.80 కోట్లకు పెరిగిందని రజత్ కుమార్ తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ సక్రమంగా జరిగేందుకు, సమర్థతగా పూర్తయ్యేందుకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజలు తమకు సహకరించాలని రజత్ కుమార్ కోరారు. కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు మాత్రం అవకాశం పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే వరకు ఉంటుందని వివరించారు.

దేశవ్యాప్తంగా ఒకే కోటా

రాష్ట్రాల పరిధిలోనే రిజర్వేషన్లు ◆ రాజ్యసభలో టీఆర్‌ఎస్ ఎంపీ డిమాండ్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 9: తెలంగాణ శాసనసభలో ముస్లింలకు, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచుతూ చేసిన తీర్మానాలను కేంద్రం ఆమోదించాలని టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు కల్పించుకోనే అంశం రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. అగ్రవర్ణాల్లోని పేదలకు (ఈబీసీలకు) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యసభలో కేంద్రం ప్రతిపాదించిన బిల్లుపై జరిగిన చర్చలో బండా ప్రకాశ్ తెలుగులో మాట్లాడారు. కేంద్రం తీసుకొస్తున్న ఈ బిల్లుకు తమ పార్టీ మద్దతునిస్తోందని ఆయన తెలిపారు. 70 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కూడా వెనుకబాటుతనం పేరుతో అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామంటే.. గతంలో దేశాన్ని పాలించిన ప్రభుత్వాల వైఫల్యం ఉందని ఆరోపించారు. సామాన్యుల గురించి పట్టించుకోకపోవడం వల్లే ప్రస్తుతం ఈ బిల్లు తీసుకురావాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. 2017లో ముస్లింలకు, గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేశారని.. ఈ అంశం కేంద్రం పరిధిలోనే ఉన్నదని అన్నారు. రిజర్వేషన్ల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు విజ్ఞప్తులు చేసినా కేంద్రం పట్టించుకోవడం లేదని చెప్పారు. రిజర్వేషన్ల బిల్లును తీసుకొచ్చే ముందు తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను కూడా కేంద్రం ఆమోదించాలని ఆయన స్పష్టం చేశారు. మహిళా బిల్లును ఎందుకు కేంద్రం

- మిగతా 6వ పేజీలో



టీఆర్‌ఎస్ ఎంపీ బండా ప్రకాశ్

అంత ఇవ్వలేం... కొంత ఇస్తాం

తమిళనాడుకు తాగునీటిపై తేల్చిచెప్పిన మూడు రాష్ట్రాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: తమిళనాడుకు తాగు నీటి అవసరాలకు ఇప్పటికిప్పుడే నీరు విడుదల చేయలేమని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు తేల్చి చెప్పాయి. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం బుధవారం సోమాజిగుడాలోని జల సౌధలో సుదీర్ఘంగా జరిగింది. కృష్ణా నదీ జలాల యాజమాన్య బోర్డు ఛైర్మన్ ఆర్‌కే జైన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఇఎన్‌సీ) మురళీధర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా తమిళనాడు రాష్ట్రానికి 15 టీఎంసీలను తాగు నీటి అవసరాలకు అందించే అంశంపై చర్చ జరిగింది. తమ రాష్ట్రంలో నీటి కొరత తీవ్రంగా ఉన్నందున దక్షిణాది రాష్ట్రాలు నీటిని విడుదల చేయాలని తమిళనాడు రాష్ట్రానికి చెందిన నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు

- మిగతా 6వ పేజీలో

రిజర్వేషన్ల తగ్గింపుపై సుప్రీంను ఆశ్రయించిన బీసీ సంఘాలు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 9: తెలంగాణలో పంచాయతీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తగ్గింపుపై బీసీ సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పంచాయతీ ఎన్నికలలో రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ బీసీ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. రిజర్వేషన్లు ఆర్డినెన్స్‌పై స్టే విధించలేమని హైకోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చిన విషయం తెలిసిందే. రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ ఆర్.కృష్ణయ్య, సామల రవీందర్ బుధవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేయడంతో పాటు, బీసీ రిజర్వేషన్లు 34 నుంచి 22 శాతం తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని ఆర్.కృష్ణయ్య హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది.

5525 కుటుంబాలకు బీమా చెల్లింపు

బ్యాంకుల్లో రూ.276.25 కోట్ల రైతు బీమా డిపాజిట్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: రాష్ట్రంలో రైతుబీమా పథకం కింద ఇప్పటి వరకు మరణించిన 5525 మంది రైతులకు సంబంధించి వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి తెలిపారు. రైతుబీమా పథకం తాజా పరిస్థితిపై వ్యవసాయ శాఖ, ఎల్‌ఐసీ అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ పథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటి వరకు మొత్తం 5821 మంది రైతులు మరణించారని, వీరిలో 5525 మంది రైతు కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున ఆర్థిక చేయూత ఇచ్చామన్నారు. మిగతావారి దరఖాస్తుల్లో చిన్న చిన్న తప్పులు ఉండటం వల్ల ఎల్‌ఐసీ వీటిని వెనక్కు పంపిందని, ఈ తప్పులను సవరించి మళ్లీ దరఖాస్తులను అప్‌లోడ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇప్పటికే ఈ పథకంలో చేరిన రైతులతో పాటు కొత్త రైతులు ఎవరైనా ఉంటే ఈ పథకంలో చేర్చాలని, దాంతో 2019-20 సంవత్సరం బడ్జెట్‌లో నిధులు కేటాయించేందుకు వీలవుతుందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్, ఎల్‌ఐసీ రీజనల్ మేనేజర్ చందర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుబీమా పథకంపై సమీక్షిస్తున్న వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి

ఘనగామా





ఇచ్ఛాపురంలో బుధవారం ప్రజా సంకల్పయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న వైసీపీ అధినేత జగన్

నిన్ను నమ్మరు బాబూ

- ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది • నా పాదయాత్రలో అది రూఢీ అయింది
- టీడీపీ పాలన అరాచకమని తేలిపోయింది
- పాదయాత్ర ముగింపు సభలో వైకాపా అధినేత వైఎస్ జగన్ ధ్వజం

పలాస, జనవరి 9: రాష్ట్రంలో ప్రజలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నమ్మం అంటున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎద్దేవా చేసారు. ఏడాది కిందట ఇడుపులపాయలో ప్రారంభమైన జగన్ ప్రజా సంకల్పయాత్ర బుధవారం నాటికి 3648 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. 13 జిల్లాల గుండా కొనసాగిన పాదయాత్ర శ్రీకాకుళం జిల్లా, ఇచ్ఛాపురంలో ముగిసింది. ఈ సందర్భంగా నిర్మించిన పైలాన్‌ను జగన్ ఆవిష్కరించి అనంతరం జరిగిన బహిరంగసభలో అశేష జనాన్ని ఉద్దేశించి మాట్లాడారు. బాబు పాలనలో రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు, యువత పూర్తిగా మోసపోయారని, ఎన్నికల హామీలను అమలు చేయడంలో సీఎం పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాజ్యాంగానికి లోబడి న్యాయవ్యవస్థకు అనుగుణంగా ప్రజలకు సంతృప్తిపాలన అందించాల్సిన టీడీపీ ప్రభుత్వం అరాచకపాలనను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఈ పాదయాత్రను చేపట్టామన్నారు. రైతు, డ్వాక్రా సంఘాల రుణమాఫీ పూర్తికాకపోడంతో 2009లో 82.450 హెక్టార్లు పంట విస్తీర్ణం చేస్తే 2018 నాటికి 41 హెక్టార్లు మాత్రమే పంట విస్తీర్ణం సాగిందని, అప్పట్లో 160 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి అయితే 2018 నాటికి 153 లక్షల మెట్రిక్ టన్నులకు దిగుబడి

- మిగతా 6వ పేజీలో



సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పౌరసరఫరాల సంస్థ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

బీసీ సంఘాల అర్ధనగ్న ప్రదర్శన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: అగ్ర కులాల్లో వెనుకబడిన వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ బీసీ సంక్షేమ సంఘాల నాయకులు, కార్యకర్తలు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ అధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ చౌరస్తాలో వందలాది మంది కార్యకర్తలు అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గుజ్జ కృష్ణ ప్రసంగిస్తూ స్వాతంత్ర్యం లభించి 71 సంవత్సరాలైనా కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన పార్టీలన్నీ బీసీలను నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. తెలంగాణలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ఈబీసీలు 9 శాతం ఉన్నా, 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నారని ఆయన తెలిపారు. 52 శాతం ఉన్న బీసీలకు మాత్రం 25 శాతమే ఇస్తారట అని ఆయన అన్నారు. దేశ సంపద, పరిశ్రమలు, డబ్బు, వ్యాపార, వాణిజ్య, కాంట్రాక్టులు, అధికారం వంటివి 15 శాతం జనాభా ఉన్న అగ్ర కులాల చేతుల్లో 90 శాతం వరకు ఉన్నాయని, అటువంటప్పుడు వీటిని కూడా కులాల జనాభా ప్రకారం రిజర్వ్ చేస్తారా? అని గుజ్జ కృష్ణ ప్రశ్నించారు.



బషీర్‌బాగ్ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న బీసీ సంఘాల నేతలు

అగ్రకులాలు అడగకుండానే..

అగ్ర కులాలు తమకు రిజర్వేషన్లు కావాలని ఉద్యమాలు చేయకపోయినా కేంద్రం 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించడం విస్మయం కలిగిస్తున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలని 26 సంవత్సరాలుగా ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదని బుధవారం కృష్ణయ్య అధ్యక్షతన సమావేశమైన బీసీ సంక్షేమ సంఘం కోర్ కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై రాజకీయ పార్టీలు మాట్లాడకపోవడం దురదృష్టకరమని కృష్ణయ్య అన్నారు.

విదేశీ వైద్య విద్యపై పెరిగిన ఆసక్తి


భారీగా పెరుగుతున్న విదేశీ వైద్య విద్యార్థులు • గత ఏడాది విదేశాల్లో చదివిన భారతీయులు 17504 మంది

2016 కంటే రెట్టింపు సంఖ్యలో అడ్మిషన్లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: భారత్ నుండి విదేశాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించే వారి సంఖ్య రోజురోజుకూ బాగా పెరుగుతోంది. భారత్‌లో జాతీయ స్థాయి ప్రవేశపరీక్ష పోటీని తట్టుకోలేకపోవడం, కాలేజీలు, సీట్లు తక్కువగా ఉండటం, యాజమాన్య కోటా సీట్లకు ఫీజు భారీగా ఉండటం, ఆర్థిక భారాన్ని మోయలేని మధ్యతరగతి, దిగువ తరగతి విద్యార్థులతో పాటు ప్రవేశపరీక్ష పోటీని తట్టుకోలేపోతున్న విద్యార్థులు అంతా విదేశీ వైద్య విద్యవైపు దృష్టిసారించారు. ఫిలిప్పీన్స్, రష్యా, కజికిస్థాన్, యూఎస్, యూకే, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, హాంకాంగ్, సింగపూర్, న్యూజిలాండ్, ఐర్లాండ్ తదితర దేశాలకు పెద్ద ఎత్తున భారతీయ విద్యార్థులు వైద్య విద్యాభ్యాసానికి వెళ్తున్నారు.

గత ఏడాది భారత్ నుండి 17.504 మంది వివిధ యూనివర్శిటీల్లో వైద్య విద్యకు చేరారు. ఆర్‌టీఐ డాటా ప్రకారం చూస్తే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2015-16లో 3386 మందికి అర్హత పత్రాలను అందజేసింది. 2018లో మొత్తం 17,504 మందికి అర్హత పత్రాలను అందజేసింది. 2017-18లో 14,118 అర్హత పత్రాలను అందజేసింది. 2016-17 విద్యాసంవత్సరంలో 8737 మందికి అర్హత పత్రాలను అందజేసింది. ఈసారి నీట్ పరీక్షకు రెండు లక్షలకు పైగా అదనంగా రాస్తారని అంచనా వేస్తున్నారు. అంటే గత ఏడాది కంటే నీట్ అభ్యర్థుల సంఖ్య 14.4 శాతం పెరగనుంది. గత ఏడాది 15.19 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఫలితంగా ఒక్కమార్కుతో వందలాది ర్యాంకులు మారిపోయే పరిస్థితి ఏర్పడింది. పోటీపడుతున్న అభ్యర్థుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నా సీట్ల సంఖ్య మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నట్టుంది. అభ్యర్థులకు అనుగుణంగా సీట్లు పెరగకపోవడంతో ప్రత్యామ్నాయాలను వెదుక్కుంటున్నారు. విదేశాల్లో వైద్య విద్య తక్కువ వ్యయంతో పూర్తి చేసే పరిస్థితి ఉండటం, భారీగా భారతీయ విద్యార్థులు చేరుతున్నందున సహ విద్యార్థులకు నమ్మకం, విశ్వాసం పెరగడం, సంస్థలు సైతం సకల సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు భారతీయ ఆహారం లభించేలా ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేయడం, రవాణా సదుపాయాలు కల్పించడం, విదేశాల్లో వారిని రిసీవ్ చేసుకుని గమ్యానికి చేర్చేలా సహచరులను ఏర్పాటు చేయడం వంటి చర్యలతో విదేశాల్లో విద్య తేలికగా మారింది. విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు వెళ్లే విద్యార్థులకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అర్హత పత్రాన్ని కూడా జారీ చేయాల్సి ఉంటుంది.



సర్వే సస్పెన్షన్ ఉత్తుత్తిదేనా..?

అధికారికంగా ఎలాంటి ప్రకటనా విడుదల చేయనీ టీపీసీసీ, ఏఐసీసీ • నిన్న సర్వే, నేడు చిత్తరంజన్

రాష్ట్ర కమిటీపై పెరుగుతోన్న వ్యతిరేకత • ఎన్నికల క్రమంలో అసమ్మతి రాగాల పట్ల సీనియర్ల ఆందోళన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలయ్యాక పార్టీ నాయకులు క్రమశిక్షణా లక్ష్మణరేఖ దాటి రాష్ట్ర కమిటీపై విమర్శలకు దిగుతున్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పని చేసిన సీనియర్ నాయకులే క్రమశిక్షణా రేఖ దాటి వ్యవహరిస్తుండటంతో కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో నవ్వుల పాలవుతోందని పార్టీ విధేయులు, సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల ముందు క్రమశిక్షణా రాహిత్యంగా వ్యవహరిస్తోన్న నేతలపై చర్యలు తీసుకోకపోవడం వల్ల ప్రజల్లో పార్టీ మరింత చులకన అవుతోందని వారు వాపోతున్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ ఆర్‌సి కుంతియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డినే టార్గెట్‌గా చేసుకొని ఆరోపణలకు దిగుతోన్న పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుంతియా, ఉత్తమ్‌కుమార్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేసిన మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు మీడియాకు అనధికారికంగా సమాచారం ఇవ్వడం తప్ప ఇప్పటి వరకు దీనిపై టీపీసీసీ కానీ ఏఐసీసీ కానీ ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. తనను సస్పెండ్ చేసే అధికారం టీపీసీసీకి లేదని సర్వే సత్యనారాయణ ఎదురు తిరిగినా టీపీసీసీ బాధ్యులు ఎవరు కూడా స్పందించలేదు. దీంతో సర్వే సత్యనారాయణపై తీసుకున్న చర్య ఉత్తుత్తిదేనానన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా పని చేశారన్న అభియోగంపై ఎన్నికలు ముగిసి నెల రోజులు దాటిన తర్వాత కూడా టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ కోదండరెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. అయితే సర్వే సత్యనారాయణపై ఏ చర్య తీసుకున్నదీ టీపీసీసీ క్రమశిక్షణా కమిటీకి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయకపోగా, ఇదేదో తనకు సంబంధం లేని వ్యవహారంగానే టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ వ్యవహరిస్తోంది. దీంతో సర్వే సస్పెన్షన్ ఉత్తుత్తిదేనానన్న అనుమానాలు మరింత బలపడుతున్నాయి. కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై సర్వే సత్యనారాయణ చేసిన ఆరోపణలలో తప్పేమిలేదని బీసీ సెల్ రాష్ట్ర చైర్మన్, మాజీ మంత్రి జె. చిత్తరంజన్‌దాసు కూడా తాజాగా స్పందించారు. పార్టీ రాష్ట్ర బాధ్యులపైనే పార్టీ సీనియర్లు తీవ్ర ఆరోపణలకు దిగుతోన్నా టీపీసీసీ స్పందించకపోవడాన్ని పార్టీ విధేయులు తప్పుపడుతున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులను సీఎం కేసీఆర్ ఇడియెట్స్ అని సంభోదించినా స్పందించకపోవడం దారుణమని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు మీడియా ఎదుట వాపోయారు.

సీఎం కేసీఆర్ అన్నదాంట్లో తప్పేమి లేదని సర్వే సత్యనారాయణ మీడియా సమావేశంలో సమర్థించిన విషయం తెలిసిందే. పంచాయతీ, పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీని ప్రజల్లో మరింత నవ్వులా పాల్జేస్తోన్న టీపీసీసీ పట్టించుకోకపోవడం పట్ల కొందరు సీనియర్లు తప్పుపడుతున్నారు. ఈ విషయాన్ని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు.

మతపరమైన రిజర్వేషన్లను ఎపుడూ వ్యతిరేకిస్తాం

బీసీల రిజర్వేషన్లు తగ్గరాదు • వారికీ ప్రయోజనం చేకూరాలి • కోర్టులు ఏర్పాటు చేయండి • సీఎంకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ లేఖ

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: మతపరమైన రిజర్వేషన్లను ఎపుడూ వ్యతిరేకిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూరాలని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించకుండానే రాజ్యాంగ బద్ధంగా వర్గీకరణ జరగాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన వర్గాలకు ప్రయోజనం చేకూరాలనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ కాంగ్రెస్ పార్టీ సమస్యకు ఆజ్యం పోయడం తప్ప పరిష్కారానికి కనుగొనలేదని విమర్శించారు. కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాలకే పెద్ద పీట వేసిందని చురకలంటించారు. కేసీఆర్ ప్రభుత్వం మత పరమైన రిజర్వేషన్లను శాసనసభలో ప్రవేశపెడితే బీజేపీ ఎమ్మెల్యేగా తాను వ్యతిరేకించానని తెలిపారు. పేద ముస్లింలకు న్యాయం చేయాలని టీఆర్ఎస్ అనుకుంటే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని, రాజ్యాంగ విరుద్ధమైన మతపరమైన రిజర్వేషన్లు వద్దని కోరారు.

ఆర్థిక ప్రాతిపదికన ముస్లిం వర్గాలతో పాటు అగ్రవర్ణాలకు కూడా రిజర్వేషన్లు ఇవ్వొచ్చని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం తొందరపాటు నిర్ణయం వల్ల బీసీలకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కుదిస్తూ టీఆర్ఎస్ ప్రభుత్వం జారీ చేసిన ఆర్డినెన్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్ నినాదాలతో నరేంద్రమోదీ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అగ్ర వర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు వల్ల అన్ని మతాల్లోని పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఇదే అసలైన సామాజిక న్యాయంగా అభివర్ణించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతున్న విధానం దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. ఈ బిల్లును అన్ని రాజకీయ పార్టీలూ ఆమోదించాలని చెప్పారు. కాలేల్కర్‌కమిషన్ సిఫార్సులను కూడా కాంగ్రెస్ పార్టీ అటకెక్కించిందని విమర్శించారు. బీసీలకు రిజర్వేషన్లు తగ్గించకుండా రాజ్యాంగబద్ధంగా వర్గీకరణ జరగాలని బీజేపీ భావిస్తోందని అన్నారు.

కోర్టులు ఏర్పాటు చేయండి: లక్ష్మణ్

రాష్ట్రంలోని 21 జిల్లాల్లో కన్స్యూమర్స్ ఫోరంలను, ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులను, ప్రిన్సిపల్ జడ్జీ కోర్టులను వెంటనే ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్ ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావును కోరారు.

నగర ప్రజలకు 'నీరా'

సీఎం పరిశీలనలో ఉందన్న టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: కూల్ డ్రింక్స్ తరహాలో జంట నగరాల ప్రజలకు 'నీరా' అందుబాటులోకి తెచ్చే అంశాన్ని ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు పరిశీలన చేస్తున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సచ్ఛమైన 'నీరా' ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. నీరాను నగర ప్రజలకు అందించే విషయంలో గత ప్రభుత్వాలు పలు పర్యాయాలు హామీ ఇచ్చినప్పటికీ నిలుపుకోలేదని ఆయన విమర్శించారు. గౌడ ఐక్య సాధన సమితి ముద్రించిన కొత్త సంవత్సరం క్యాలెండర్‌ను బుధవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ గీత కార్మికుల కోసం ప్రభుత్వమే తాటి, ఈత చెట్లు పెంచుతున్నదని అన్నారు. ముఖ్యంగా చెరువు కట్టల వద్ద పెంచుతున్నారని, గీత వృత్తిలో పని చేస్తున్న వారి పిల్లలు విదేశాల్లో విద్యాభ్యాసం చేయడానికి వెళ్ళాలనుకుంటే రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో గౌడ కుల వృత్తిని పట్టించుకోలేదని, హైదరాబాద్‌లో కల్లును నిషేధించారని ఆయన గుర్తు చేశారు.

సంక్రాంతికి 20 ప్రత్యేక రైళ్ళు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: గత వారం నుంచి రైల్వే శాఖ సంక్రాంతి పండుగ కోసం ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేస్తుంటే క్షణాల్లో టికెట్లు బుక్ అవుతున్నాయి. దీంతో రైల్వేశాఖ ప్రత్యేక రైళ్ళ సంఖ్యను పెంచుతోంది. ప్రయాణికుల రద్దీ క్రమంగా పెరుగుతున్నందున వెయిటింగ్ లిస్టు చాంతాడులాగే పెరుగుతోందని, అందుకు అనుగుణంగా ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేయక తప్పలేదని రైల్వే అధికారులు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లో సుదూర ప్రాంతాలకు ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేశామంటున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఈనెల 11 నుంచి 19వ తేదీ వరకు అదనపు రైళ్ళను నడపడానికి అధికారులు సిద్ధం అయ్యారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి - తిరుపతి- కాకినాడ, విజయవాడ- విజయనగరం మధ్య ప్రత్యేక రైళ్ళను ఏర్పాటు చేస్తున్నారు. సికింద్రాబాద్- తిరుపతి మధ్య 07188 రైలు, తిరుపతి- సికింద్రాబాద్ మధ్య 07189 రైలు, తిరుపతి- కాకినాడ మధ్య 07190 రైలు, కాకినాడ- తిరుపతి మధ్య 07191 రైలు, విజయవాడ- విజయనగరం మధ్య 07184 రైలు, విజయనగరం -విజయవాడ మధ్య 07185, 86,87 రైళ్ళ ఆయా తేదీల్లో నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ తెలిపారు.

ఫిబ్రవరి 20 నుంచి ఓపెన్ వర్శిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలను ఫిబ్రవరి 20వ తేదీ నుండి నిర్వహించనున్నట్టు వర్శిటీ ఒక ప్రకటనలో పేర్కొంది. పరీక్షలు మధ్యాహ్నం 2 గంటల నుండి ఐదు గంటల వరకూ ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థులు అంబేద్కర్ ఓపెన్ వర్శిటీ ఆన్‌లైన్ పోర్టల్‌కు వెళ్లి పరీక్ష రిజిస్ట్రేషన్ లింక్ క్లిక్ చేయాలని, విద్యార్థులకు సిద్ధాంతం, ఆచరణాత్మక పరీక్ష రుసుంతో సహా ఒకే చెల్లింపుతో టీఎస్ /ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా డెబిట్ , క్రెడిట్ కార్డులతో మాత్రమే చెల్లించాలని అన్నారు. వివరాలకు సంబంధిత అధ్యయన కేంద్రంలో సంప్రదించవచ్చని సూచించారు. రిజిస్ట్రేషన్‌కు ఫిబ్రవరి 1 చివరి తేదీ అని అధికారులు పేర్కొన్నారు.

28న ఇంటర్ ఫస్టియర్ ఎథిక్స్ ఎగ్జామ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎథిక్స్ పరీక్షను ఈ నెల 28న నిర్వహిస్తున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి డాక్టర్ ఏ అశోక్ తెలిపారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఎన్విరాన్‌మెంటల్ పరీక్షను 30వ తేదీన నిర్వహించే బదులు 31న నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎథిక్స్ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జరుగుతుందని అన్నారు. ఈ పరీక్షలకు ఫస్టియర్ విద్యార్థులు అంతా హాజరై ఉత్తీర్ణులు కావల్సి ఉంటుందని, గైర్హాజరైన వారికి సర్టిఫికేట్లు జారీ కావని ఆయన చెప్పారు.

సార్వత్రిక సమ్మె సక్సెస్

20 కోట్ల కార్మికులు..12 లక్షల మంది బ్యాంకు ఉద్యోగుల సంఘీభావం • ఈబీసీ 10 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధతకు నోచుకోవు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: దేశవ్యాప్తంగా ఒకవైపు రెండురోజుల సార్వత్రిక సమ్మెలో కార్మికులు ఉవ్వెత్తున పాల్గొంటుంటే మరోవైపు పార్లమెంట్‌లో కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకురావడానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రయత్నించడం సిగ్గుచేటని సీపీఐ తీవ్రంగా ధ్వజమెత్తింది. సార్వత్రిక సమ్మెను విఫలం చేయడానకి కేంద్రం ఎన్ని ఎత్తులు వేసినా దేశావ్యాప్తంగా సమ్మె సక్సెస్ అయ్యిందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ముఖ్ధూం భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలసి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణం వెనక్కుతీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం కార్మికుల జీవితాలతో ఆడుకోవాలని చూస్తే ఖబడ్దార్ అంటూ ఆయన హెచ్చరించారు.

సార్వత్రిక సమ్మెకు ఊహించని స్పందన వచ్చిందని ఆయన చెప్పారు. సమ్మెలో దాదాపు 20 కోట్ల కార్మికులు పాల్గొన్నారని, బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగ, కార్మికులు 12 లక్షల మంది పాల్గొనడం విశేషం అన్నారు. దేశంలో భారీ వ్యాపార కేంద్రంగా పేరున్న ముంబయ్‌లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయిందని ఆయన తెలిపారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులు భారీ ఎత్తున సమ్మెలో పాల్గొనడం జరిగిందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు సమ్మెకు బాసటగా నిలబడడం జరిగిందన్నారు. అగ్రవర్ణాల్లో పేదోళ్ళకు 10 శాతం రిజర్వేషన్లు తీసుకురావడం పట్ల ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. సామాజిక అంశాలపై రిజర్వేషన్ల తీసుకున్నప్పుడు జాతీయస్థాయిలో చర్చలు జరగాలన్నారు. ఎలాంటి ముందస్తు చర్చలూ లేకుండా ఈబీసీని పార్లమెంట్ ముందుకు తీసుకురావడాన్ని సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. కేవలం వచ్చే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ చేసిన ప్రయత్నంగా ఆయన అభివర్ణంచారు. ఉత్తరాదిలో గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదు రాష్ట్రాల్లో ఓటమి కారణంగా దిక్కుతోచక ఈబీసీ బిల్లును తీసుకువచ్చినట్లుగా ఉందన్నారు. సుప్రీం కోర్టు రిజర్వేషన్లను 50 శాతం దాటవద్దని సూచించినప్పుడు ఈబీసీ 10 శాతంతో 60 శాతానికి పెరగడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించడం చూస్తే బీజేపీ ఇక ముస్లిం వ్యతిరేక శక్తిగా రుజువైందన్నారు. పౌరసత్వంకు వ్యతిరేకంగా అస్సాం, జమ్మూకాశ్మీర్‌లో అల్లర్లు జరిగే ప్రమాదం ఉందని ఆయన గుర్తు చేశారు. సీబీఐ ఉన్నతాధికారి అలోక్‌వర్మను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సుప్రీం కోర్టు సూచించడం ప్రధానికి చెంపపెట్టుగా ఆయన అభివర్ణించారు. అలోక్‌వర్మ ఈనెలాఖరుకి పదవీ విరమణ చేయనున్నందున ఆయన్ని మరికొంత కాలం సీబీఐ చీఫ్‌గా కొనసాగించడం మంచిదని ఆయన సూచించారు. అలోక్‌వర్మ సెలవులో ఉన్న రోజులను తిరిగి కొనసాగించాలని చెప్పారు. అసెంబ్లీ ప్రొటెం స్పీకరుగా ఎంఐఎం ఎమ్మెల్యేని ముఖ్యమంత్రి సూచిండాన్ని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యతిరేకించడాన్ని ఆయన తప్పుపట్టారు.



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న సురవరం సుధాకర్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి

ఇలాంటి సంస్కృతికి బీజేపీ వంతపాడడాన్న సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంఐఎం మధ్య ఉన్న బంధం ఏమిటో బయటకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను తగ్గించడం పట్ల చాడ వెంకటరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

సింగరేణిలో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

శిక్షణ సమయంలో ఉచిత భోజనం, బస

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: సింగరేణి బొగ్గు గనుల ఏరియాలో నిరుద్యోగ యువతీయువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి సింగరేణి యాజమాన్యం ముందుకు వచ్చింది. శిక్షణా సమయంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యం సింగరేణి సేవా సమితి చేపట్టనున్నది. శిక్షణలో వివిధ రంగాలకు చెందిన సంస్థల్లో ఉద్యోగాల ఖాళీలను గుర్తిస్తారు. ఆర్మీ, పోలీస్, రవాణా, సలార్ పవర్, ఐటి, మెడికల్, నిర్మాణ రంగాల్లో ఉన్న ఉద్యోగాలకు శిక్షణ ఇస్తారు. తెలంగాణ ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణ సంస్థలో రెసిడెన్సియల్ పద్ధతిలో సింగరేణి ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ 40 రోజుల పాటు ఉంటుందని సింగరేణి అధికారులు చెబుతున్నారు. కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణులుగా ఉండాలి. అలాగే విమానాశ్రయాలు, హైవేల వంటి మౌలిక సదుపాయాల నిర్మాణ సంస్థ జీఎంఆర్ కంపెనీలకు చెందిన ఉద్యోగాల్లో శిక్షణ ఇస్తారు.

విమానయానకు సంబంధించిన శిక్షణ జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 38 రకాల శిక్షణలు ఇవ్వనున్నట్లు తెలపింది. ఆర్మీలో కూడా రెసిడెన్షియల్ తరహాలో శిక్షణకు అవకాశం ఉంది. సింగరేణి ఏరియా పర్సనల్ విభాగంలో అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతరసమాచారం కోసం సేవాసమితి సహాయకులు శివకుమార్‌ను సంప్రదించాలన్నారు. అభ్యర్థులు 9440484894 మొబైల్ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునని సింగరేణి సంస్థ సీపీఆర్‌వో మహేష్ తెలిపారు.

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి జాతీయ కమిషన్ సర్క్యూట్ బెంచ్

28 నుంచి ఫిబ్రవరి 8 వరకు పెండింగ్ కేసుల విచారణ • పౌర సరఫరాల శాఖ వెల్లడి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: వినియోగదారుల ఫిర్యాదుల విచారణకు జాతీయ కమిషన్ నేతృత్వంలో హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రకటించింది.

ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు ఆదర్శనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ కాన్ఫరెన్స్ హాలులో వినియోగదారుల భద్రతా చట్టం-1986 ప్రకారం పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ చేపట్టనున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించి జాతీయ వినియోగదారుల కమిషన్‌లో పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల ఫిర్యాదుల అప్పీలు, రివిజన్ పిటీషన్‌లపై విచారణ జరిపేందుకు జాతీయ వినియోగదారుల వివాదాల, రిడ్రెసల్ కమిషన్ రెండు వారాల పాటు హైదరాబాద్‌లో సర్క్యూట్ బెంచ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. వినియోగదారులు తమ ఫిర్యాదుల పరిష్కారాల కోసం ఢిల్లీ వరకు వెళ్ళకుండా ఆయా రాష్ట్రాల్లోనే పరిష్కామయ్యే విధంగా జాతీయ కమిషన్ ఆయా రాష్ట్రాల్లో సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నది. జాతీయ కమిషన్ అధ్యక్షుడు ఆర్‌కె అగర్వాల్ నేతృత్వంలో కేసుల విచారణ జరుగుతుంది. గతంలో జాతీయ కమిషన్ కేసుల విచారణ కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, పూణె, కొచ్చిన్, అహ్మదాబాద్, భోపాల్, నాగ్‌పూర్, చండీఘడ్, జైపూర్, లఖ్‌నవ్, కోల్‌కత్తాలలో సర్క్యూట్ బెంచ్‌లను ఏర్పాటు చేసింది.

21న ఎన్నికలుంటే.. 25 వరకూ ఓటర్ల నమోదా?

ఎన్నికల కమిషన్ తీరుపై కాంగ్రెస్ విమర్శ • ఫిబ్రవరి 10 వరకు జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఇవ్వాలని టీపీసీసీ ఎన్నికల కోఆర్డినేటర్ నిరంజన్ డిమాండ్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: ఓటర్ల నమోదుకు జనవరి 25 వరకు అవకాశం కల్పించి పంచాయతీ ఎన్నికల మొదటి విడత పోలింగ్ ఈ నెల 21న ఎలా నిర్వహిస్తారని టీపీసీసీ ఎన్నికల కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ జి నిరంజన్ ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికల తుది విడత పోలింగ్ ఈ నెల 30న నిర్వహించే వరకు బూత్ లెవల్ ఆఫీసర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, జిల్లా ఎలక్ట్రోల్ అధికారులు ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉండదని నిరంజన్ గుర్తు చేశారు.

ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను రీ షెడ్యూల్ చేసి చేర్పులు, మార్పులకు ఫిబ్రవరి 10 వరకు పొడిగించాలని నిరంజన్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం నిరంజన్ మీడియాతో మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ నివేదిక ప్రకారం 100 శాతం ఓటర్ల నమోదు పూర్తి అయిందన్నారు. 30 లక్షల మంది ఓటర్లను తొలగించి తిరిగి చేర్చినట్టు పేర్కొన్నారన్నారు. వీటిని పరిశీలించడానికి బూత్ లెవల్ ఏజెంట్స్ నియమకానికి పార్టీలకు ఫిబ్రవరి ఒకటి వరకు అవకాశం ఇవ్వాలని నిరంజన్ డిమాండ్ చేశారు.





వెల్లటూరు పునరావాస కేంద్రంలో తాత్కాలిక షెడ్ (బాల ఆలయం)లో కొలువైన శివుడు.. పునరావాస కేంద్రం బాల ఆలయం ఆరుబయట పడివున్న విగ్రహాలు

గుడి లేని దేవుళ్లు

❖ పులిచింతల ముంపులో కరువైన సొంత గూడు

❖ బాల ఆలయాల షెడ్లలలోనే తాత్కాలిక కొలువు

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 9: పులిచింతల ప్రాజెక్టు ముంపు గ్రామాల దేవుళ్లకు సొంత గూడు కరువైంది. ముంపు నిర్వాసిత ప్రజలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహార, పునరావాసాలు అందించిన ప్రభుత్వాలు అదే గ్రామాలకు చెందిన నిర్వాసిత దేవుళ్లకు మాత్రం నూతన గుడుల నిర్మాణాలపై నిర్లక్ష్యం చూపుతున్నాయి. ముంపు గ్రామాల నుండి దేవుళ్ల విగ్రహాలను తరలించి పునరావాస గ్రామాల్లో 2లక్షల వ్యయం చొప్పున నిర్మించిన తాత్కాలిక షెడ్ (బాలదేవాలయాలు)లలో కొలువు తీర్చిన అధికారులు దేవాలయాల నిర్మాణాలపై జాప్యం వహిస్తున్నారు. మూడేళ్లుగా పునరావాస కేంద్రాల్లో తాత్కాలిక షెడ్‌లలో (బాల ఆలయాల) ముంపు బాధిత దేవుళ్లు అరకొర పూజలతో సరిపెట్టుకుంటున్నారు. ముంపు గ్రామాల్లోని అడ్లూరు, వెల్లటూర్, కిష్టాపురం, రెబల్లే, చిత్రియాల, తమ్మారం, నెమలిపురి గ్రామాల్లో చారిత్రక దేవాలయాలు, చిన్న పెద్ద దేవాలయాలన్ని కలిపి 103 దేవాలయాలున్నాయి. అందులో ఎండోమెంట్ పరిధిలోనివి 17 ఉన్నాయి. ముంపు గ్రామాల దేవాలయలకు సంబంధించి రాతికట్టడాలకు నెంబరింగ్ వేసి మరి పునరావాస కేంద్రాలకు తరలించారు. వాటికి కనీసంగా 13కోట్లు కావాలని ప్రతిపాదనలు చేశారు. అనంతరం తెలంగాణ ప్రభుత్వం ఎండోమెంట్ పరిధిలోని 17 దేవాలయాలకు 3.71 కోట్లు మంజూరు చేయగా వాటికి శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు గడిచిన నిర్మాణ పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. సీజీఎఫ్ నిధులు సకాలంలో అందకపోవడం కూడా సమస్యగా మారింది. సగం దేవాలయాలకు గుత్తేదారులు కరువైపోగా, టెండర్లు వేసినచోట గుత్తేదారులు పనులు చేయడానికి ఆసక్తిచూపకపోవడంతో ఆలయ నిర్మాణాల్లో పురోగతి లోపించింది. రాష్ట్ర విభజన పిదప పులిచింతల ప్రాజెక్టు లెక్కల మేరకు అప్పట్లో ఏపి ప్రభుత్వం నుండి ప్రభుత్వం నుండి చివరి విడతగా ఆర్‌అండ్‌ఆర్ నిధులు 115 కోట్ల అందగానే దేవాలయాల తరలింపు, నిర్మాణాలు వెంటనే పూర్తి చేస్తామన్న అధికారులు ఈ దిశగా పురోగతి చూపలేదు. దీంతో పునరావాస కేంద్రాల్లో బాల ఆలయాల్లో నిర్వాసితులుగా పడివున్న పులిచింతల ముంపు దేవుళ్లకు సొంత గుడుల నిర్మాణాలకు ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు.

సాయికృష్ణ కుటుంబానికి ఆర్థిక సహాయం

సీఎం సహాయ నిధి నుంచి 10 లక్షల చెక్కు అందజేత

మహబూబాబాద్, జనవరి 9: అమెరికాలో గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో గాయపడి చికిత్స పొందుతున్న మహబూబాబాద్ నివాసి పూస సాయికృష్ణ తల్లిదండ్రులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ. 10లక్షల ఆర్థికసాయం బుధవారం అందింది. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన చెక్కును సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజలు విలేఖరులకు చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కుమారునిపై జరిగిన కాల్పుల ఘటనను దురదృష్టకరంగా భావించి మాజీ మంత్రి కేటీఆర్ మానవత్వంతో స్పందించారన్నారు. అన్నలా ఆదుకుంటానని మంగళవారం ఆయనను కలసిన సందర్భంలో మాట ఇచ్చాడని బుధవారం రూ. 10లక్షల ఆర్థిక సాయం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందేలా చేశారని అన్నారు. తాము తమ కుమారుని వద్దకు వెళ్లడానికి కావాల్సిన పత్రాలను ఏర్పాటుచేసే అంశంలోనూ కేటీఆర్ ప్రత్యేక చొరవ చూపుతున్నారని అన్నారు. మంగళవారం మాట ఇవ్వడం, బుధవారం ఆర్థికసాయం అందజేయడంతో మహబూబాబాద్ జిల్లాలోనూ మంత్రి కేటీఆర్ పనితీరు పట్ల ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.



రూ.10లక్షల చెక్కును చూపిస్తున్న సాయికృష్ణ తల్లిదండ్రులు ఎల్లయ్య, శైలజ

లాటరీ పేరుతో టోకరా

❖ రూ. కోటి కాజేసిన నైజీరియన్

❖ ఢిల్లీలో అరెస్టు చేసిన వరంగల్ పోలీసులు

❖ నేరస్థులు ఎక్కడ ఉన్నా వదలం: కమిషనర్ రవీందర్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్

ఆంధ్రభూమి బ్యూరో

వరంగల్, జనవరి 9: కోకాకోలా లాటరీ వచ్చిందంటూ యువకులకు టోకరా వేస్తున్న నైజీరియన్ సైబర్ మోసగాడు ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డాడు. ఇతనితో పాటు నాగాలాండ్‌కు చెందిన ఓ యువతిని కూడా బుధవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ పోలీసుల సహకారంతో శాయంపేట పోలీసులు ఢిల్లీలో అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన ఇద్దరి నిందితుల నుండి 2లక్షల 3వేల రూపాయలు నగదుతో పాటు రెండు ల్యాప్‌టాప్‌లు, 23 సెల్‌ఫోన్లు, విదేశీ పాస్‌పోర్ట్‌లను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పాటు వివిధ బ్యాంక్ ఖాతాల్లో డిపాజిట్ అయి ఉన్న 28 లక్షల రూపాయలకు సంబంధించిన లావాదేవీలను నిలిపివేసారు. ఈ అరెస్ట్‌కు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్ మీడియాకు వెల్లడించారు. శాయంపేట పోలీస్ పరిధిలోని మైలారం గ్రామానికి చెందిన సిరిపురం మహేందర్‌కు 2017 ఏప్రిల్‌లో తన సెల్‌ఫోన్‌కు కోకాకోలా ఆన్ లైన్ లాటరీ వచ్చిందనీ, దాని విలువ 5లక్షల గ్రేట్ బ్రిటన్ పౌండ్స్ (ఇండియన్ కరెన్సీ ప్రకారం 4కోట్ల 45లక్షలు) ఉంటుందని, దీనికి సంబంధించి బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఈ-మెయిల్‌కు సమాచారం పంపాలని ఒక ఎస్‌ఎంఎస్ వచ్చిందని తెలిపారు. సదరు బాధితుడు వెంటనే తన పూర్తి వివరాలతో మెయిల్ చేశాడు. ముందుగా రిజిస్ట్రేషన్ చార్జీల కింద 200 పౌండ్లను (లక్షా 80వేలు) చెల్లించాల్సి ఉంటుందని, లాటరీ డబ్బు త్వరలోనే వస్తుందని మహేందర్‌ను నమ్మించారు. వారు అడిగినట్లుగానే వారి బ్యాంక్ ఖాతాలో మహేందర్ డబ్బు జమచేసాడు. అనంతరం పలు దఫాలుగా నిందితులకు సంబంధించిన 12 ఎస్‌బీఐకి బ్యాంక్ ఖాతాల్లో 10 లక్షల రూపాయలను డిపాజిట్ చేశాడు. పెద్ద మొత్తంలో డబ్బు డిపాజిట్ చేసినా లాటరీ మొత్తం రాకపోవడంతో మహేందర్‌కు అనుమానం వచ్చి శాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రానికి చెందిన కరికే భరత్‌కుమార్ అనే యువకుడు నిందితులకు సంబంధించి వివిధ బ్యాంకులకు చెందిన 24 బ్యాంక్ ఖాతాల్లో 71 లక్షలు డిపాజిట్ చేసి మోసపోయిన సంఘటనతో బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేశారు. ఈ రెండు సంఘటనలపై అప్రమత్తం అయిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైం పోలీసులు ఈ కోకాకోలా లాటరీ మోసాలు ఢిల్లీ నుండి జరిగినట్లుగా నిర్ధారించారు. నిందితులు గుర్తించి పట్టుకోనేందుకుగాను వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పరకాల ఏసీపీ వైవిఎస్ సుధీంద్ర పర్యవేక్షణలో శాయంపేట ఇన్‌స్పెక్టర్ సాదుల్లా బాబా నేతృత్వంలో రెండు ప్రత్యేక దర్యాప్తు బృందాలు మందుగా సైబర్ సహకారంతో నిందితులు వినియోగించిన సెల్‌ఫోన్ నంబర్లు ఈ- మెయిల్ బ్యాంక్ ఖాతాలను ఆధారం చేసుకుని గత కొన్ని రోజులుగా దర్యాప్తు నిందితుల కోసం ఈ బృందాలు ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ బృందాలు ముందుగా నిందితులు వినియోగించిన ఇంటర్‌నెట్ వివరాలను వినియోగించుకున్న ప్రదేశాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం స్థానిక ఢిల్లీ కోర్టు అనుమతితో దర్యాప్తు బృందాలు నిందితులను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు తరలించారు. అరెస్ట్ చేసిన నింధితులను పోలీసులు విచారించగా నిందితులలో ఒకడైనా నైజీరియా దేశస్థుడు సైబర్ చీటర్ డిమ్యూయేషన్ ఉచైన్ 2015లో భారత్‌కు వచ్చాడు. ఇదే సమయంలో చిరు వ్యాపారం నిర్వహించుకోనేందుకు ఢిల్లీకి వచ్చిన మరో నిందితురాలు హీనియాకు డిమ్యూయేషన్ ఉచైన్‌తో పరిచయం కావడంతో వీరిద్దరూ కలిసి సైబర్ నేరాలకు ప్రణాళికను రూపొందించుకున్నారు. నిందితులు ఇప్పటి వరకు సుమారు ఆరు కేసుల్లో సుమారు కోటి రూపాయల వరకు తమ ఖాతాల్లో డిపాజిట్ చేయించుకున్నారు. ఇందులో వరంగల్ పోలీస్ కమిషనరేట్ శాయంపేట, బచ్చన్నపేటతో పాటు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మోసాలకు పాల్పడినట్లుగా నిందితులు పోలీసుల ఎదుట అంగీకరించారు.

ప్రచారం భళా.. ‘గుర్తు’ పట్టడం ఎలా?

❖ ఒకే మాదిరిగా ఏరోప్లేన్.. బ్యాట్ గుర్తులు

❖ గ్యాస్‌స్టౌ, సిలిండర్‌పై ఓటర్లకు తికమక


❖ వృద్ధులకు అర్థంకాని షటిల్‌కాక్ గుర్తు

ఆంధ్రభూమి బ్యూరో

ఆదిలాబాద్, జనవరి 9: అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు ఓటములను తారుమారు చేసిన ‘ట్రక్కు’ గుర్తును అభ్యర్థులు ఇంకా మర్చిపోకముందే.. పంచాయతీ ఎన్నికల్లో కేటాయించిన గుర్తులు ప్రస్తుతం గుబులు పుట్టిస్తున్నాయి. పల్లెపోరులో స్వల్ప ఓట్ల ఆధిక్యతతో గెలుపొందే సర్పంచ్, వార్డు అభ్యర్థులకు బ్యాలెట్‌లో ఊరూ పేరు, ఫోటో లేకుండానే బ్యాలెట్‌లో దర్శనమిచ్చే గుర్తులు ఓటర్లను మరోసారి తికమక పెట్టే అవకాశం ఉన్నాయి. నూతన పంచయాతీరాజ్ చట్టంలో భాగంగా 500 జనాభా ఉన్న తాండాలు, గూడేలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయగా పలుపల్లెల్లో నిరక్షరాస్యత అధికంగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఒకేలా ఉన్న గుర్తులతో ఇబ్బందులు పడే పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. చూడ్డానికి దగ్గర పోలికలు ఉన్న గుర్తులు కొన్ని అభ్యర్థులకు తంటాలు తెచ్చిపెట్టే విధంగా ఉండగా మరికొన్ని ఫలాన అభ్యర్థి గుర్తు అని ప్రచారం చేయడానికి అభ్యర్థులు సైతం తికమకపడాల్సి వస్తోంది. సర్పంచ్ ఎన్నికల బ్యాలెట్‌లో మూడోస్థానంలో ఉన్న క్రికెట్ బ్యాట్, అయిదవ స్థానంలో ఉన్న ఏరోప్లేన్ గుర్తులు రెండుకాస్త దగ్గరి పోలికలతో బ్యాలెట్‌లో ముద్రించి ఉండడంతో అవగాహన లేని వృద్ధులు, నిరక్షరాస్యులైన ఓటర్లు, అంతంతమాత్రంగానే కంటి చూపు కలిగి ఉన్న వృద్ధులు అయోమయానికి గురయ్యే అవకాశం ఉంది. తికమక గుర్తులతో ఎవరి కొంపలు మునుగుతాయోనన్న భయం అభ్యర్థులను పట్టిపీడిస్తోంది.

షటిల్ కాక్ గుర్తుతో ప్రచారం ఇబ్బందే..

గ్రామీణులు సులువుగా అర్థం చేసుకునే గుర్తులు ఈ ఎన్నికల్లో బాగానే ఉన్నా.. షటిల్‌కాక్ గుర్తుపై పల్లెజనం, తాండాలు, గూడేల్లో ఇప్పటికీ చూసిన ఓటర్లు బహుతక్కువే. సర్పంచ్ బ్యాలెట్‌పై ఏడో స్థానంలో ఉన్న షటిల్‌కాక్ గుర్తును ప్రచారం చేయడం అభ్యర్థులకు క్లిష్టంగా మారుతుండగా వృద్ధులకు, నిరక్షరాస్యులకు ఏవిధంగా అర్థమయ్యేలా చెప్పాలో అభ్యర్థులకు అంతుపట్టడం లేదు. ఓటువేసేందుకు వెళ్ళేవారు షటిల్‌కాక్‌ను ఏలా గుర్తు పడతారన్నది సందేహాస్పదంగా మారింది. దీంతో ఒకరికి పడాల్సిన ఓట్లు మరొకరికి పడే అవకాశం కూడా లేకపోలేదు. ఇక వార్డు సభ్యుల ఎన్నికల్లో ఉపయోగించే బ్యాలెట్‌లో గుర్తులు అయోమయానికి గురిచేసేలా ఉన్నాయి. మూడో స్థానంలో గ్యాస్ స్టవ్ ఉండగా అయిదవ స్థానంలో సిలిండర్ ఉంది. సాధారణంగా గ్రామాల్లో రెండింటిని కలిపి సిలిండర్‌గా పిలువడం సహజమే. పాత తరం వారికి, పెద్దగా అవగాహన లేనివారికి, కట్టెలపొయ్యిని వినియోగించే ఓటర్లు సైతం గ్యాస్ స్టవ్, సిలిండర్లను సరిగ్గా గుర్తుపట్టి ఓటువేయడం క్లిష్టమైన సమస్యగా భావిస్తున్నారు. నా గుర్తు సిలిండర్ అని ప్రచారం చేస్తే కొందరు ఓటర్లు తికమక పడి స్టవ్‌కు ఓటువేసే అవకాశాలు లేకపోలేదు. దీంతో అభ్యర్థుల తలరాతలే మారే అవకాశం ఉంది. ఇందుకు కారణం పంచాయతీ ఎన్నికల బ్యాలెట్‌లో అభ్యర్థి పేరు, ఊరు ఉండకపోగా కేవలం గుర్తులు మాత్రమే ఉండడంతో వీటిని ఫలాన అభ్యర్థి గుర్తు అని గుర్తుంచుకొని ఓటువేయాల్సి ఉంటుంది.



సర్పంచ్, వార్డు స్థానాలకు కేటాయించిన గుర్తులు ఇవే

ప్రభావితం చేయనున్న నోటా..

పంచాయతీ ఎన్నికల్లో తొలిసారిగా ‘నోటా’ గుర్తు బ్యాలెట్ చివరణ ముద్రించి ఉండడంతో ఓటర్లు ఇక్కడ కూడా తికమకపడాల్సి వస్తోంది. పల్లెల్లో పోటీచేసే అభ్యర్థులు తక్కువ మందే ఉండడంతో వారికి కేటాయించిన గుర్తుల కిందనే నోటా గుర్తు ముద్రించి ఉండడంతో ఆ గుర్తుపైన పడే ఓటు తెలువకుండానే ఓటు ముద్ర నోటాపై పడే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

సిద్దిపేట నుంచి ప్లాస్టిక్‌ను తరిమికొడదాం

❖ ప్రతి ఇంటికీ జూట్ బ్యాగుల పంపిణీకి చర్యలు ❖ సమీక్షలో హరీష్‌రావు

సిద్దిపేట, జనవరి 9: ప్రజలకు ఏదో ఒకటి చేయాలన్న తపన ఒక వ్యక్తికి ఉంటే సరిపోదని, అందుకు తగ్గట్లుగా ఆలోచన చేయాల్సి ఉంటుందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రమైన సిద్దిపేటలో మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్షలో హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేటను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ఉద్యమిద్దామని ఇందుకు అందరు సహకరించాలని కోరారు. పట్టణంలో ఇంటింటికీ జూట్ బ్యాగుల పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే 10వేల బ్యాగ్‌లు సిద్ధంగా ఉన్నాయని, మరో 25వేల వరకు జూట్ బ్యాగులు తెప్పించేలా నిర్ణయించినట్ల తెలిపారు. పట్టణవాసులు బజారుకు వెళ్లినా.. ఎక్కడికెళ్లినా.. ప్లాస్టిక్ కవర్లు తీసుకెళ్లవద్దని ప్రతి సభ, సమావేశాల్లో ప్రజలను చైతన్యవంతుల్ని చేసి మరోమారు సిద్దిపేటను ఆదర్శంగా చాటి చెప్పాలని పిలుపునిచ్చారు. విద్య, వైద్య, వ్యవసాయం, ఉపాధి కల్పన, తదితర అంశాలతో పాటు, ఆనందం, ఆహ్లాదం, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. అందరు సమిష్టిగా కృషిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సిద్దిపేట నియోజక వర్గంలో ఆక్సిజన్ పార్కు, కోమటిచెరువు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, విద్య, వైద్యం, టూరిజం, భద్రత, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో రామకృష్ణ మఠం ఏర్పాటుకు సంబంధించి విషయాన్ని ఆరాతీసి ఆ దిశగా ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు మందకోడిగా సాగటం పట్ల ఆ సంతృప్తి వ్యక్తం చేశారు. యూజీడీ కోసం పగుల కొట్టిన పనులను సత్వరమే ఎందుకు పూర్తి చేయటం లేదని పబ్లిక్ హెల్త్ డీఈ గోపాల్‌ను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండ పనులు చేయాలని ఆదేశించారు. 15రోజుల్లో మొదటి విడత పనులు పూర్తి చేసి, సివరేజ్ ప్లాంట్‌ను వారం రోజుల్లో అనుసందానంకు లింక్ చేస్తానన్నారు. కరీంనగర్ రోడ్డులో ఉన్న వెలకమ్ బోర్డు తరహాలో హైదరాబాద్ రోడ్డులో వెలకమ్ బోర్డు ఏర్పాటు చేయాలని టూరిజం ఎండీ మనోహర్‌ను కలసి సుందరంగా ఏర్పాటు చేయాలని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. వేములవాడ కమాన్ నుండి ఇమాంబాద్ వెళ్లె దారిలో పెద్దమ్మ ఆలయం వరకు బ్రిడ్జి,డివైడర్, వీధీ దీపాలు ఉండేలా ప్రణాళికను సిద్ధం చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. త్వరలోనే సిద్దిపేటను సీసీ కెమెరాల నిఘా నీడలో ఉండేలా పోలీసు కమిషనర్ జోయల్ డేవిస్‌తో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలో ప్రధాన సర్కిళ్లు, జంక్షన్ల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అవసరమైన నిజమాబాద్, కరీంనగర్, వరంగల్, సిరిసిల్లా పట్టణాలను మున్సిపల్ కమిషనర్, ఇంజనీర్లు, చైర్మన్, కౌన్సిలర్లు వెళ్లి సందర్శించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు అంజయ్య



మహబూబాబాద్, జనవరి 9: మహబూబాబాద్ జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కొంపల్లి అంజయ్య ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో జరిగే 62వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో యాంటీ సబటేర్ చెక్ టెక్నికల్ అసిస్టెంట్‌గా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుండి డ్యూటీ మీట్‌కు నలుగురు ఎంపికయ్యారు. వారిలో మహబూబాబాద్ జిల్లా నుండి అంజయ్య ఎంపికవడం పట్ల పోలీస్‌వర్గాల్లో హర్షం వ్యక్తమౌతోంది. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటలిజెన్స్ ట్రైనింగ్ అకాడమిలో నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం వచ్చేనెల ఫిబ్రవరి 12 నుండి 16 వరకు లక్నోలో జరిగే డ్యూటీ మీట్‌లో అంజయ్య పాల్గొంటారు. తెలంగాణ తరుపున జాతీయస్థాయిలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన అంజయ్య పాల్గొనడం జిల్లాకు గర్వకారణం అని ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి అభినందించారు. అడిషనల్ ఎస్పీ రావుల గిరిధర్, ఎఆర్ డిఎస్పీ జనార్దన్ రెడ్డి, అడ్మిన్ ఆర్ఐ నర్సయ్య తదితరులు అంజయ్యను అభినందించారు.

లెక్కలు చెప్పకపోతే చిక్కులే

ఎన్నికల వ్యయ సమర్పణపై ఈసీ సీరియస్

ధర్మపురి, జనవరి 9: ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికలలో చేసే ఖర్చు, అందుకు సంబంధించిన వివరాల సమర్పణ విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీరియస్‌గా వ్యవహరిస్తున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి రాష్ట్రంలో గత స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసి, ఖర్చులను సమర్పించక పోయిన అభ్యర్థులపై తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ తొందొలుతగా ఇప్పటికే వేటు వేసింది. 2013 జూలైలో నిర్వహించబడిన స్థానిక ఎన్నికలలో పోటీ చేసి, ఖర్చులను సమర్పించని అభ్యర్థులకు పలు మార్లు నోటీసులు అందజేసినా స్పందించక, మిన్నకుండిన కారణంగా విజేతలు, పరాజితులెవరైనా వదలక, పలువురిపై కొరడా ఝుళిపించి, ప్రొసీడింగ్స్ నెం.316/టిఎస్ ఇసి-పిఆర్-జెజిఎల్/2017-1377 తేది 27.11.2017 ద్వారా కొందరిని పదవీచ్యుతులను చేయడమే కాకుండా, సదరు అభ్యర్థులను మూడేళ్ళపాటు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసేందుకు అనర్హత వేటు వేసింది. గత పంచాయతీ ఎన్నికలలో లెక్కలు సమర్పించలేదని 2593మంది వార్డులకు, 358మంది సర్పంచు పదవులకు పోటీ చేసిన అభ్యర్థులను రాష్ట్ర ఎన్నికల సంఘం అనర్హులుగా ప్రకటించింది. 2017 సెప్టెంబర్/అక్టోబర్ మాసాలలో ఖర్చుల వివరాల సమర్పణకు అవకాశం కల్పించీ, స్పందించని, స్పందించినా ఆలస్యానికి సరియైన కారణాలు వివరించని అభ్యర్థులపై కఠినంగా వ్యవహరించింది. ప్రస్తుత ఎన్నికలలో సైతం ఖర్చుల విషయంలో కఠిన వైఖరి అవలంబించనుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం సర్క్యులర్ నెం.178/ తె.రా.ఎ.సం- ఎల్/2018...తేది 21.05.2018 ప్రకారం పోటీ చేసే ప్రతి అభ్యర్థి తను నామినేషన్ సమర్పించిన నాటి నుండి ఎన్నికల ఫలితాల ప్రకటన వరకూ (రెండు రోజులతో కలిపి), ఎన్నికలలో చేసిన ఖర్చులన్నింటి లెక్కల వివరాలను తాను స్వయంగా, లేక ఎన్నికల ఏజెంట్ ద్వారా గాని యదార్థంగా నిర్వహించాలని చట్టంలోని 237 సెక్షన్ సూచిస్తున్నది. ప్రతి అభ్యర్థి తన ఎన్నికల ఖర్చుల వివరాలను అట్టి ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45రోజుల లోపల నిర్దిష్ట నమూనాలో సంబంధిత ఎంపీడీఓలకు అసలు ప్రతులతో సమర్పించాలి.

గడువులోగా ఎన్నికల ఖర్చు వివరాలు కోరిన విధంగా సమర్పించని అభ్యర్థిని 3 సంవత్సరాల వరకు ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హునిగా ప్రకటించుటకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 23 ఎన్నికల సంఘానికి అధికారం ఇస్తున్నది. నామినేషన్ సమర్పిత తేదీ నుండి ఎన్నికలు ముగిసేవరకు సంబంధిత ఖర్చులను సమర్పిత బ్యాంకు ఖాతా ద్వారానే చెల్లింపులు జరగాలని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచార సమయంలో రోజువారి ఖర్చుల వివరాల నిజ ప్రతులను ప్రొఫార్మా- 3లో ఎంపీడీఓలకు సమర్పించాలి. ఎంపీడీఓ సంబంధిత ఎన్నికల ఖర్చు వివరాల సమర్పిత సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి సమర్పించాలి. ఎన్నికల సంఘం నోటిఫికేషన్ నెం.179/ టి.ఎస్.ఇ.సి. /ఎల్/2019 తేది 18.05.18లో పేర్కొన్న నిర్దిష్ట ఫార్మాట్ మరియు ప్రొఫార్మలో చెప్పిన విధంగా ఉన్న ఎన్నికల ఖర్చుల వివరాలను మాత్రమే సరైనదిగా మరియు 2018 పం.రా.చట్టం ప్రకారం ఉన్నట్లుగా పరిగణించ బడునని, ఈ నిర్దిష్ట ప్రొఫార్మాను అతిక్రమించినట్లయితే సరైన ఎన్నికల వివరాలను సమర్పించ లేదని భావించి, సంబంధితులపై తగిన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేసింది. డిజిగ్నేటెడ్ అధికారులు అట్టి ప్రతులను ఇతర పోటీ చేయు అభ్యర్థులు, ప్రజలు లేదా ప్రభుత్వేతర సంస్థలు కోరిన మీదట జిరాక్సింగ్ ఛార్జీలు చెల్లించిన మీదట వారికి భారతీయ శిక్షా చట్టం, 1872 యొక్క సెక్షన్ 76ను అనుసరించి సర్టిఫైడ్ కాపీలను అందజేయాలని మీడియాకు ఉచితంగా అందజేయాలని పేర్కొంది.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
గురువారం, 10 జనవరి 2019

వదలని 'మోన్‌సాంటో'..

పత్తి విత్తనాల అమ్మకాల వివాదం మరోసారి ప్రచారం అవుతోంది. 'మోన్‌సాంటో' అనే బహుళ జాతీయ వాణిజ్య సంస్థకూ, భారతీయ సంస్థలకూ మధ్య కొనసాగుతున్న 'పరిజ్ఞాన ముద్ర'- పేటెంట్- వివాదానికి సంబంధించి మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు ఈ ప్రచారానికి నేపథ్యం. ఈ తీర్పు తమకు అనుకూలంగా ఉందని 'మోన్‌సాంటో'ను నిర్వహిస్తున్న 'బేయర్' సంస్థ ప్రతినిధులు చెపుతున్నారు. సర్వోన్నత న్యాయస్థానం వారి మంగళవారం నాటి తీర్పు తమకు వ్యతిరేకం కాదని 'మోన్‌సాంటో'తో వివాదం కొనసాగిస్తున్న 'నూజివీడు పత్తి విత్తనాల సంస్థ' వంటి భారతీయ వాణిజ్య సంస్థలు విశ్లేషిస్తున్నాయట! సర్వోన్నత న్యాయస్థానం వారి తీర్పు ఎవరికి అనుకూలమన్నది ఈ దేశ ప్రజలకు ప్రధానం కాదు. 'ప్రపంచీకరణ' వ్యవస్థీకృతమైన తరువాత వివిధ విదేశీయ సంస్థలు ఈ దేశ ప్రజలను వివిధ పద్ధతులలో దోచుకుంటూ ఉండడం అసలు సమస్య. ఈ దోపిడీకాండలో విదేశీయ సంస్థలు రైతులకు విత్తనాలను భయంకరమైన ధరలకు అమ్ముతుండడం భాగం. జీవజన్యు పరివర్తన - జెనటిక్ మోడిఫికేషన్- జిఎమ్- ప్రక్రియ ద్వారా విత్తనాలను రూపొందించడం మొదలైన తరువాత ఈ దోపిడీ మరింత విస్తరించిపోయింది. 'జిఎమ్' ప్రక్రియ ద్వారా రూపొందుతున్న విత్తనాలలోను మొక్కలలోను 'బాసిలస్ తురింజెనిసిస్'- బి.టి.- అన్న జీవ రసాయనం ఉత్పత్తి అవుతోందట! అందువల్ల ఈ 'జిఎమ్' ప్రక్రియ ద్వారా రూపొందుతున్న విత్తనాలకు 'బిటి' విత్తనాలన్న పేరు వచ్చింది. ఈ 'బిటి' రసాయనం పంటల దిగుబడిని విపరీతంగా పెంచుతుందట. అందువల్ల రైతులకు భారీగా లాభాలు వస్తాయన్నది జరిగిన ప్రచారం! ఈ 'బిటి' పంటలకు రోగాలు, క్రిములు, కీటకాలు సోకవని అందువల్ల 'క్రిమి నాశక' ఔషధాలను పిచ్చికారీ చేయవలసిన పనిలేదన్నది కూడ జరిగిపోయిన ప్రచారం! దీనివల్ల వ్యవసాయ వ్యయం తగ్గి రైతుల నికర ఆదాయం భారీగా పెరిగిపోతుందట! ఈ 'బిటి' విత్తనాల వల్ల ఏ భూమిలోనైనా ఏ పంటలైనా పండించవచ్చునన్నది మరో ప్రచారం! ఇలా 'బిటి' పంటలతో రైతుల సర్వతోముఖ అభివృద్ధి జరిగిపోతుందన్నది 'బహుళ జాతీయ వాణిజ్య సంస్థలు', వారికి తొత్తులుగా దళారీలుగా ప్రతినిధులుగా వ్యవహరించిన వారు చేసిన ప్రచారం! ఈ ప్రచారాన్ని ప్రపంచంలోని ఇతర దేశాలలోకంటె మన దేశంలోని రైతులు ఎక్కువగా విశ్వసించారు. పదిహేను ఏళ్లగా పైగా మన దేశంలో 'బిటి' పత్తిని పండిస్తున్న వ్యవసాయ క్షేత్రాలు విస్తరించిపోవడం ఇందుకు నిదర్శనం..

'జిఎమ్' పరిజ్ఞానంతో రూపొందుతున్న పంటల వల్ల భూమి క్రమంగా నిస్సారమైపోయి నిర్జీవమవుతున్నది అంతర్జాతీయంగా జరుగుతున్న సమాంతర ప్రచారం! 'బిటి' రసాయన విష ప్రభావం వల్ల వ్యవసాయ భూముల, చుట్టుపక్కల పర్యావరణం కలుషితమైపోతుందని కూడ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ 'బిటి' పంటలను తిన్న మానవులు, జంతువులు కూడ చిత్ర విచిత్రమైన మానసిక, శారీరక రుగ్మతలకు గురి అవుతారన్నది కూడ జరుగుతున్న సమాంతర ప్రచారం! కొన్ని ఏళ్లపాటు 'బిటి' పత్తి పండిన భూములు మరే ఇతర పంటలు పండడానికి పనికిరాకుండా పోతున్నాయట, ఇది తొలి దశ! మరికొన్ని ఏళ్ల తరువాత 'బిటి' పంట సహా ఏ పంట కూడ ఈ వ్యవసాయ క్షేత్రంలో పెరగని, పండని దుస్థితి దాపురిస్తుందట! వ్యవసాయ క్షేత్రం క్రమంగా పనికిరాని ఊసర క్షేత్రంగా, ఎడారిగా మారిపోవడానికి 'బిటి' విత్తనాలు ఇలా దోహదం చేస్తున్నాయి. రెండు మూడేళ్లు మంచి దిగుబడులు లభిస్తాయని ఆ తరువాత అకస్మాత్తుగా పంట తుడిచిపెట్టుకొనిపోతుందని కూడ అంతర్జాతీయంగా ప్రచారం జరిగింది. పంటలు ఇలా తుడిచిపెట్టుకొనిపోవడం వల్ల తమకున్న మొత్తం భూమిలో 'బిటి' పత్తిని పండించిన రైతులు కుదేలుమంటున్నారు, ఋణాల ఊబిలో కూరుకొనిపోతున్నారు. భారతదేశంలోని రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం 'జిఎమ్' పంటలని 2008 అక్టోబర్‌లో బ్రిటన్ యువరాజు ఛార్లెస్ ప్రకటించడం 'ప్రపంచీకరణ విధానాల'కు తీవ్రమైన అభిశంసన. మన దేశంలో ఇప్పటివరకు 'బిటి' పత్తి మాత్రమే పండిస్తున్నారు. మిగిలిన 'బిటి' పంటలను సైతం మన నెత్తికెత్తడానికి అనేక 'బహుళ జాతీయ సంస్థలు', వాటికి వత్తాసు పలుకుతున్న శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు.

శాస్త్రీయ పరిశోధనలను నిరోధించరాదన్న సాకుతో మన ప్రభుత్వం 'బిటి' సాంకేతిక పరిజ్ఞాన పరిశోధనలు కొనసాగడానికి అనుమతులను ప్రసాదిస్తోంది. కానీ ఈ తథాకథిత శాస్త్ర పరిశోధనలు, క్షేత్ర ప్రయోగాలు వాణిజ్య వంచనలో భాగమన్నది కొనసాగుతున్న ఆరోపణ. జీవ జన్యు పరివర్తన సాంకేతిక పరిజ్ఞానాన్ని పర్యవేక్షించడానికి ఏర్పాటయిన 'జనటిక్ ఇంజనీరింగ్ అప్రయిజల్ కమిటీ'- జిఇఏసి- జియాక్-వారు 2017 మే నెలలో 'బిటి' ఆవాలను సాగుచేయడానికి అనుమతినిచ్చారు. అంతకు పూర్వం 'బిటి వంకాయల'ను సాగుచేయడానికి సైతం ఈ సాధికార సంస్థవారు అనుమతినివ్వడం వివాదగ్రస్తమైంది. కానీ న్యాయస్థానాల జోక్యం వల్ల, వ్యవసాయ ఉద్యమకారుల వ్యతిరేకత వల్ల ఈ పంటలు ఇంకా మననెత్తికెక్కలేదు. నైతికత లేని వాణిజ్యం 'మానవత్వం మరచిన శాస్త్ర విజ్ఞానం' ప్రమాదకరమన్నది మహాత్మాగాంధీ దశాబ్దుల క్రితం చెప్పిన మాట. కానీ 'ప్రపంచీకరణ'లో భాగంగా నైతికత లేని వాణిజ్యం విశృంఖల విహారం చేస్తోంది, మానవత్వం గురించి తెలియని శాస్త్రపరిజ్ఞానం విస్తరించిపోతోంది!

ఒకప్పుడు, కొన్ని దశాబ్దుల క్రితం వరకు మన దేశంలోని రైతులు విత్తనాలను తమంతతామే తయారుచేసుకునేవారు. కోతకు వచ్చిన పంటలోని శ్రేష్ఠమైన కంకులను గింజలను ఎంపిక చేసుకొని తదుపరి పంటకు విత్తనాలు తయారుచేసుకొనేవారు. కానీ హరిత విప్లవాల పేరుతో పుట్టుకొచ్చిన జీవ 'సాంకేతిక సాంకర్యం'- హైబ్రిడ్- కారణంగా రైతులు ఏటా అధిక ధరలకు విత్తనాలను కొనుగోలు చేయవలసి వచ్చింది. జీవజన్యువుల మార్పిడి-జిఎమ్- ప్రక్రియ మొదలైన తర్వాత 'మోన్‌సాంటో' వంటి సంస్థలు విత్తనాల ఉత్పత్తిపై పంపిణీపై గుత్తాధిపత్యం సాధించాయి. 'ప్రపంచ వాణిజ్య సంస్థ' నిర్దేశిస్తున్న 'పరిజ్ఞాన ముద్ర'ల - పేటెంట్స్- నిబంధనలను ఈ సంస్థలు భయంకరంగా దురుపయోగం చేసుకొనడం నడుస్తున్న చరిత్ర. నాలుగువందల యాబయి గ్రాముల పత్తి విత్తనాలను దాదాపు తొమ్మిది వందల యాబయి రూపాయలు చెల్లించి రైతులు కొనుగోలు చేశారు. అంతకు పూర్వం ఇంకా ఎక్కువ ధరలకు ఈ విత్తనాలు అమ్ముడుపోవడం చరిత్ర. న్యాయస్థానాల జోక్యంతో కొంతమేరకు ఈ ధరలు తగ్గినప్పటికీ, ఇప్పటికీ భయంకరమైన స్థాయిలోనే కొనసాగుతున్నాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన పటిమను పెంచడం పేరుతో ''కొత్త రకం విత్తనాల''ను ప్రవేశపెడుతున్నారు. కానీ నిజానికి ఇవి పాత రకం విత్తనాలేనన్నది కొనసాగుతున్న ప్రచారం. కొత్త రకం 'బిటి పత్తి విత్తనాల'లో కాన్సర్ వ్యాధిని కలిగించే జీవ ధాతువులు కలిసి ఉన్నాయట! ఈ 'బిటి' మూడవ రకం పత్తి విత్తనాలను తెలంగాణ ప్రభుత్వం, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు నిషేధించాయి. అయినప్పటికీ 'మోన్‌సాంటో' వారి దళారీలు ఈ విత్తనాలు అమ్ముతూనే ఉన్నారట! మంగళవారం నాటి సుప్రీం తీర్పునకు ఇదంతా నేపథ్యం.. ఈ తీర్పు ప్రకారం 'మోన్‌సాంటో'కు, భారతీయ వాణిజ్య సంస్థలకు మధ్య ఏర్పడిన 'పేటెంట్' వివాదాన్ని ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం మళ్లీ విచారించనుంది.. ఎవరు తుది విజేతలు కాగలరన్నది ప్రధానం కాదు. 'మోన్‌సాంటో' విత్తనాల నుంచి రైతులకు విముక్తి ఎప్పుడన్నది సమాధానం లభించవలసిన ప్రశ్న..!

'రైతుబంధు' కొందరికేనా?

తెలంగాణ ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభానికి అనేక చారిత్రక కారణాలున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో పాలకుల విధానాలవల్ల వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేయడం వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు కారణమైంది. రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వారిని ఆదుకునేందుకు చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో రైతు రుణమాఫీ, రైతుబంధు లాంటివి ప్రధానమైనవి. రైతుబంధు పథకం ఆచరణలో ఏ విధంగా పనిచేస్తుందో ఒకసారి పరిశీలిద్దాం. ఈ పథకం ఉద్దేశం రైతులకు ఉచితంగా సాలీనా ఎకరానికి 8వేల రూపాయల చొప్పున (ప్రస్తుతం 10వేలు) వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం ఇవ్వాలన్నది ప్రభుత్వ సంకల్పం. అయితే, ఈ పథకం క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలిస్తే ఆచరణలో భూస్వామ్య వర్గానికే లబ్ధి చేకూరుతోంది. వాస్తవ సాగుదారులైన లక్షలాది కౌలుదారులకు ఎలాంటి లబ్ధి చేకూర్చటం లేదన్న విషయాన్ని రైతుల ఆత్మహత్యలే రుజువుచేస్తున్నాయి.

వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు, రుణమాఫీ, రైతుబంధు పథకాలను అమలు జరిపాక కూడా రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయంటే- ఈ విషయాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంది. ఈ పరిశీలనకు ముందు రాష్ట్రంలో సాగుకు అనువుగానున్న భూమి ఎంత? వాస్తవంగా సాగవుతున్నది ఎంత? సాగుకు అనువుగా ఉన్న భూమి రైతుల మధ్య ఏ విధంగా విభజింపబడి ఉంది? అన్న విషయాలను విశ్లేషించాలి. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం విడుదల చేసిన గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర భూవిస్తీర్ణం 112.08 లక్షల హెక్టార్లు. ఇది దాదాపు 2కోట్ల 77 లక్షల ఎకరాలకు సమానం. ఇందులో ప్రభుత్వ అటవీ భూమి, చెరువులు, కుంటలు, కాల్వలు, రైల్వేలు, రోడ్లు, స్కూళ్లు, కాలేజీలు, ఆట స్థలాలు, ప్రభుత్వ ఆఫీసులు, ఆసుపత్రులు మొదలగు వాటి కింద ఉన్న మొత్తం భూమి 84 లక్షల ఎకరాలు. ఇవిపోగా నగరాలు, గ్రామాలు, రియల్ ఎస్టేట్ విస్తరించి ఉన్న భూమి 24 లక్షల ఎకరాలు. వివాదాలున్న భూములు 17 లక్షల 80వేల ఎకరాలు. రైతులవద్ద ఉన్న వ్యవసాయేతర భూముల 11 లక్షల 95వేల ఎకరాలు. ఎలాంటి వివాదాలులేని సాగుకు అనువైన భూమి కోటి 43 లక్షల ఎకరాలు. ఈ భూమిని సాగుచేస్తున్న రైతుల సంఖ్య 58 లక్షల 33వేలు. కోటి 43 లక్షల ఎకరాల భూమిపై 58 లక్షల 33వేల మంది రైతుల భూయాజమాన్యం ఏవిధంగా ఉందో ఒకసారి పరిశీలిద్దాం.

క్ర.	భూ విస్తీర్ణం	పట్టాదారులు	రైతుల్లో వీరి శాతం
1	ఒక ఎకరం లోపు	18 లక్షలు	30.8 శాతం
2	1 నుండి 2 ఎకరాల మధ్య	24 లక్షలు	41.9 శాతం
3	2- 5 ఎకరాల లోపు	11 లక్షలు	18.8 శాతం
4	5-10 ఎకరాల లోపు	4.4 లక్షలు	7.5 శాతం
5	10-25 ఎకరాల లోపు	94,000	1.6 శాతం
6	25-50 ఎకరాల లోపు	6,488	0.1శాతం
7	50 ఎకరాల పైన	298	0.0005 శాతం

సాగుకు అనువుగా ఉన్న భూమి కోటి 43 లక్షల ఎకరాలు. సాగు విస్తీర్ణం ఏటా ఒకేలా ఉండదు. అది వర్షాలపై ఆధారపడుతుంది. మంచిగా వర్షాలు కురిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. లేకుంటే తగ్గుతుంది. సాగు విస్తీర్ణం గరిష్టంగా నమోదైంది కోటి 10 లక్షల ఎకరాలు మాత్రమే. అంటే సాగుకు అనువుగా ఉండి పంట వేయని భూమి ఏటా 33 లక్షల ఎకరాలకు పైగానే ఉంటుంది. ఈ భూమికి సాలీనా అందుతున్న రైతుబంధు ఆర్థిక సహాయం 3,300 కోట్లకు పైగానే ఉంటుంది. పంట పెట్టిన వారికి, పెట్టని వారికి సమానంగా ఆర్థిక సహాయం అందించటం ఎంతవరకు సమంజసం? సాగు కాని భూమిపై రైతులకు సహాయం ఎందుకో ప్రభుత్వమే వివరించాలి. సాగుకు అనువైనప్పటికీ సాగుచేయని ఈ భూస్వాములంతా 25 ఎకరాలకు పైగా భూకమతాలు కలిగివున్న వ్యాపారవేత్తలు, ఉన్నత ఉద్యోగస్థులు, ఎన్‌ఆర్‌ఐలు, వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకున్న బడా భూస్వాములు.

తెలంగాణలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులు 18 లక్షల మంది. వీరికి అందుతున్న ఆర్థిక సహాయం రూ.415 కోట్లు. రెండెకరాల లోపు భూమి వున్న వ్యవసాయదారుల సంఖ్య 24 లక్షలు. వీరికి అందుతున్న ఆర్థిక సహాయం 1,292 కోట్లు. సాగు చేయని భూమికి ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయం 3,300 కోట్లు. మరి ఇంత మొత్తం ఎక్కడికిపోతోంది? ఆ సాయం ఎవరు తీసుకుంటున్నారు?

రాష్ట్ర జనాభాలో 55 శాతం మంది ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. 80 శాతం పైగా రైతులు అర ఎకరం నుండి ఐదు ఎకరాలలోపు భూకమతాలు కలిగివున్నవారే. దాదాపుగా వీళ్లంతా దళితులు, వెనుకబడిన కులాలకు సంబంధించినవారు. 80 శాతం మేరకు వ్యవసాయ కుటుంబాలు రుణాల ఊబిలో కూరుకుపోయినట్లు అనేక పరిశోధనలు తెలుపుతున్నాయి. ఒక్కో కుటుంబం సగటు అప్పు లక్ష రూపాయలకు పైగానే ఉంటుంది. వీళ్లంతా చిన్న, సన్నకారు రైతులే. ఒకటి, రెండు గుంటల భూకమతాలు కలిగిన దళిత కుటుంబాలు లక్షల్లోనే ఉన్నాయి. వీరికి అందుతున్న సహాయం వంద, రెండువందల రూపాయలు మాత్రమే. 'ఎంతగా భూమి ఉన్న భూస్వామి అయితే అంతగా ఆర్థిక సహాయమ'నే విధానం మారాలి. సాయం అందించే తీరు భూకమతాలు కలిగివున్న దళిత, బీసీ రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. పార్టీ ఏదైనా, ప్రభుత్వం ఎవరిదైనా రైతులకు మేలుచేసే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిందే. రైతులలో కూడా సన్న, చిన్నకారు రైతులు, భూస్వాములుంటారు. ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయంలో సింహభాగం అందాల్సింది సన్న, చిన్నకారు రైతులకే. ఎక్కువ మందికి తక్కువ, తక్కువమందికి ఎక్కువ ఆర్థిక సహాయం అనే ప్రభుత్వ విధానాన్ని మార్చుకుని 'ఎక్కువమందికి ఎక్కువ, తక్కువ మందికి తక్కువ ఆర్థిక సహాయమ'నే విధానాన్ని అవలంబించాలి.

అప్పుల ఊబిలో కూరుకుపోతున్న లక్షలాది వాస్తవ సాగుదారులకు ఈ 'రైతుబంధు'ను వర్తింపచేయకుండా సాగుకు ఏమాత్రం పెట్టుబడిపెట్టని వ్యాపారవేత్తలు, ఉద్యోగులకు, ఎన్ఆర్ఐలకు ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ప్రజాధనం కట్టబెడుతోంది. సాగుతో ఎలాంటి సంబంధం లేని వీరికి కేవలం భూమిపట్టా ఆధారంగా ఎకరానికి పది వేల రూపాయలు పంచుతున్నది. ఇది ఎంతవరకు సమంజసం? చాలా గ్రామాల్లో 30నుండి 40శాతం భూమిని కౌలురైతులే సాగు చేస్తున్నారు. కౌలురైతుల్లో ఐదు సంవత్సరాలకు పైగా సాగుచేస్తున్న వారు 80 శాతం మంది ఉన్నారు. కాగా, 7 లక్షల ఎకరాల పోడుభూమి సాగుచేస్తున్న ఆదివాసీ రైతులకు పట్టాలు, చెక్కులు ఇవ్వలేదు. లక్షలాది ఎకరాల సాదాబైనామాలపై భూమి పొందినవారికి, అసైన్డ్ భూమి పొందినవారికి కూడా రైతుబంధు అందడం లేదు. లక్షన్నర ఎకరాల వరకు ఉన్న దేవాలయ, వక్ఫ్‌బోర్డు భూములను సాగుచేస్తున్న పేద రైతులకు ఈ పథకం వర్తించడం లేదు. దాదాపు 40 శాతం మంది అర్హులైన కౌలు రైతులకు రైతుబంధు సహాయం అందడం అందుటలేదు. రైతుల ఆత్మహత్యల్లో 75 శాతం పైగా జరుగుతున్నవి కౌలు రైతులవే అన్న విషయాన్ని పలు అధ్యాయనాలు తెలియజేస్తున్నవి. కౌలు చేస్తున్న సాగుదారులను గుర్తించటానికి 2011లో ఒక చట్టాన్ని తీసుకొచ్చిండ్రు. అదే- '2011 భూఅధీకృత సాగుదారుల చట్టం'. దీని ప్రకారం ప్రతి కౌలురైతుకు గుర్తింపుకార్డు ఇవ్వాలి. తద్వారా వీరంతా రుణాలకు అర్హులవుతారు. 15 లక్షల మంది కౌలు రైతులుండగా 2015-16లో ప్రభుత్వం కేవలం 44వేల మందికి మాత్రమే గుర్తింపు కార్డులిచ్చింది. దీంతో ప్రభుత్వం కౌలు రైతుల పట్ల ఎంతటి చిన్నచూపు చూస్తున్నదో మనం అర్థం చేసుకోవచ్చు.

ఇక 'సమగ్ర భూప్రక్షాళన' పిదప పాస్ పుస్తకాలలో, చెక్కుల ముద్రణలో జరిగిన పొరపాట్లు అన్నీఇన్నీ కావు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ముద్రించిన పాస్ పుస్తకాలు 49,94,937 అయితే అందులో తప్పులు దొర్లినవి 7,38,058. అత్యధికంగా తప్పులు దొర్లిన మండలాలు యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డాగూడూరు, మోత్కూర్. పంపిణీ చేసిన పాస్‌బుక్కులు 42,64,511. వివిధ కారణాలతో పట్టాదారులు గైర్‌హాజరైనవి 1,76,696. వీళ్లంతా ఎన్ఆర్ఐలు, వివిధ రాష్ట్రాలలో స్థిరపడినవారు. ఇప్పటికీ 3లక్షల మంది పైగా రైతులకు ఎలాంటి పాస్‌బుక్కులు, చెక్కులు అందలేదు. వీటన్నింటికి బాధ్యులు రెవెన్యూ సిబ్బంది కాదా? మొదటి దఫా 'రైతుబంధు' సహాయాన్ని రైతులందరికీ అందించకుండానే రెండవ దఫా అందించడంతో మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు.

అసలు రైతు అంటే ఎవరు? భూయజమాని రైతా? లేక సాగుచేసెడివాడా? భూయజమానే రైతు అనే విధానానికి స్వస్తిపలికి 'రైతుబంధు'ను సాగుదార్లందరికీ వర్తింపచేయాలి. మరోసారి భూములన్నింటినీ సర్వేచేసి హద్దులు పెట్టాలి. ఎక్కెడెక్కడ ప్రభుత్వ భూములున్నాయో గుర్తించాలి. రుణమాఫీ, రైతుబంధు పథకాలు క్షేత్రస్థాయిలో అమలు జరుగుతున్న తీరుతెన్నులపై సమగ్ర అధ్యయనం జరిపించే నిమిత్తం వ్యవసాయ రంగ, రెవెన్యూ సిబ్బందికి చెందిన నిపుణులతో కమిటీని వేసి వారి సూచనలు, సలహాల ప్రకారం ఈ పథకాన్ని హేతుబద్ధీకరించాలి. అప్పుడే ప్రభుత్వం ఆశించే ఫలితాలు కనిపిస్తాయి.

-ప్రొ. జి.లక్ష్మణ్ 98491 36104


సమష్టిగా ఆలోచించు.. సాహసంతో సాధించు..

'ప్రపంచ హిందూ కాంగ్రెస్' మూడవ సమ్మేళనం 2022లో థాయిలాండ్ రాజధాని బ్యాంకాంగ్‌లో జరగనుంది. ఈ సంస్థ తొలి సదస్సు నాలుగేళ్ల క్రితం ఢిల్లీలో జరిగింది. ఆ తర్వాత రెండవ ప్రపంచ హిందూ కాంగ్రెస్ సదస్సు అమెరికాలోని చికాగో నగరంలో 2018 సెప్టెంబర్ 7,8,9 తేదీల్లో అంగరంగ వైభవంగా జరిగాయి. 'సమష్టిగా ఆలోచించు, సాహసోపేతంగా లక్ష్యాన్ని సాధించు' అనే ఆశయంతో ఈ సదస్సు జరిగింది. స్వాతంత్ర్యం రాక ముందు, ఆ తర్వాత అంతర్జాతీయ స్థాయిలో హిందూ సదస్సులు లేదా సమ్మేళనాలు జరిగిన దాఖలాలు లేవు.ప్రపంచ వ్యాప్తంగా 60 దేశాల్లో హిందువులు ఉన్నారు. కాని హిందువులకు మాతృస్థానం అఖండ భారత్, నేపాల్ దేశాలే.

1947లో దేశ విభజన తర్వాత హిందువులు 85 శాతం పైగా ఉన్న దేశం భారత్ ఒక్కటే. నేపాల్ హిందూదేశమని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. హిందువులు తమ జీవన విధానంలో, సామాజిక వ్యవస్థలో ఉన్న అసమానతలను గుర్తించి, వాటిని సరిచేసుకుని ఇప్పుడిప్పుడే సంఘటితమయ్యేందుకు రకరకాల వేదికలు పనిచేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా హిందువులకు 'ప్రపంచ హిందూ కాంగ్రెస్' అనే వేదిక ఏర్పాటైంది. ఈ సదస్సును చికాగోలో నిర్వహించేందుకు చారిత్రక కారణముంది. ఈ నగరంలో 125 సంవత్సరాల క్రితం జరిగిన ప్రపంచ మత మహాసభల్లో స్వామి వివేకానంద పాల్గొని తొలిసారిగా హిందూ ధార్మిక జీవన విధానం, విశిష్టతను ప్రపంచానికి ఎలుగెత్తి చాటారు. ఈ ప్రసంగం స్ఫూర్తిగా గత ఏడాది సెప్టెంబర్‌లో హిందూ కాంగ్రెస్ సభలను లాంబార్డ్ యార్క్ టౌన్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సదస్సుకు 60 దేశాల నుంచి మూడువేల మంది ప్రతినిధులు హాజరయ్యారు. 220 మంది వక్తలు ప్రసంగించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, విద్య, రాజకీయాలు, సామాజిక రంగం, మీడియా, మతం, ఆధ్యాత్మికత, హిందువులను సంఘటితం చేయడం అనే పలు అంశాలపై చర్చ జరిగింది.

హిందువుల ప్రాచీన చరిత్ర, నాగరికత, జీవన విధానం, అప్పటి పాలన తీరు, శాసనాలు, చరిత్ర గురించి ప్రపంచానికి తెలిసింది తక్కువ. అపోహలు ఎక్కువ. ప్రాచీన హిందూ నాగరికత నుంచి నేటి వరకు చరిత్రను డాక్యుమెంటేషన్ చేసే ప్రక్రియపై ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. మిగతా మతాల మాదిరిగా హైందవ జాతిని సంఘటితం చేసే లక్ష్యంతో ఈ సదస్సునుప్రారంభిస్తున్నట్లు వరల్డ్ హిందూ కాంగ్రెస్ పేర్కొంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ- 'సింహం ఒంటరిగా సంచరిస్తే అడవి కుక్కలు దాడి చేసి చంపేస్తాయి. అందుకే సంఘటితంగా హైందవ జాతి కదలాలి. గత తప్పిదాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. ప్రపంచంలో ఆధిపత్యం, యుద్ధ కాంక్ష, పొరుగుదేశాలను ఆక్రమించుకోవాలన్న దుర్బుద్ధి లేని హైందవజాతి ఆర్థికంగా సమగ్రాభివృద్ధికి పాటుపడే లక్ష్యంతో ముందుకు నడవాలి..' అన్నారు. హిందూ ధర్మం ప్రాచీనమైనది, ఆధునికత తర్వాత మంచి దశ కలిగి ఉన్నదన్నారు. వ్యక్తులు, వర్గంలా కాకుండా, యావత్తు హిందూ సమాజం ఒక్కటే అనే భావనతో పనిచేస్తే హిందువులు రాణించడం తథ్యమన్నారు. కలిసి పనిచేయాలన్న చైతన్యం, సంకల్పం ఉండాలన్నారు. హిందువులు ఎప్పుడూ సంఘటితంగా కదలరు. వీరందరూ ఏకతాటి పైకి తీసుకురావడం పెద్ద సవాలు అని ఆయన అన్నారు.

ప్రపంచ హిందూ కాంగ్రెస్ ఛైర్మన్ ఎస్‌పీ కొఠారీ మాట్లాడుతూ చైతన్యం, ప్రగతి, సంస్కరణ అనే నినాదంతో 'ప్రపంచ హిందూ కాంగ్రెస్' ప్రజలను సంఘటితం చేసేందుకు సమాయత్తమవుతున్నట్లు చెప్పారు. హిందువుల్లో సంస్కరణలు రావాలని, సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించాలని, అప్పుడే హిందూ ధర్మం వైభవోపేతంగా వర్థిల్లుతుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సమావేశానికి హాజరు కాకపోయినా, మంచి ఉత్తేజ భరిత



మైన సందేశం ఇచ్చారు. ఆలోచనాపరులు, పండితులు, మేధావులు, వివిధ రంగాల్లో సుప్రసిద్ధులు ఒక వేదికపైకి రావడాన్ని స్వాగతించారు. ప్రపంచంలో అత్యంత ప్రాచీనమైనది హిందూమతం. మానవాళి సముద్ధరణకు పాటుపడిన మతం. అనేక సమస్యల పరిష్కారానికి హైందవ ధార్మిక, ఆధ్యాత్మిక జీవన విధానం తోవ చూపిస్తుందన్నారు.

ఆగ్నేయాసియా దేశాలకు ముఖ ద్వారమైన థాయిలాండ్‌లో మూడవ ప్రపంచ హిందూ కాంగ్రెస్ సభలు నిర్వహించాలని తీసుకున్న నిర్ణయానికి బలమైన కారణముంది. మయన్మార్, కంబోడియా, థాయిలాండ్,కొరియా తదితరదేశాల్లో ఒకప్పుడు హిందూ ప్రాచీన చరిత్ర, నాగరికత విశిష్టత ఉన్నాయి. భారతదేశంతో ఉమ్మడి చరిత్ర, సంస్కృతిని ఈదేశాలు పంచుకుంటున్నాయి. హిందువుల పైన ప్రపంచ వ్యాప్తంగా కొన్ని దేశాల్లో జరుగుతున్న దాడులు, ఆకృత్యాలను ఎండగట్టాలని, సామాజిక మీడియాను వేదికగా తీసుకుని ప్రజల్లో చైతన్యం పెంచాలని సదస్సులో తీర్మానించారు. హిందూ యువతలో ఐక్యతను పెంచేందుకు, అందుకు ఉన్న అవరోధాలను తొలగించేందుకు, 'నేను హిందువును' అనే భావనను బలంగా చాటేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను ఖరారు చేయాలని ప్రపంచ హిందూ కాంగ్రెస్ రాజకీయ సదస్సు తీర్మానంలో పేర్కొన్నారు. ప్రభుత్వం చేతిలో బందీలైన దేవాలయాలకు విముక్తి కల్పించాలని తీర్మానించారు.

'హిందువుల్లో క్రియాశీలతను పెంచి, దేవాలయాల యాజమాన్యాన్ని హిందువులకే అప్పగించే విధంగా వత్తిడి తేవాలి. అన్ని దేశాల్లో విస్తరించి ఉన్న హిందువులకు ధార్మిక జీవన విధానం విశిష్టతను తెలియచేసేందుకు కృషి చేయాలి. పారిశ్రామిక రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలి. మతపరమైన విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉపకారవేతనాలు అందించాలి. హిందూ పండితుల మధ్య అంతర్జాతీయ స్థాయిలో అనుసంధానం కల్పించాలి..'అని తీర్మానించారు. కంప్యూటర్ సైన్స్‌కు పితామహుడు, సంస్కృత పండితుతు పాణిని. సంస్కృత భాషలో నాలుగు వేల రూల్స్ ఉన్నాయి. కాని ఇంత ఘన చరిత్ర ఉన్నా, హిందువులు తమగురించి తాము గొప్పగా చెప్పుకోలేని స్థితిలో ఉండేందుకు దారితీసిన కారణాలపై ఆత్మావలోకనం చేసుకోవాలని వక్తలు ప్రొఫెసర్ సుభాష్ కాక్ చెప్పారు. ఆయన హిందువుల గత వైభవం, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలు, మంచి భవిష్యత్తు కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం 3.6 ట్రిలియన్ డాలర్లు ఉంది. 2030 నాటికి 10 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మణిపాల్ గ్లోబల్ బోర్డు చైర్‌పర్సన్ పాయ్ చెప్పారు. చైనా, అమెరికా తర్వాత మూడవ స్థానంలో ఉన్న భారత్ ముఖ్యంగా ఆహారం, అందరికీ వసతి, విద్యుత్, మంచి నీరు, ఆరోగ్యం వంటి రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంపై దృష్టిని సారించాలన్నారు. ప్రాచీన స్మృతిని ఎలా అర్థం చేసుకోవాలనే అంశం, ప్రచారంలో ఉన్న అపార్థాలపై తమిళనాడుకు చెందిన చరిత్రాకారుడు, పురావస్తు శాస్త్రవేత్త నాగస్వామి విశదీకరించారు.


ప్రపంచ హిందూ కాంగ్రెస్ సభలను చూస్తుంటే మినీ కుంభమేళాను దర్శించినట్లుగా ఉందని మీడియా సంస్థలు పేర్కొన్నాయి. భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రసంగం హైలెట్‌గా నిలిచింది. హిందూ ధర్మంలో మహిళలకు ఇచ్చిన గౌరవ ప్రదమైన స్థానాన్ని ఆయన వివరించారు. దేశంలో నదుల పేర్లన్నీ స్త్రీల పేర్లని, భారతీయులు తమదేశాన్ని మాతృభూమిగా ప్రేమతో పిలుచుకుంటారన్నారు. భారతీయ నాగరికత, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుపై భావోద్వేగంతో వెంకయ్య ప్రసంగించి అందరినీ ఆకట్టుకున్నారు. అమెరికాలోని ఇల్లినాయిస్ గవర్నర్ బ్రూస్ రావర్ హాజై సెప్టెంబర్ 11వ తేదీని స్వామి వివేకానంద స్మృతి దినంగా పరిగణిస్తామని సదస్సులో ప్రకటించడం విశేషం. దివంగత మాజీ ప్రధాని వాజపేయి, నోబెల్ బహుమతి గ్రహీత వీఎస్ నైపాల్ మృతికి సంతాపసూచకంగా సదస్సులో నివాళులు అర్పించారు.

ఇతర మతాలకు సంబంధించి ప్రపంచ స్థాయి సదస్సులు ఎప్పుడూ ఏదో ఒకదేశంలో మత ప్రచారంలో భాగంగానే నిర్వహిస్తుంటారు. హిందూ ధర్మంపై అంతర్జాతీయ స్థాయిలో సదస్సులను నిర్వహించడం ఆషామాషీ కాదు. వరల్డ్ హిందూ కాంగ్రెస్ హైందవ సమాజాన్ని వెంటాడుతున్న దురాచారాలను పారద్రోలి, సనాతన, ఆధునిక వాదాల్లో మంచిని స్వీకరించి అన్ని వర్గాలను కలుపుకుని పోయే విధంగా ముందడుగు వేయాలి. ఇతర మతాల్లో హైందవ ధర్మాన్ని అభిమానించే వారిని కూడా దగ్గరకు తీసుకోవాలి. హైందవ ధర్మం విశిష్టమైనది. కానీ, హైందవ జాతిలో అంతర్లీనంగా ఇతర వర్గాలను అణచివేత, సాచివేత లాంటి ఆలోచన విధానాలను రూపుమాపేందుకు వరల్డ్ హిందూ కాంగ్రెస్ నడుం బిగించాలి. అంతర్జాతీయ స్థాయి సదస్సుల్లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అన్ని వర్గాల్లోని హైందవ ధార్మికతను ప్రచారం చేసే వ్యక్తులను భాగస్వాములను చేయాలి. హైందవ జాతికి కుల దురభిమాన వ్యవస్థ శాపంగా పరిణమించింది. ఈ కుళ్లును కడిగేందుకు హిందూ కాంగ్రెస్ సంస్కరణలపై చర్చించాలి. 'మన తాతాలు నేతలు తాగారు, మా మూతులు వాసన చూడండి' అనే తరహాలో ప్రాచీన నాగరికత, చరిత్ర, సంస్కృతిని పదే పదే తలుచుకుని మురిసిపోకుండా,చరిత్రలో దొర్లిన తప్పిదాలు పునరావృతం కాకుండా సమగ్రమైన ప్రణాళికతో, దార్శనికతతో అడుగులు వేయాలి. పరమత సహనం, ఆధ్యాత్మిక సంపద, సర్వే జనాసుఖినో భవంతు అనే భావనను ప్రచారం చేయాలి.

దిశ, దశ లేకుండా ఎటు గాలి వస్తే అటు కొట్టుకుపోతూ నిర్వీర్యమవుతున్న హైందవ జాతిని పట్టిపీడిస్తున్న సామాజిక దురాచారాలపై యుద్ధం ప్రకటిస్తూనే, సాంస్కృతిక వైభవం సాధించేందుకు ప్రపంచ హిందూ కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు హర్షణీయం. కానీ, ఈ చర్చలు, తీర్మానాలు కేవలం కాగితాలకు, వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేసేందుకు పరిమితమైతే ఉపయోగం లేదు. ఇదే జరిగితే 'కార్తీకమాసంలో కులసంఘాల వన సమారాధాన'ల తరహాలో వరల్డ్ హిందూ కాంగ్రెస్ తయారవుతుంది. స్వామి వివేకానంద చెప్పినట్లు- 'లెమ్ము, మేలుకో, చైతన్యంతో సాగిపో.. దార్శనికతతో కదులు, దురాచారాలను సమాధి చేయి, దురహంకారాన్ని వదిలేయ్..' అనే మంచిమాటలను ఆచరించినప్పుడే హైందవ జాతి, హిందూ ధర్మం మహోత్కృష్ట దశకు చేరుకుంటుంది.

-కె.విజయ శైలేంద్ర
98499 98097

'లెజెండ్స్' లిస్ట్‌లో కోహ్లీ!



వీరాజీయం
సెల్: 92900 99512

హమ్మయ్య! డెబ్బై ఒక్క ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై 'ఇండియాను ఇంతకాలం పట్టిపీడించిన గ్రహణం' విడిపోయింది. కోహ్లీ సేనకు ప్రచండభాను సమాన ఘన విజయం లభించింది. మెల్‌బోర్న్ విజయం ఒక కొత్త రికార్డు, సరికొత్త చరిత్ర! అందుకే ముందస్తుగానే భారత్‌లోని క్రికెట్ ప్రియులంతా కలసి చేసిన విజయోత్సాహ నృత్యహేలని ఇప్పుడు కొనసాగించి కోహ్లీ సేనకి జయభేరి వినిపిస్తున్నాం!

మాజీ క్రికెటర్, పాక్ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ అన్నట్లు ఆసియాఖండమంతా- ఇండియన్ టెస్ట్ టీమ్ నెంబర్ వన్ టీమ్‌గా- బస్తీమే సవాల్‌గా- ఇక ఏ ఖండమూ మిగిలిపోకుండా అఖండ విజయాన్ని సాధించింది. ఆమాటకొస్తే క్రికెట్ విషయంలో ఇండియన్ల కృషి, ఇక్కడివారి ప్రోత్సాహం ఇంగ్లీషు దేశాలకే మాత్రం తీసిపోలేదు. రాజపోషణ లభించింది- ఆది నుంచీ క్రికెట్ క్రీడకి. రంజీ ట్రోఫీ లాంటిదెక్కడుంది? కల్నల్ సి.కె.నాయుడు, పటోడీ నవాబ్ లాంటి క్రికెటర్లు మరే దేశంలో వున్నారు? సునీల్ మనోహర్ గవాస్కర్ తరువాతనే మరో బోర్డర్ మహాశయుడు పదివేల 'బోర్డరు'ను దాటాడు. అందుకే ఈ ట్రోఫీ 'బోర్డర్-గవాస్కర్ కప్'గా ఆవిర్భవించింది.

ఐతే- 'బ్యాడ్‌లక్' లేదా శని మహత్యం ఏమిటంటే ఆస్ట్రేలియా గడ్డమీదికి దండయాత్రగా పోయి- 'కంగారూ'ల ముందు కంగారు పడిపోయి- నెత్తిన గ్లోవ్స్ వేసుకుని తిరిగొచ్చిన క్రికెట్ శార్దూలాలే మనవాళ్లంతా. పన్నెండుసార్లు పోయివచ్చారు. 'బెటర్‌లక్ నెక్స్ట్ టైమ్' అనుకుంటూ తిరిగొచ్చారు. బ్యాట్ పట్టుకున్న ప్రతి దేశం, దేశంలో ఆబాలగోపాలం- 'మన్‌డోలే మెర తన్ డోలే'-''మనసు ఉప్పొంగింది'- 'నా ఒళ్లు పులకించిందీ''-అంటూ నాగ నృత్యం చేస్తున్నాయి. నిన్న గవాస్కర్ దగ్గర నుంచీ గల్లీ క్రికెటర్ దాకా అంతా తిట్టారు- 'స్పిన్నర్ లేకుండా బరిలోకి దిగుతారా?'అంటూ. రవిశాస్త్రి, కోహ్లీలను కలిపి దులిపేశారు. ఇవాళ ఆకాశానికి ఎత్తేస్తున్నారు! ఇవాళ 'రవి' ద్రోణుడు. విరాట్ అర్జునుడు అయ్యారు. ఎన్ని రికార్డులురా బాబూ! లెజెండ్‌ల జాబితాలో దర్జాగా ఎక్కి కూర్చున్నాడు-విరాట్ ది కోహ్లీ! ఉబ్బి తబ్బిబ్బయిపోయిన చీఫ్ కోచ్ రవిశంకర శాస్త్రి 'మా క్యాప్టెన్‌కి నేను శాల్యూట్ చేస్తున్నా' అన్నాడు. ఈలోగా అభినందించడానికి దేవకన్యలాగ అక్కడ అవతరించిన 'అనుష్కాశర్మ ద సినిమా స్టార్'ని - అక్కున అదుముకుని మరీ- 'ఇదంతా నువ్వు మావాడి మెడలో వరమాల వేసిన దగ్గరనుంచేనమ్మా, మాకీ గెలుపుల తోరణం లభించిందీ'' అంటూ అభినందించాడు రవి పరమానందంగా..

అసలామాటకొస్తే 'డాన్ బ్రాడ్‌మాన్'ని కూడా చరిత్రలో మొనగాడిగా నిలబెడుతూనే మన భారత బ్యాట్స్‌మన్ పరుగుల రికార్డును ఒక్కరోజు అయినా వదిలిపెట్టకుండా 'ఇండియా'లోనే వుంచేసుకున్నారు. సునీల్ నుంచీ సచిన్ దాకా 'నెంబర్ వన్ బల్లేబాజ్' మనవాడే. ఒక ద్రవిడ్ మరొక గంగూలీ లేని లోటుని జేగీయమానంగా- పుజారా ఛటేశ్వరుడు.. దూకుడు కోహ్లీలు మరింత ఎత్తుగా ఎగురవేస్తూ- పదమూడో ప్రయత్నంలో అయితేనేం ప్రత్యర్థి జట్టుకి, వాళ్ళ నాయకుడు 'పెయిన్'కి మరిచిపోలేని పెయిన్ (నొప్పి)గా మూడు చెఱువుల నీళ్లని తాగించి మరీ- జెండా ఎగరేశాడు!

మరో కొత్త సంప్రదాయం నెలకొంది. 'స్పిన్ మాంత్రికుల' దేశంగా వాసికెక్కిన ఘనత మనది. మన్‌కడ్ నుంచి అనిల్ కుంబ్లే మీదుగా అశ్విన్ దాకా- అది ఏ దేశం బ్యాటింగ్ జట్టు అయినా- వాళ్లని డ్యాన్స్ చేయించేవారు. కానీ ఈసారి- 'విరాట్ ది విన్నర్ బోయ్' అన్నట్లు మన ఫాస్ట్ బౌలర్లు నిజంగా 'పిచ్'మీద పిచ్చిగా నిప్పులు చెరిగారు. బూమ్రా (21వికెట్లు) షమీ (18) ఇషాంత్ (11)లు- 'కంగారూల'ను మొదటి బంతినుంచే కంగారు పెట్టేశారు. ఇక కొత్త 'గోడ'గా కీర్తికిరీట ధారణ చేసిన పూజారా 74.42 సగటుతో- 521 పరుగులు- మూడు శతకాలతో చేసి 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' కిరీటాన్ని ఎగరేసుకుపోయాడు. అమ్మాయి పుట్టిన కారణంగా రోహిత్, పొత్తికడుపులో మెలిదిరిగిన గాయంతో అశ్విన్- ఫైనల్స్‌లో ఆడలేకపోయినా- ఇండియన్ టీమ్‌కు విజయంలో భాగస్వాములు కాదగ్గ క్రికెట్ జెగజెట్టీలే. ఇటువంటి టీమ్.. పాతకొత్తల మేలుకలయికగా రాణించిన జట్టు మరొకటి లేదు. లేదండీ లేదు.. గెలుపు బృందగానమే.. ఇది ఏ ఒక్కరి 'సోలో' షో కాలేదు. అదే గొప్పదనం. మయాంఖ, హనుమ విహారి, కుల్‌దీప్ లాంటి కొత్త కుర్రాళ్లు టెస్ట్‌లో కూడా అద్భుతంగా రాణించిన వృషభ్ పంత్‌లు- 'విజయలక్ష్మికి ప్రత్యేక ఆభూషణాలు'. 2018 ఇండియాకి క్రికెట్ శుభాంతం చేసింది. ఇవాళ ఇండియా- 'ఏ'టీము, 'బి'టీము, 'సి'టీమూ కూడా ఉన్న మైదానంలోకి- కాలికి కత్తికట్టుకున్న కోడిపుంజుల్లా దిగే అవకాశాలున్నాయి. అంతమంది మెరికల్లాంటి కొత్త కుర్రాళ్లు రంగంలోకి దిగారు.

క్రికెట్ ఆట 'బోర్డు' వారికి కనకవర్షం కురిపిస్తున్న అష్టలక్ష్మి. అందుకే ఆ బృందంలో ఆడినవారికి పదిహేను లక్షలు, టీమ్‌లో సభ్యులుగా వున్న ప్లేయర్స్‌కి ఏడున్నర లక్షలు, కోచ్‌లకి, సిబ్బందికీ- ఆ దామాషాలో నగదు పారితోషికాన్ని బోర్డు ప్రకటించింది. ఇక కోహ్లీ టీముకి వూపిరి సలపకుండా- సన్మానాలు, సత్కారాలు, మంగళ హారతులు, బాజా భజంత్రీల స్వాగతాలు మొదలవుతాయి. కానీ, వాళ్లు ఇటురారు అటే వుంటారు. అటు న్యూజిలాండ్‌కి మళ్లీ బంతీ, బ్యాటూ, 'కిట్టూ' పట్టుకుని వెళ్తారు. మళ్లీ వాళ్లు పులిసేలాగ వ్యాయామం, అభ్యాసం చేయడానికే తప్ప 'సంబురాల'కిది టైముకాదు వాళ్లకి.

మన ప్రజలకున్న వెర్రి వ్యామోహాన్ని సంతృప్తిపరచగల వెరైటీ టీము ఇవాళ మనకి వున్నది. టెస్ట్ క్రికెట్‌కి కొత్త 'వూతం' యిచ్చిన 'నెంబర్ వన్' టీమ్ ప్రస్తుత 'కోహ్లీ సేన'- జయహో!


'యు కెన్ పిచ్ ఆన్ క్వ్కీక్స్ నౌ!'

సామాజిక న్యాయానికి అవరోధాలా?

- ఈబీసీలకు పదిశాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ తీరు బాగాలేదు
- సంక్షేమ ఫలాలు అందరికీ అందాలి
- బీసీలు, దళితులు, ఎస్టీల ప్రయోజనాలకు విఘాతం కలగదు
- అవినీతి, ఓటు బ్యాంకు రాజకీయాలకు పుట్టినిల్లు కాంగ్రెస్
- నేను నిద్రపోను, అవినీతిని పారదోలుతాను
- సోలాపూర్ ర్యాలీలో ప్రధాని నరేంద్రమోదీ

సోలాపూర్, జనవరి 9: సామాజిక న్యాయం సాధనలో భాగంగా జనరల్ కేటగిరీలో ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిందని, అందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టం చేశారు. ప్రతిసంక్షేమాన్ని, అన్ని వర్గాలకు మేలు చేసే ప్రభుత్వ లక్ష్యాలను నీరుకార్చడమే ధ్యేయంగా పనిపెట్టుకుని దుష్ప్రచారం చేయడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. రాఫెల్ ఫైటర్ జెట్స్‌పై కాంగ్రెస్ కేంద్రంపై అపనిందలను ప్రచారం చేస్తోందన్నారు. కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. దేశ రక్షణ వ్యవస్థను పటిష్టం చేసే విధానాలపై అభూతకల్పనలను సృష్టించడం కాంగ్రెస్‌కు అలవాటైందన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన బ్రహ్మాండమైన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ దుర్నీతిని ఎండగడుతూ లోక్‌సభ సరైన సమాధానాన్ని ఇచ్చిందన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్ల వల్ల బీసీలు, దళితులు, గిరిజనుల ప్రయోజనాలకు ఎటువంటి విఘాతం కలగదని ఆయన చెప్పారు. లోక్‌సభలో పౌరసత్వ చట్టంకు సవరణలు తెచ్చే బిల్లుకు ఆమోదం లభించిందన్నారు. దీని వల్ల ఈశాన్య రాష్ట్రాలతో దేశంలో స్థిరపడిన ముస్లింయేతరులకు న్యాయం జరుగుతుందన్నారు. వీరంతా ఇరుగుపొరుగు దేశాల్లో హక్కులను కోల్పోయి శరణార్థులుగా భారత్‌కు వచ్చారన్నారు. అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజల హక్కులకు ఎటువంటి భంగం వాటిల్లదన్నారు.

ఆగస్టావెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ కేసులో నిందితుడు మిచిల్ రాఫెల్ తయారీదారులను వ్యతిరేకించే వర్గాలను కూడా సంప్రదించడానికి కారణమేంటని, దీని వెనక ఎవరున్నారని ఆయన ప్రశ్నించారు. మన దేశంలో యూపీఏ హయాంలో దళారుల వ్యవస్థ ఆడిందే ఆటగా సాగిందన్నారు. మిచిల్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో అనేక దిగ్భ్రాంతి కలిగించే అంశాలను వెల్లడించారన్నారు. అన్ని రకాల రక్షణ రంగ ఉత్పత్తుల కొనుగోళ్లలో గత ప్రభుత్వ హయాంలో మిచిల్ దళారీగా పనిచేశారన్నారు. దేశంలో అవినీతి నిర్మూలనకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. 'మోదీని ఎవరు భయపెట్టలేరు. ఖర్చుపెట్టిన ప్రతి ప్రభుత్వ పైసాకు లెక్కచెప్పగలం. ఈ చౌకీదార్ నిద్రపోరు. తప్పులు చేసిన వారిని ప్రజా కోర్టులో ఎండగడుతాం. నన్ను నిరంతరం ద్వేషిస్తూ దుష్ప్రచారం చేస్తారు. కని నేను ఎవరికీ లొంగను. అవినీతిని పారద్రోలేదాకా విశ్రమించను' అని మోదీ అన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు కాంగ్రెస్ పుట్టినిల్లన్నారు. ఈ రాజకీయాల ద్వారా దేశ సమగ్రతకు దెబ్బ అన్నారు. గత నాలుగున్నరేళ్లలో ఎన్డీఏ సర్కార్ చేపట్టిన అనేక ప్రాజెక్టులను ఆయన వివరించారు. జాతీయ రహదారులు, విద్యుత్ ప్రాజెక్టుల గురించి ఆయన పేర్కొన్నారు. అందరికీ ఇల్లు నినాదాన్ని అమలు చేసి చూపిస్తున్నామన్నారు.


సోలాపూర్‌లో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీకి జ్ఞాపికను అందచేస్తున్న మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్. సోలాపూర్-తుల్జాపూర్-ఉస్మానాబాద్ సెక్షన్ వరకు కొత్తగా నిర్మించిన జాతీయ రహదారి (ఎన్‌హెచ్) 52ను ఈ కార్యక్రమంలో జాతికి అంకితం చేశారు.




రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్, ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్‌తో కలిసి జైపూర్‌లో బుధవారం జరిగిన కిసార్ ర్యాలీలో పాల్గొన్న ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ. శివాజీ మహరాజ్ చౌక్‌లో బీజేపీ సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు

వచ్చే ఎన్నికల్లో మోదీని దింపేస్తాం

- జైపూర్ ర్యాలీలో ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ
- రైతులంటే ప్రేమ లేదని వ్యాఖ్య
- సంక్షేమాన్ని అటకెక్కించిందని విమర్శ

జైపూర్. జనవరి 9: రైతులకు న్యాయం చేయడంలో విఫలమైన బీజేపీ ప్రభుత్వానికి హిందీబెల్ట్‌లోని రాష్ట్రాలు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో గట్టి షాక్ ఇచ్చాయని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలు పునరావృతమవుతాయని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు.

బుధవారం ఇక్కడ ఆయన ర్యాలీలో మాట్లాడుతూ రైతులంటే మోదీ ప్రభుత్వానికి గిట్టదన్నారు. రైతుల పట్ల సవతితల్లి ప్రేమను కనపరుస్తున్నారన్నారు. అందుకే రైతులు కేంద్రానికి బుద్ధి చెప్పారన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా చెలగాటమాడుతున్న బీజేపీ సర్కార్‌కు నూకలు చెల్లాయన్నారు. రైతులకు మేలు చేయాలంటే మనసు రావడం లేదా అని ఆయన ప్రశ్నించారు. మోదీ సర్కార్ అవినీతిలో కూరుకుని పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా రైతులకు ఊరట కలిగించే విధంగా రుణాలను మాఫీ చేస్తామన్నారు. కొత్త హరితవిప్లవం సాధనకు అంకురార్పణ చేస్తామన్నారు. రాఫెల్ ఫైటర్ జెట్స్‌పై సమాధానం చెప్పకుండా దాటవేత వైఖరిని అవలంభిస్తున్నారన్నారు. రాఫెల్ డీల్‌పై జేపీసీ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తేకప్పదాటు వైఖరిని అవలంభిస్తున్నారన్నారు. తామడిగిన ప్రశ్నలకు నిర్మలా సీతారామన్ బదులివ్వలేదన్నారు.

మోదీ రైతులకు, కార్మికులకు, ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే ఏ పనిచేయకుండా ఆడంబరమైన ప్రకటనలతో కాలక్షేపం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.







కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆరోపిస్తూ, తక్షణమే కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) పిలుపునిచ్చిన రెండు రోజుల జాతీయ బంద్‌లో భాగంగా బుధవారం, రెండోరోజు శ్రీనగర్‌లో భారీ ప్రదర్శనకు దిగిన కార్మికులు. కోల్‌కతాలో సమ్మె చేస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు, సభ్యులు. పాట్నాలో వామ పక్ష పార్టీలు, కార్మిక సంఘాల నాయకుల అరెస్టు

సార్వత్రిక సమ్మె విజయవంతం!

న్యూఢిల్లీ, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని, ఇందుకు నిరసనగా చేపట్టిన రెండు రోజుల సమ్మె విజయవంతమైందని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) ప్రకటించింది. దేశ వ్యాప్తంగా ఎన్నో నగరాలు, పట్టణాల్లో కార్మికులు ర్యాలీలు, నిరసన ప్రదర్శనలను నిర్వహించినట్టు పేర్కొంది. కార్మిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారని తెలిపింది. ఇలాంటే, జమ్మూకాశ్మీర్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, తెలంగాణ, బీహార్ తదితర రాష్ట్రాల్లో బంద్ ప్రభావం ఎక్కువగా కనిపించింది. పశ్చిమ బెంగాల్‌లో సీపీఎం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆందోళనకారులు కొన్ని ప్రాంతాల్లో రాళ్లు రువ్వగా, మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలను ధ్వంసం చేశారు. కోల్‌కతాలోని రాజాబజార్‌లో నిరసనకారులు రాళ్లు రువ్విన సంఘటనలో పదుల సంఖ్యలో విద్యార్థులు గాయపడ్డారు. పౌర రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. బీజేపీ అన్ని రకాలుగానూ కార్మిక వ్యతిరేక చర్యలను అనుసరిస్తున్నదని ఆరోపిస్తూ తమిళనాడులో చేపట్టిన సార్వత్రిక సమ్మె పాక్షికంగా విజయవంతమైంది. కొన్ని ప్రాంతాల్లో ఆందోళనకారులు రైళ్లను అడ్డుకున్నారు. దీనితో పలు సర్వీసులు ఆలస్యంగా నడిచాయి. తెలంగాణలో ప్రభుత్వ రంగ బ్యాంకులపై సమ్మె ప్రభావం కనిపించింది. మొత్తం మీద దేశ వ్యాప్తంగా చాలా చోట్ల కార్మిక సంఘాలు బంద్‌ను పాటించి, నిరసన ప్రదర్శనలు, ర్యాలీలతో హోరెత్తించినప్పటికీ, చెప్పుకోదగ్గ అవాంఛనీయ సంఘటనలు జరగలేదు.

ముద్ర స్కీంతో ప్రయోజనాలెన్నో..

- రుణాల వినియోగంలో 75 శాతం మంది మహిళలే
- మహిళా సాధికారతకు కట్టుబడి ఉన్నాం
- కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ



న్యూఢిల్లీ, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధికి చేపట్టిన ముద్ర స్కీం వల్ల మహిళలు మంచి లబ్ధి పొందుతున్నారని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంఘటిత రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ఉపయోగించుకునేందుకు మహిళలు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రధానమంత్రి ముద్ర యోజన కింద రూ. 10 లక్షల వరకు రుణాలు ఇస్తున్నామని చెప్పారు. ఈ రుణాలను బ్యాంకులు, ఆర్థిక ఏజన్సీలు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలు ఇస్తున్నాయన్నారు. పరిశ్రమలు స్థాపించాలన్న ఉత్సాహం ఉన్న ప్రతి ఒక్కరు ఈ స్కీంలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంతవరకు ఈ స్కీం కింద 14 కోట్ల మందికి రుణాలు ఇచ్చామన్నారు. ఇందులో 75 శాతం మంది మహిళలే ఉండడం విశేషమన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జౌళి పరిశ్రమ రంగంలో 75 శాతం మంది మహిళలే కార్మిక రంగంలో ఉన్నారని చెప్పారు. బాలికల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల్లో నైపుణ్యం పెంచేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నామన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉందని, రాజకీయ పార్టీలు ఈ బిల్లును ఆమోదించేందుకు ముందుకు రావాలన్నారు. ప్రభుత్వం ఈ బిల్లును ఆమోదించేందుకు సిద్ధంగా ఉన్నా, విపక్షాలు కలిసి రావడం లేదన్నారు.

నేడు మళ్లీ ఉన్నత స్థాయి కమిటీ సమావేశం ?

- సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలోక్‌వర్మ



న్యూఢిల్లీ, జనవరి 9: సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మకు అధికారాలు ఇవ్వడం, అవినీతి ఆరోపణలను పరిశీలించే అంశంపై తుది నిర్ణయం తీసుకునేందుకు అత్యున్నత కమిటీ సమావేశం బుధవారం సమావేశమైంది. ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ ఏకే సిక్రీ, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హాజరయ్యారు. కాగా గురువారం కూడా సమావేశమై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా అంతకు ముందు ఖర్గే ఈ సమావేశానికి హాజరయ్యేందుకు తనకు గడువు కావాలని కోరినట్లు సమాచారం. సుప్రీం కోర్టు తీర్పు చదివిన తర్వాత ఒక నిర్ణయానికి వస్తానని ఆయన లేఖలో కోరినట్లు తెలిసింది. సెలెక్షన్ కమిటీ సమావేశమై అలోక్ వర్మపై తుది నిర్ణయం తీసుకునేందుకు నిన్నటి నుంచి వారం రోజులు గడువు ఇచ్చిన విషయం విదితమే. కాగా సుప్రీంకోర్టు ఆదేశంపై అలోక్ వర్మ బుధవారం సీబీఐ కార్యాలయానికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఆయన గత ఏడాది అక్టోబర్ 23వ తేదీన కేంద్రం ఆదేశంపై సెలవుపై వెళ్లిన విషయం విదితమే. కాగా సుప్రీంకోర్టు అలోక్‌వర్మను పునర్నియమించాలని ఆదేశిస్తూనే, అధికారాలను కత్తిరిస్తూ, ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోరాదని కోరింది.

భక్తుల బృందంపై ఏనుగుల దాడి

- ఒకరు మృతి...

తప్పించుకున్న ఏడేళ్ల బాలుడు

కొట్టాయం (కేరళ), జనవరి 9: శబరిమలకు వెళుతున్న ఒక భక్తుడు ఏనుగు దాడిలో మృతి చెందాడు. ఇక్కడకు 60 కి.మీ సమీపంలోని దట్టమైన అడవిలో స్వామి అయ్యప్ప భక్తుడిని ఏనుగు దాడి చేసి తొక్కేసి చంపేసింది. మృతి చెందిన భక్తుడి పేరు ప రమశివం. ఆయన వయస్సు 35 సంవత్సరాలు. తన ఏడు సంవత్సరాల కుమారుడు, మరో 13 మంది భక్తులతో కలిసి వెళుతున్న ప రమశివంపై ఏనుగుల గుంపు దాడి చేశాయి. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. మిగిలిన భక్తులు ఏనుగులు దాడి చేయడానికి వస్తున్నాయని అక్కడి నుంచి పరుగెత్తి ప్రాణాలను రక్షించుకున్నారు. ఈ దాడి నుంచి ఏడేళ్ల బాలుడు తప్పించుకున్నాడని పోలీసులు చెప్పారు.

ఒడిశాకు ప్రత్యేక హోదా కల్పించాలి

- ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ డిమాండ్

భువనేశ్వర్, జనవరి 9: ఒడిశా రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, కేంద్రం వసూలు చేసే మొత్తం పన్నుల్లో ఇప్పటివరకు రాష్ట్రాలకు ఇస్తున్న నికర వాటా 42శాతాన్ని 50శాతానికి పెంచాలని ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం డిమాండ్ చేశారు. రాష్ట్రాన్ని సందర్శించిన 15వ ప్రణాళికా సంఘం అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సెస్, సర్‌చార్జీలను సైతం సరైన నిష్పత్తిలో విభజించాలని, పన్నుల సంక్రమణను 1971 జనాభా లెక్కల ఆధారంగా చేయాలని కోరారు. అలాగే జీఎస్టీ పరిహారాన్ని మరో పది సంవత్సరాలు పొడిగించాలని, క్లీన్ ఎనర్జీ సెస్‌ను బొగ్గుగనుల ప్రాంతాల సంక్షేమానికి వినియోగించాలని ఆయన అధికారులను కోరారు. తరచూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న ఒడిసా రాష్ట్రంపై కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు మొదటి నుంచీ నిర్లక్ష్యం వహిస్తున్నాయని నవీన్ పట్నాయక్ ఆరోపించారు. తుపాను హెచ్చరికల విభాగం మరింత పటిష్టానికి, తుపాను షెల్టర్ల నిర్మాణానికి కనీసం 1500 కోట్లతో తుపాను విపత్తుల నివారణ ప్యాకేజీని ఇవ్వాలని ఆయన కోరారు. దురదృష్టవశాత్తు ఎంతో చరిత్ర కలిగిన ఒడిసా రాష్ట్రాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నాయని, రాష్ట్రంలోని టెలికాం, రైల్వే నెట్‌వర్క్, బ్యాంకింగ్, హైవేస్ ఇలా అన్ని రంగాల్లోనూ వివక్ష చూపడంతో రాష్ట్రం వెనుకబడి ఉందని ఆయన చెప్పారు. తరచూ ప్రకృతి ప్రకోపానికి బలవుతున్న తమ రాష్ట్రానికి ఉత్తేజం ఇచ్చి, అభివృద్ధి బాటలో పయనింపజేయడానికి కేంద్రం ప్రత్యేక హోదాను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన సమగ్ర వివరాలతో అధికారులకు పత్రాలను సమర్పిస్తున్నట్టు ఆయన చెప్పారు. ప్రణాళికా సంఘం అధికారులు రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులను అంచనా వేసి ఈమేరకు కేంద్రానికి నివేదిక సమర్పించి సహకరించాలని ఆయన కోరారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఎన్‌కె సింగ్ నేతృత్వంలో రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రణాళికా సంఘం అధికారులు సహజ ఖనిజ రాష్ట్రమైన ఒడిసాలోని పలు వాణిజ్య, పారిశ్రామిక సంస్థలను పరిశీలించనున్నారు.

పంటల బీమా ఓ కుంభకోణం

- రాఫెల్ స్కామ్ లాంటిదే ఇది కూడా
- శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాకరే ఆరోపణ

బీడ్ (మహారాష్ట్ర), జనవరి 9: ప్రస్తుతం దేశంలో కేంద్రం అమలు చేస్తున్న పంటల బీమా పథకం అక్రమాల పుట్ట అని, వేల కోట్ల రూపాయల అక్రమాలు జరిగిన ఇది ఇది రాఫెల్ డీల్ కుంభకోణమంత పెద్దదని శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. కరవు ప్రాంతాల్లో పర్యటనలో భాగంగా బుధవారం బీడ్ జిల్లాలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రధాని తరచూ చేసే విదేశీ పర్యటనలు, ఆయన చేసే ప్రసంగాల వల్ల సామాన్యులకు ఎలాంటి ప్రయోజనం చేకూరదని అన్నారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎవరితో పొత్తులు పెట్టుకోవాలా అన్న ఆలోచనలు మాని దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి మోదీ ప్రభుత్వం కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, పంటల చీడపీడల వల్ల రైతులకు ఏర్పడే నష్టాన్ని భర్తీ చేసి రైతులను ఆదుకునే ఉద్దేశంతో ప్రధాని మోదీ 2015లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన చెప్పారు. అయితే బీమా ప్రీమియం చెల్లించిన ఎంతమంది రైతులకు ఆయా ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి పరిహారం అందిందని ఆయన ప్రశ్నించారు. కొంతమంది రైతులకు ఆ కంపెనీల నుంచి రెండు, ఐదు, పది, 50, 100 రూపాయలకు చెక్కులు అందాయని, అసలు ఈ పథకం కింద ఎంతమందికి పరిహారం అందిందని ఆయన నిలదీసారు. ఈ పంటల బీమా పథకంలోనే వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఇది కూడా రాఫెల్ కుంభకోణంలా అతి పెద్దదని ఆయన చెప్పారు. ప్రధాని తరచూ విదేశాల్లో పర్యటిస్తూ తన దేశం మారిపోయిందంటూ గొప్పలు చెబుతున్నారని, ఇక్కడ దేశంలోని రైతుల పరిస్థితి మాత్రం రోజురోజుకు దిగజారుతోందని ఆయన ఆరోపించారు. మీ దృష్టిలోనే దేశం మారిపోయింది తప్ప ఇక్కడ ప్రజల స్థితిగతులు అలాగే ఉన్నాయని అన్నారు. నిజాలు మాట్లాడుతున్న తనకు ఒక్క ఓటు రాకపోయినా ఫర్వాలేదని, అలాగని ఎన్నికల్లో విజయం కోసం అబద్ధాలాడటానికి తాను వ్యతిరేకినని థాకరే స్పష్టం చేశారు.

ఇజ్రాయిల్ మాజీ మంత్రికి జైలు

- గూఢచార్యం జరిపినట్టు ఆరోపణ

జెరూసలెం, జనవరి 9: దేశంలో గూఢచార్య కలాపాలను నిర్వహించి శత్రుదేశమైన ఇరాన్‌కు పలు రహస్యాలను చేరవేసాడన్న ఆరోపణపై ఇజ్రాయిల్ మాజీ మంత్రికి జైలు శిక్షను విధించారు. ఇతనికి 11 సంవత్సరాల వరకు శిక్ష పడవచ్చునని ప్రాసిక్యూటర్లు తెలియజేసినట్టు ఇజ్రాయిల్ న్యాయశాఖ మంత్రిత్వ శాఖ బుధవారం తెలియజేసింది. 1995-96లో ప్రధాని ఇజ్‌తక్ రేబిన్ కేబినెట్‌లో ఎనర్జీ, మౌలిక రంగ శాఖ మంత్రిగా పనిచేసిన గొనెన్ సెగావ్ శత్రుదేశంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు నిరంతరంగా దేశ రహస్యాలు పంపించడం ప్రారంభించాడని ఆతనిపై ఆరోపణ. దీంతో అతనిపై కేసు నమోదు చేసి గత ఏడాది జూలైలో జైలుకు పంపించారు. కాగా, బుధవారం విచారణకు వచ్చిన ఈ కేసులో అతనికి జైలు శిక్షను నిర్ధారించారు. అయితే ఎంతకాలం జైలు శిక్ష విధించేది ఫిబ్రవరి 11న తెలుస్తుందని అధికారులు చెప్పారు. కనీసం అతనికి 11 సంవత్సరాల జైలుశిక్ష పడే అవకాశం ఉందని వారు తెలిపారు.

ఆగ్రాలో పలు పథకాలకు ప్రధాని మోదీ శంకుస్థాపన

ఆగ్రా, జనవరి 9: ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఆగ్రాలో పర్యటించి, సుమారు 2,980 కోట్ల రూపాయల విలువైన పలు పథకాలకు శంకుస్థాపన చేశారు. శుద్ధమైన నీటిని అందించేందుకు ఉద్దేశించిన గంగాజల్ పథకాన్ని ఆయన మొదలుపెట్టారు. దీని ద్వారా ఆగ్రాలోని ప్రతి ఒక్కరికీ శుద్ధమైన తాగు నీరు లభిస్తుంది. ఆగ్రా స్మార్ట్ సిటీ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎస్‌ఎన్ మెడికల్ కాలేజీలో 100 పడకల సామర్థ్యంగల కొత్త విభాగాన్ని ఆయన ప్రారంభించారు. 2016 నవంబర్‌లో ఆగ్రాలో పర్యటించిన మోదీ మళ్లీ ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. అప్పట్లో ఆయన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) పథకం కింద 65 లక్షల ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇలావుంటే, మోదీ పర్యటనపై సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ విమర్శలు గుప్పించారు. రైతులు, కార్మికుల సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అవి ప్రధాని దృష్టికి వస్తాయని ఆశిస్తున్నట్టు ఆయన ట్వీట్ చేశారు.

ఎంపీ హజ్రాపై టీఎంసీ వేటు

కోల్‌కతా, జనవరి 9: పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ, బోల్పూర్ పార్లమెంటు సభ్యుడు అనుమప్ హజ్రాపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) వేటు వేసింది. అంతకు ముందు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరిన బిష్ణుపూర్ లోక్‌సభ సభ్యుడు సౌమిత్ర ఖాన్‌ను కూడా టీఎంసీ బహిష్కరించింది.

వీరిద్దరూ పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని టీఎంసీ ప్రధాన కార్యదర్శి పార్థ చటర్జీ ప్రకటించారు. ఇటీవల కాలంలో పార్టీ అధినాయకత్వాన్ని ఈ ఎంపీలు ఇద్దరూ తీవ్రంగా విమర్శించారు. అంతర్గత ప్రజాస్వామ్యం లేదని ఆరోపించారు. కాగా, బీజేపీలో చేరకముందే సౌమిత్ర ఖాన్‌పై వేటు పడిందని పార్టీ వ్యాఖ్యానించింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీకి చెందిన మరికొంత మంది ఎంపీలు కూడా తమ పార్టీలో చేరుతారని బీజేపీ చేసిన ప్రకటన పట్ల టీఎంసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై వేటు పడిందని, అలాంటి వారు ఇప్పుడు ఎవరూ లేరని వ్యాఖ్యానించింది. బీజేపీ పగటి కలలు కంటున్నదని విమర్శించింది.



సిక్సర్ కొట్టాం..!

❖ మరిన్ని సిక్సర్లకోసం వేచిచూడండి
❖ అగ్రవర్ణాల కోటా బిల్లుపై రాజ్యసభలో రవిశంకర్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 9: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలోనే మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలను ప్రకటిస్తారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటించారు. బుధవారం రాజ్యసభలో అగ్రవర్ణాలకు చెందిన బీదవారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా సంస్థల్లో పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన 124వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం త్వరలోనే మరికొన్ని ముఖ్యమైన నిర్ణయాలు ప్రకటిస్తుందని వెల్లడించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల ఆఖరు రోజు 124వ రాజ్యాంగ సవరణ బిల్లును ఎందుకు ప్రతిపాదించారంటూ ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ మోదీ ప్రభుత్వం ఇంతటితో ఆగటం లేదు.. ముందుముందు మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలు రాబోతున్నాయని అన్నారు. శీతాకాల సమావేశాల ఆఖరు రోజు మోదీ ప్రభుత్వం రిజర్వేషన్ల సిక్సర్ కొట్టింది.. ఇకమీదట కూడా మరిన్ని సిక్సర్లు కొడతామని ఆయన చెప్పారు. క్రికెట్‌లో మ్యాచ్ ముగిసే సమయంలో సిక్సర్లు వస్తాయనేది మీకు తెలియదా..? ఇప్పుడదే జరుగుతోందని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. హిందు, ముస్లిం, సిక్కు, క్రైస్తవ, బౌద్ధ, జైన మతాలకు చెందిన ఉన్నత వర్గాల్లోని బీదవారికి కల్పిస్తున్న 10 శాతం రిజర్వేషన్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పది శాతం రిజర్వేషన్లు పొందేందుకు నిర్ణయించిన అర్హతలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక అవసరాల మేరకు మార్చుకోవచ్చునని ఆయన సూచించారు. ఉన్నత వర్గాల్లోని బీద వారికి రిజర్వేషన్ల సౌకర్యం కల్పించాలని ఎన్నో సంవత్సరాల నుండి ఆలోచిస్తున్నా ఇవ్వలేకపోయారు.. మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఎంతో ధైర్యంతో ఈ రిజర్వేషన్ల సౌకర్యం కల్పిస్తోందని ఆయన తెలిపారు. మీరు ధైర్యం చేయలేకపోయారు.. మేము ధైర్యం చేస్తుంటే ఎందుకు విమర్శిస్తున్నారని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. పది శాతం రిజర్వేషన్ల బిల్లుకు ప్రతిపక్షం హృదయపూర్వకంగా మద్దతు ఇవ్వాలి తప్ప ఇలా షరతులతో కాదని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల కోసమే మోదీ ప్రభుత్వం ఈ రిజర్వేషన్లు కల్పిస్తోందంటూ ప్రతిపక్షం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ భారీ మెజారిటీతో మరోసారి అధికారంలోకి రాబోతోందని రవిశంకర్ ప్రసాద్ చెప్పారు.

బిల్లును స్వాగతిస్తున్నాం

టీడీపీ ఎంపీ సుజనా చౌదరి ❖ హడావిడి ఎందుకన్న సీఎం రమేష్

ఆంధ్రభూమి ప్రతినిధి


న్యూఢిల్లీ, జనవరి 9: అగ్రవర్ణాల పేదలకు (ఈబీసీలకు) పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం రాజ్యసభలో ప్రతిపాదించిన బిల్లుకు తెలుగుదేశం పార్టీ సంపుర్ణ మద్దతు ఇచ్చింది. ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తు కేంద్రం ప్రతిపాదించిన బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు సుజనా చౌదరి, సీఎం రమేష్ పాల్గొన్నారు. సుజనా చౌదరి మాట్లాడుతూ ఈ బిల్లు అగ్రవర్గాల్లో పేదలకు అన్ని విధాలుగా ఉపయోగపడుతుందని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇంత హడావిడిగా ఈ బిల్లును తీసుకురావడం దురదృష్టకరమని అన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని తమ పార్టీ కోరుతున్నప్పటికీ బిల్లును సభలో ప్రవేశపెట్టారని.. అయినప్పటికీ తమ పార్టీ సంపుర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో రిజర్వేషన్లు కల్పిస్తున్నా.. ఉద్యోగాలు ఎక్కడ ఉన్నాయని సుజనా ప్రశ్నించారు. సీఎం రమేష్ మాట్లాడుతూ కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాజ్యసభ చివరి రోజు కేంద్రం ప్రతిపాదించడాన్ని ఆయన తప్పుబట్టారు. గతంలో ఇలాగే ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో యూపీఏ ప్రభుత్వం ఆంధ్ర ప్రదేశ్ విభజన బిల్లును ప్రవేశపెట్టిందని, తరువాత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయిందని ఆయన గుర్తుచేశారు. ఈబీసీ బిల్లును చట్టం చేసి లబ్ధి పొందాలని చూస్తున్న ఎన్‌డీయే ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని రమేష్ జోస్యం చెప్పారు. ఈ చర్చలో కనకమేడల రవీంద్ర కుమార్, తోట సీతారామ లక్ష్మి కూడా పాల్గొన్నారు.

అనాలోచిత నిర్ణయం

'కోటా' బల్లుపై రాజ్యసభలో కపిల్ సిబల్

ఆంధ్రభూమి ప్రత్యేక ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 9: ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగం అంగీకరించక పోవచ్చునని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కపిల్ సిబల్ వాదించారు. బుధవారం రాజ్యసభలో 124వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సిబల్ మాట్లాడుతూ మండల కమిషన్ ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి పది శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించినప్పుడు సుప్రీం కోర్టు కొట్టి వేసింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి రిజర్వేషన్లు ఇచ్చేందుకు వీలులేదని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కపిల్ సిబల్ వాదించారు. తొమ్మిది మంది న్యాయమూర్తులు ఈ అభిప్రాయం వ్యక్తం చేసిన నేపథ్యంలో మీరు ఉన్నత వర్గాల్లోని ఆర్థికంగా వెనుకబడి ఉన్నవారికి పది శాతం రిజర్వేషన్లు ఎలా కల్పిస్తారని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అనాలోచితంగా ఈ బిల్లును తెచ్చిందని ఆయన విమర్శించారు. ప్రముఖ న్యాయవాదులు కోర్టులో ఒక రకంగా వాదిస్తారు.. వారే రాజకీయాల్లోకి వచ్చినప్పుడు మరో రకంగా వాదిస్తారని అంటూ ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీని పరోక్షంగా విమర్శించారు. దీనికి అధికార పక్షం స్పందిస్తూ మీరు కూడా అదేకోవకు చెందినవారా? అంటూ ప్రశ్నించటంతో సభలో ఉన్నవారంతా ఘొల్లుమన్నారు. ఉన్నత వర్గాలకు చెందినవారి ఆదాయం ఎనిమిది లక్షల లోపు ఉంటే వారు ఆర్థికంగా వెనుబడినవారవుతారు కానీ దళిత, బడుగు, బలహీన వర్గాల వారు తమ వార్షిక ఆదాయం అరవై వేల రూపాయలున్నా ఆర్థికంగా వెనుకబడినవారు కారని ఈ బిల్లు చెబుతోందని కపిల్ సిబల్ వాదించారు. ఈ వాదనను అధికార పక్షం తీవ్రంగా ఖండించింది. ఎస్సీ రిజర్వేషన్లలో ఎలాంటి ఆర్థిక షరతులు లేవనేది కపిల్ సిబల్‌కు తెలియదా? అని మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ ప్రశ్నించారు. కపిల్ సిబల్‌కు రిజర్వేషన్ల గురించి ఎలాంటి అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. పది శాతం రిజర్వేషన్లు కూడా పెద్దనోట్ల రద్దు మాదిరిగా గందరగోళం సృష్టిస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రిజర్వేషన్లను అమలు చేయడం చాలా కష్టమని.. ఇదొక ఎన్నికల స్టంట్ తప్ప మరేమీ కాదని సిబల్ విమర్శించారు. లేని ఉద్యోగాలకు రిజర్వేషన్లు కల్పించి ఏం లాభమని ఆయన ఎద్దేవా చేశారు.



చెట్టును ఢీకొట్టిన పోలీసు వాహనం

కానిస్టేబుల్ మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు

పూతలపట్టు, జనవరి 9: చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం తలపలపల్లి గ్రామం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎస్సైతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లు తీవ్రంగా గాయపడ్డారు. విధి నిర్వహణలో భాగంగా జన్మభూమి కార్యక్రమానికి హైవే పెట్రోలింగ్ వాహనంలో వెళుతుండగా స్కూటర్‌ను తప్పించబోయి వీరి వాహనం అదుపుతప్పి చింతచెట్టును ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకొంది. పులిచెర్ల మండలం ఆర్‌కె పేట గ్రామంలో జరిగే జన్మభూమి-మావూరు కార్యక్రమానికి బందోబస్తుకు వెళ్లాలని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో, పూతలపట్టు ఎస్సై మల్లేష్ యాదవ్, హెచ్‌సి మునిరత్నం, పిసిలు ధనశేఖర్ నాయడు, కృష్ణమూర్తి, అశోక్‌కుమారు స్టేషన్‌కు చెందిన హైవే పెట్రోలింగ్ వాహనంలో బయలుదేరారు. ఈ వాహనాన్ని కానిస్టేబుల్ ఆశోక్‌కుమార్ (32) నడుపుతుండగా మార్గమధ్యమైన తలపులపల్లి మలుపు వద్ద హఠాత్తుగా రోడ్డు పైకి ద్విచక్ర వాహనం రావడంతో దానిని తప్పించబోయే క్రమంలో అదుపుతప్పిన పెట్రోలింగ్ వాహనం రోడ్డు పక్కనున్న చింతచెట్టును ఢీకొంది. దీంతో వాహనాన్ని నడుపుతున్న కానిస్టేబుల్ అశోక్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, ఎస్సై మల్లేష్ యాదవ్, హెడ్ కానిస్టేబుల్ మునిరత్నం, కానిస్టేబుళ్లు ధనశేఖర్‌నాయుడు, కృష్ణమూర్తి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వారికి చిత్తూరు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం తమిళనాడులోని వేలూరు సిఎంసికి తరలించారు. మృతుడు అశోక్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

2022 నాటికి గగన్‌యాన్

❖ అగ్రదేశాల సరసన భారత్
❖ అంతరిక్ష పరిశోధనలో మరో మైలు రాయి
❖ ఇస్రో మాజీ చైర్మన్ మాధవన్ నాయర్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9: అంతరిక్షంలోకి భారత వ్యోమగామిని పంపించడానికి గగన్ యాన్ యాత్రకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రణాళికలు రచిస్తోందని ఇస్రో మాజీ చైర్మన్ మాధవన్ నాయర్ చెప్పారు. తద్వారా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపించే సామర్థ్యం ఉన్న అగ్రదేశాల సరసన భారత్ కూడా చేరనుందని ఆయన వ్యాఖ్యానించారు. 2022 నాటికల్లా ఈ మిషన్‌ను సాధింగలదనే నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ పథకానికి తాను ఇస్రో చైర్మన్‌గా ఉన్న కాలంలోనే బీజం పడిందని ఆయన వెల్లడించారు. బుధవారం నాడు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కేంద్రం ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయం 9023 కోట్లకు డిసెంబర్ 28న ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. అంతకంటే ముందే యాత్రకు సంబంధించిన సన్నాహాలు ప్రారంభించామని చెప్పారు. భారత ప్రధాని నరేంద్రమోదీ తన స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో కూడా ఈ అంశాన్ని ప్రస్తావించారని, అయితే ఇందుకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపులు ఇపుడు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ఇస్రో చైర్మన్ కే శివన్ ఈ ప్రాజెక్టుకు చక్కని మార్గదర్శకత్వం ఇస్తున్నారని పేర్కొన్నారు. ఏదైనా సాధించగల సామర్థ్యం ఇస్రోకు ఉందని, దానిన సకాలంలోనే సాధించి చూపుతుందని చెప్పారు. మానవ సహిత యాత్రలో అత్యంత క్లిష్టమైన అంశం అంతరిక్ష యాత్రికులకు శిక్షణ అందించడం, దీని కోసం మాత్రం రష్యా తదితర దేశాలపై కొంత ఆధారపడాల్సి వస్తుంది అని అన్నారు. ముగ్గురు వ్యోమోగాములను తీసుకుని అంతరిక్ష నౌక భూ ఉపరితలం నుండి 400 కిలోమీటర్లు ఎత్తులోని అంతరిక్షంలోకి వెళ్తుందని ఏడు రోజుల పాటు వారిని అంతరిక్షంలో ఉంచేలా ఈ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోందని అన్నారు.

రైల్‌లో బంగారం స్మగ్లింగ్

❖ ముగ్గురి అరెస్టు ❖ రూ.1.08 కోట్ల 3.3 కిలోల బంగారం స్వాధీనం

విశాఖపట్నం(క్రైం), జనవరి 9: రైలులో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముగ్గురిని డీఆర్‌ఐ అధికారులు పట్టుకుని, రూ.కోటి ఏనిమిదిన్నర లక్షల రూపాయల విలువ చేసే 3.3 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) అధికారులు విడుదల చేశారు. గోహౌతి-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లో ఈనెల 4న ఇద్దరు ప్రయాణికులు ప్రత్యేకంగా తయారు చేసిన బనియన్లలో బంగారాన్ని స్మగ్లింగ్ చేస్తున్నట్టు డీఆర్‌ఐ అధికారులకు సమాచారం అందింది. దీంతో విశాఖ రైల్వేస్టేషన్‌కు ఆ ఎక్స్‌ప్రెస్ చేరగానే, డీఆర్‌ఐ అధికారులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని, తనిఖీ చేయగా వారు ధరించిన బనియన్లలో బంగారం ఉన్నట్టు గుర్తించారు. బంగారాన్ని మయన్మార్ నుండి ఇక్కడకు దిగుమతి చేసుకుని సికింద్రాబాద్‌కు రవాణా చేస్తున్నట్టు డీఆర్‌ఐ అధికారులు గుర్తించారు. బంగారానికి సంబంధించి ఎటువంటి కాగితాలు లేకపోవడంతో వారిపై కస్టమ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు వారు పేర్కొన్నారు. వీరితో పాటు స్మగ్లింగ్‌కు ప్రధాన సూత్రధారుడైన మరో వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్టు డీఆర్‌ఐ అధికారులు వెల్లడించారు. కేసు దర్యాప్తులో ఉందని డీఆర్‌ఐ అధికారులు తెలిపారు.



ప్రయాణికులపైకి దూసుకెళ్లిన కారు

నవవధువు సహా ఇద్దరి మృతి

సోమందేపల్లి, జనవరి 9: ఆర్టీసీ బస్సు కోసం రోడ్డువారగా నిలుచున్న ప్రయాణికులపైకి కారు దూసుకెళ్లిన సంఘటనలో నవవధువుతో పాటు మరొకరు మృతి చెందారు. ఈ సంఘటన అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం జరిగింది. జాతీయ రహదారిపై వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి నిలుచున్న వారిపైకి దూసుకెళ్లడంతో గ్రామానికి నరసమ్మ(53), ఆమె కూతురు భారతి(29) మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. భారతికి బుక్కపట్నం మండలానికి చెందిన వెంకటరాముడుతో మూడు రోజుల క్రితం పెళ్లయింది. భర్త, తల్లిదండ్రులతో కలిసి భారతి మెట్టినింటికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

ఏడాదిలోగా పోలవరం పూర్తి

సోమందేపల్లి, జనవరి 9: ఈ ఏడాది చివరి నాటికి జాతీయ ప్రాజెక్టు పోలవరం పూర్తి చేసి రాష్ట్ర ప్రజల ఆశలు నెరవేర్చుతామని జలవనరుల శాఖ మంత్రి మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా సోమందేపల్లి మండలం మల్లాపల్లిలో జరిగిన జన్మభూమి గ్రామసభలో ఆయన మాట్లాడుతూ దేశంలో నిర్మాణ దశలో ఉన్న భారీ ప్రాజెక్టుల్లో పోలవరం ఒకటన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు కేంద్రం సరిపడ నిధులు ఇవ్వకపోయినా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలతో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. పోలవరం ఫిల్లర్లు వేయలేదని ఓ పక్క జగన్, పనులు నత్తనడకన సాగుతున్నాయని మరోపక్క ప్రధాని మోదీ చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను గమనించడం లేదన్నారు. పోలవరం పనులు వేగంగా జరుగుతున్నందునే అవార్డులు వచ్చాయన్నారు.

1వ పేజీ తరువాయి

పెద్దలూ ఆమోదించారు

ప్రభుత్వాలు లబ్ధిదారుల అర్హతలను నిర్ధారించగానే ఈ రిజర్వేషన్లు రాష్ట్రలలో కూడా అమలులోకి వస్తాయి. హిందూ, ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన్ మతాలకు చెందిన అగ్రవర్ణాలలోని ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి పది శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన బిల్లుకు ఆర్‌జేడీ మినహా మిగతా అన్ని ప్రతిపక్షాలు అనుకూలంగా ఓటు వేశాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం పార్లమెంటు శీతాకాల సమావేశాల ఆఖరున పది శాతం రిజర్వేషన్ల బిల్లును తీసుకురావడం పట్ల తీవ్ర స్థాయిలో అభ్యంతరం తెలిపాయి. లోతుగా చర్చ జరిపిన అనంతరం ఈ బిల్లును ప్రతిపాదిస్తే బాగుండేదని, స్టాండింగ్ కమిటీకి పంపించి సమీక్ష జరిపాలని మెజారిటీ ప్రతిపక్షం సభ్యులు సూచించారు. ఎన్‌డీఏ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందేందుకే పది శాతం రిజర్వేషన్ల బిల్లును తెచ్చిందని ప్రతిపక్ష నాయకులు దుమ్మెత్తిపోశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు రోజురోజుకు తగ్గిపోతున్నందున ప్రైవేట్ రంగాన్ని కూడా రిజర్వేషన్ల పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపక్షంతోపాటు కేంద్ర మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ కూడా డిమాండ్ చేశారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించడంతోపాటు న్యాయ శాఖలో కూడా రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా జాతీయ న్యాయ ఎంపిక విధానాన్ని అమలు చేయాలని పాశ్వాన్ కోరారు. రిజర్వేషన్లలో ప్రమోషన్లను ఎందుకు అమలు చేయటం లేదని కాంగ్రెస్ సభ్యురాలు కుమారి షెల్జా డిమాండ్ చేశారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపించాలని సీపీఐ సభ్యుడు రాజా డిమాండ్ చేశారు. 10 శాతం రిజర్వేషన్లు బిల్లును ఆమోదించిన అనంతరం రాజ్యసభ నిరావధికంగా వాయిదా పడింది.

దేశవ్యాప్తంగా ఒకే కోటా

తీసుకురావడం లేదని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లను తెలంగాణ రాష్ట్రం కల్పిస్తోందని చెప్పారు. తెలంగాణలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈబీసీ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తోందన్నారు. అలాగే ఈబీసీ విద్యార్థులకు విదేశాల్లో చదువుకోసం 20 లక్షల ఫెలోషిప్ కూడా ప్రభుత్వం ఇస్తోందని వెల్లడించారు. బడుగు, బలహీన వర్గాలకోసం కేంద్రం ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఒక్కొక్క రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా రిజర్వేషన్లు కల్పిస్తున్నారని.. దేశంలో రిజర్వేషన్లు కల్పించేందుకు ఒకే విధానం ఉండాలని డిమాండ్ చేశారు. జనాభాకు తగ్గట్లుగా ఆయా వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలని సూచించారు. రిజర్వేషన్లు కల్పించుకునేందుకు ఆయా రాష్ట్రాలకు వెసులుబాటు ఇవ్వాలని కేంద్రాన్ని ఆయన డిమాండ్ చేశారు. మహిళల బిల్లుపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీర్మానం చేసి పంపిందని.. ఆ తీర్మానానికి కేంద్రం ఆమోదం తెలియజేయాలని బండా ప్రకాశ్ కోరారు.

ఏ కూటమిలోనూ చేరేది లేదు

బీజేపీ మధ్య పొత్తు ఉండేది. ఆ తర్వాత రెండు పార్టీలు వేరువేరుగా పోటీ చేశాయి. బీజేపీ ఒడిశా అధ్యక్షుడు బసంత్ పండా మాట్లాడుతూ కాంగ్రెస్‌తో బీజేడీకి లోపాయికారి ఒప్పందం ఉందని ధ్వజమెత్తారు. ఒడిశా పీసీసీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్ మాట్లాడుతూ బీజేపీతో బీజేడీకి రహస్య ఒప్పందం ఉందని విమర్శించారు. బీజేపీ వ్యతిరేక శక్తులను బలహీనపరిచేందుకు బీజేడీ పార్టీ కుట్రపన్నుతోందని అన్నారు.

నిన్ను నమ్మరు బాబూ

తగ్గిపోయిందన్నారు. డ్వాక్రా సంఘాలకు 87612 కోట్ల రూపాయలు ఉంటే అప్పట్లో రుణాలతో నేడు 10 వేల కోట్లకుపైబడిందన్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు కొత్తడ్రామా మొదలు పెట్టారని, జాతీయ రాజకీయాలు ప్రభావితం చేస్తానని చెప్పి రోజుకో సీ ఎంను కలిసి కాఫీలు, ఫలహారాలు చేస్తున్నారని ఎద్దేవా చేసారు. బాబు వస్తే జాబు రాకపోగా ఉన్న జాబులు గోవిందా, గోవిందా అని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కోసం తమ ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయలు, కేంద్ర ప్రభుత్వం 2 వేల కోట్ల రూపాయలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. తద్వారా ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన ఆదుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు.

రైతులకు 9 గంటల పాటు పగటి పూట ఉచితంగా వ్యవసాయానికి విద్యుత్తును అందిస్తామని, రైతులు ఆత్మహత్య చేసుకున్నా ప్రమాదవశాత్తు మరణించినా 5 లక్షల రూపాయలు ఆ కుటుంబానికి అందిస్తామని, ఆ సొమ్ముపై అప్పులు ఇచ్చేవారికి ఎటువంటి హక్కు ఉండదని, ఇందుకు కోసం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మొట్టమొదటి తీర్మానం ఇదేనన్నారు. నిరుద్యోగులకు గ్రామస్వరాజ్యం ద్వారా జాబులు ఇస్తామని హామీ ఇచ్చారు.

అంత ఇవ్వలేం... కొంత ఇస్తాం

కృష్ణా యాజమాన్య బోర్డు పరిధిలోని రాష్ట్రాలను కోరారు. అయితే మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలు ససేమిరా అన్నాయి. వాస్తవానికి ఒక్కో రాష్ట్రం నుంచి 5 టీఎంసీల చొప్పున మొత్తం 15 టీఎంసీల కృష్ణా నదీ జలాలు తమిళనాడుకు అందాల్సి ఉంది. అయితే అంత ఇవ్వలేమని, మార్చిలో పరిస్థితిని అధ్యయనం చేసి అందులో సగమైనా ఇచ్చేందుకు యత్నిస్తామని ఆంధ్ర ప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల అధికారులు స్పష్టం చేశారు. తమిళనాడు రాష్ట్రానికి చెందిన నీటి పారుదల శాఖ అధికారులు స్పందిస్తూ రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని విడుదల చేసి తమ రాష్ట్రాన్ని ఆదుకుంటాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇలా ఉండగా కృష్ణా యాజమాన్య బోర్డు చైర్మన్ ఆర్‌కే జైన్ మీడియాతో మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల నీటి వినియోగంపై పరిశీలన చేసి తమిళనాడుకు నీటి విడుదల చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు.

ఇంటింటికీ రెడ్‌క్రాస్ సేవలు అందించండి

విశాఖపట్నం,జనవరి 9: సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్న రెడ్‌క్రాస్ సొసైటీలో ప్రతీ ఒక్కరినీ భాగస్వాములు చేస్తూ ఇక నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటికీ రెడ్‌క్రాస్ సేవలు అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఉమ్మడి రాష్ట్రాల గవర్నర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఈఎస్‌ఎల్ నరసింహన్ పిలుపునిచ్చారు. విశాఖలోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ 2017-18 సంవత్సరాల్లో విశిష్ట సేవలందించిన వారికి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ నరసింహన్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయడంతో మరింత మందికి సంస్థ కార్యకలాపాలను చేరువ చేసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను పొగొట్టి ప్రతీ ఒక్కరూ విధిగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన నగరాల్లో పచ్చదనం పెంపుతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు రెడ్‌క్రాస్ సహకారాన్ని అందించడంతో పాటు,వృద్ధులకు అవసరమైన ఆశ్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలోని పోలీసులంతా రెడ్‌క్రాస్‌లో సభ్యులుగా చేరేలా డీజీపీ చొరవ తీసుకోవాలన్నారు. ఈ రెడ్‌క్రాస్ అవార్డుల ప్రదానోత్సవంలో అత్యధిక అవార్డులు దక్కించుకున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాతో ఇతర జిల్లాల కలెక్టర్లు పోటీ పడాలని సూచించారు. ఈ సందర్భంగా గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సొసైటీకి సహకారం అందించిన పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు, ఉద్యోగులకు గోల్డ్‌మెడల్స్‌ను అందించారు. వీరిలో కృష్ణ జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం, శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ కేవీఎస్ చంద్రశేఖర్ బాబు, జాయింట్ కలెక్టర్-2 పి.రజనీకాంతా రావు, విజయవాడ జాయింట్ కలెక్టర్-2 పి.బాబూరావు, విశాఖ పోర్టుట్రస్ట్ చైర్మన్ ఎంటీ కృష్ణబాబు,ఏపీ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రేచల్ చటర్జీ, విశాఖ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ పి.వేణుగోపాలరావు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ బసంత్ కుమార్ పాల్గొన్నారు. గవర్నర్ నరసింహన్‌ను సొసైటీ సభ్యుల బృందం, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సన్మానించారు.



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రాకు అవార్డు అందజేస్తున్న గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్

ప్రశాంతంగా జేఈఈ

ఊహించినా విధంగా సులువుగా ఫిజిక్స్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 9 : ఐఐటీ జేఈఈ రెండో రోజు ఉభయ రాష్ట్రాల్లో చాలా ప్రశాంతంగా ముగిసింది. తొలి రోజు మంగళవారం నాడు జేఈఈ ఆర్కిటెక్చర్, ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి పేపర్ -2 నిర్వహించగా, బుధవారం నుండి ఇంజనీరింగ్ స్ట్రీం వారికి పేపర్ -1 నిర్వహించింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది చాలా తేలికగా పరీక్ష ప్రశ్నాపత్రం ఉండటంతో అభ్యర్థులు అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎలాంటి దిగ్భ్రాంతికర అంశాలు లేకపోవడంతో పరీక్షార్థులు కుదుటపడ్డారు. ఫిజిక్స్ చాలా కఠినంగా ఉంటుందని ముందు అంతా ఊహించినా అందుకు భిన్నంగా పేపర్ సులువుగా ఉంది.

మాథ్స్ మాత్రం కొన్ని ప్రశ్నలు సుదీర్ఘంగా ఉండటంతో నిర్దిష్ట సమయంలో వారు ప్రశ్నాపత్రాన్ని పూర్తి చేయలేకపోయారు. కెమిస్ట్రీ మాత్రం సులువుగా ఉందని అభ్యర్థులు వ్యక్తం చేశారు. 60 శాతం ప్రశ్నలు ఎన్‌సీఈఆర్టీ పుస్తకాల్లోనివే వచ్చాయని వారు చెప్పారు. గత పదేళ్ల ప్రశ్నాపత్రాలు బాగా పరిశీలించి, అధ్యయనం చేసి ఉంటే వారంతా తేలికగానే ఈ పరీక్ష రాయగలుగుతారని నిపుణలు చెబుతున్నారు. ఫిజిక్స్‌లో మెకానిక్స్ నుండి ఎనిమిది, హీట్, థెర్మోడైనమిక్స్ నుండి ఆరు, కరెంట్ ఎలక్ట్రిసిటీ నుండి ఏడు, ఎలక్ట్రా స్టాటిక్స్ నుండి నాలుగు, ఆప్టిక్స్ నుండి ఐదు ప్రశ్నలు వచ్చాయి. మాథ్స్‌లో 10 ప్రశ్నలు ఆల్జీబ్రా, 8 ప్రశ్నలు క్యాలిక్యులస్, ఆరు కో ఆర్డినేట్ జామిట్రీ, ఆరు ట్రిగనామెట్రి నుండి వచ్చాయి. కెమిస్ట్రీలో 12 ఇనార్గానిక్ నుండి రాగా, 9 ఆర్గానిక్ కెమిస్ట్రీ, 9 ఫిజికల్ కెమిస్ట్రీ నుండి వచ్చాయి.

పంచాయతీలకు భారీగా నామినేషన్లు

తొలిదశ ఎన్నికలకు ముగిసిన పర్వం

ఆంధ్రభూమి బ్యూరో


హైదరాబాద్, జనవరి 9: గ్రామ పంచాయతీల తొలిదశ ఎన్నికలకు నామినేషన్ల పర్వం బుధవారం ముగిసింది. బుధవారం సాయంత్రం ఐదు గంటల వరకు నామినేషన్లు దాఖలయ్యాయి. 30 జిల్లాలలకు సంబంధించి 4479 గ్రామపంచాయతీలకు తొలిదశలో ఎన్నికలు జరుగుతున్నాయి. సోమవారం ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం బుధవారంతో ముగిసింది. తొలి రెండురోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8,524 నామినేషన్లు దాఖలు కాగా, వార్డు సభ్యుల స్థానాలకు 20,902 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన బుధవారం వరకు అనధికారికంగా అందిన సమాచారం ప్రకారం సర్పంచ్‌స్థానాలకు 20 వేల నామినేషన్లు, వార్డుసభ్యులస్థానాలకు 42 వేల నామినేషన్లు దాఖలైనట్టు తెలిసింది. అయితే ఈ లెక్కలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారులు ధృవీకరించలేదు. బుధవారం తెలుగు సంవత్సరం క్యాలెండర్ ప్రకారం తిథి పుష్యమాసం శుక్లపక్షం తదియ కావడంతో పాటు, నామినేషన్లకు చివరిరోజు కావడంతో భారీగానే నామినేషన్లు దాఖలైనట్టు సమాచారం అందింది. తిథులు మొన్న పాడ్యమి, నిన్న విధియకావడం వల్ల తక్కువ సంఖ్యలో నామినేషన్లు వచ్చినట్టు భావిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు అధికారికంగా పోటీ చేసేందుకు వీలులేదు. అందువల్ల పోటీ చేసే వారంతా స్వతంత్ర అభ్యర్థులుగానే బరిలో ఉంటారు. సాధారణంగా రాష్ట్రంలో అధికారంలో ఉండే పార్టీకి చెందినవారే సర్పంచ్ స్థానాలకు, వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికవుతూ ఉంటారు. ఇప్పుడు కూడా టీఆర్‌ఎస్ తన దృష్టిని పంచాయతీ ఎన్నికపై నిలిపింది. అనధికారికంగా అయినాసరే టీఆర్‌ఎస్ పార్టీకి చెందినవారే విజయం సాధించేలా ఈ పార్టీ మండల, అసెంబ్లీ స్థాయి నాయకులు, గ్రామస్థాయి నాయకులు ప్రయత్నిస్తున్నారు. టీఆర్‌ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంట్ సభ్యులు పంచాయతీల్లో గులాబీ జెండాలను ఎగరవేసేందుకు తమవంతు కృషి చేస్తున్నారు.

క్రీడాభూమి

వన్డే ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్‌కు కోహ్లీ సేనతో ముప్పు

దుబాయ్, జనవరి 9: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో కోహ్లీ సేనతో మొదటి స్థానంలో కొనసాగుతున్న ఇంగ్లాండ్‌కు ముప్పు వాటిల్లనుంది. ప్రస్తుతం వన్డే ర్యాంకింగ్స్‌లో ఇంగ్లాండ్ (126) పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, భారత్ (121) పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. రాబోయే ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌ల్లో ఆడే ఎనిమిది వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లను కోహ్లీసేన గెలిస్తే (125) పాయింట్లతో ఇంగ్లాండ్ ఒక్క పాయింట్ దూరంలో నిలవనుంది. శ్రీలంకతో సిరీస్ గెలిచిన న్యూజిలాండ్ ఒక పాయింట్ మెరుగు పరుచుకొని (113) పాయింట్లతో మూడో స్థానంలో ఉంది. ఇక శ్రీలంక ఒక పాయింట్ కోల్పోయి (78) పాయింట్లతో ఎనిమిదో స్థానంలో కొనసాగుతోంది. ప్రపంచకప్‌కు సిద్ధమవుతున్న తరుణంలో ర్యాంకింగ్స్ పెంచుకునేందుకు ఇంగ్లాండ్ , వేల్స్‌లో మే 30 నుంచి జూలై 14వరకు మూడు వారాల్లో 13 మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇది భారత్‌కు మంచి అవకాశం. దీంతో ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాలు నాలుగో స్థానానికి పడిపోతాయి. ఇక బ్యాటింగ్ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ, బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా స్థానాలు టాప్‌లోనే కొనసాగుతున్నాయి. విరాట్ కోహ్లీ (1), రోహిత్ శర్మ (2) స్థానాల్లో ఉండగా, శిఖర్ ధావన్ (9), శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో రాణించిన న్యూజిలాండ్ ఆటగాళ్లు రాస్ టేలర్ (3), మార్టిన్ గుప్తిల్ (14) స్థానాలను సరిపెట్టుకున్నారు. న్యూజిలాండ్ కెప్టెన్ కెన్ విలియమ్సన్ 10వ స్థానం నుంచి 11 స్థానానికి పడిపోగా, హెన్రీ నికోలస్ 21, కొలిన్ మున్రో 58 నుంచి 56 స్థానాల్లో కొనసాగుతున్నారు. శ్రీలంక బ్యాట్స్‌మెన్లలో నిరోషాన్ డిక్వెల్లా ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని 26వ స్థానంలో, తిషారా పెరీరా 22 స్థానాలను మెరుగుపరుచుకొని 65 స్థానాల్లో కొనసాగుతున్నారు.

బౌలింగ్ విభాగంలో బుమ్రా, సహచరుడు కుల్దీప్ యాదవ్, అఫ్గాన్ బౌలర్ రషీద్ ఖాన్‌తో కలిసి మూడో స్థానంలో కొనసాగుతుండగా, యుజువేంద్ర చాహల్ (6), అదిల్ రషీద్‌తో పోటీ పడుతున్నాడు. న్యూజిలాండ్ లెగ్ స్పిన్నర్ ఇష్ సోది (26), ఫాస్ట్ బౌలర్ ఫార్గూసన్ (12) స్థానాల్లో కొనసాగుతున్నారు. లంక కెప్టెన్, సీమర్ లసిత్ మలింగా (46) ర్యాంకులో ఉన్నారు.


సర్దార్ వల్లాభాయ్ పటేల్ క్రికెట్ స్టేడియం


మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియం

మెల్‌బోర్న్‌ను తలదన్నేలా..!

ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియంగా అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లాభాయ్ పటేల్ స్టేడియం (మోటేరా స్టేడియం) త్వరలోనే గుర్తింపును అందుకోనుంది. 2011 వరకు ఈ మైదానంలో 23 వన్డే మ్యాచ్‌లు జరగ్గా, 2015లో మైదానాన్ని కూల్చి, స్టేడియం విస్తరణ పనులు చేపట్టారు. గతంలో ఇక్కడి మైదానంలో 49వేల మంది కూర్చొని మ్యాచ్‌ని వీక్షించేలా నిర్మించగా, ప్రస్తుతం 1,10,000 మంది కూర్చునేలా స్టేడియాన్ని విస్తరిస్తున్నారు. ఇప్పటివరకు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానంగా గుర్తింపును అందుకున్న ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ మైదానంలో 1,00,024 మంది కూర్చొని మ్యాచ్‌ను వీక్షించవచ్చు. ప్రస్తుతం దీనిని సర్దార్ వల్లాభాయ్ పటేల్ స్టేడియం అధిగమించనుంది.

టీమిండియాకు పాక్ మాజీ ఆటగాళ్ల శుభాకాంక్షలు

కరాచి, జనవరి 9: ఆస్ట్రేలియా గడ్డపై టెస్టు సిరీస్ గెలిచి మొదటి ఆసియా ఖండం జట్టుగా చరిత్ర సృష్టించిన భారత జట్టును పాక్ లెజెండరీ ఆటగాడు, మాజీ కెప్టెన్ వసీం అక్రమ్ ప్రశంసించాడు. కెప్టెన్ విరాట్ కోహ్లీతో పాటు జట్టు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. అక్రమ్‌తో పాటు పాక్ మాజీ కెప్టెన్లు ఇమ్రాన్ ఖాన్, మొయిన్ ఖాన్‌లు కూడా ట్వీట్ చేశారు. ఆస్ట్రేలియా గడ్డపై గెలవడం అంతా ఈజీ కాదని, ఈ క్రెడిట్ భారత్‌కు దక్కడం శుభపరిణామం అన్నారు. మాజీ ఓపెనర్ మోసిన్ ఖాన్ మాటాడుతూ భారత్ ఇటు బ్యాటింగ్, అటు బౌలింగ్‌లో రాణించడంతోనే విజయం సాధించిందన్నారు. బ్యాటింగ్‌లో కోహ్లీ, పుజారా, పంత్ రాణించగా, బౌలర్లు ఎలాంటి ఒత్తడి లేకుండా వికెట్లు తీశారన్నాడు. భారత్ 71 ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో చరిత్ర సృష్టించగా, దక్షిణాఫ్రికాతో జరుగుతున్న సిరీస్‌లో పాక్ పేలవమైన ఆట తీరుతో ఓడింది. దీంతో ప్రధాని ఇమ్రాన్ పాక్ క్రికెట్ బోర్డు చైర్మన్ ఎహసాన్ మనితో ఇస్లామాబాద్‌లో బుధవారం సమావేశమయ్యారు.

పాండ్య, రాహుల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ, జనవరి 9: ఓ టీవీ ఛానెల్ ప్రసారమైన షోలో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన టీమిండియా ఆటగాళ్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌కు సీఓఏ (ద కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్) బుధవారం నోటీసులు జారీ చేసింది. దీనిపై 24 గంటల్లో వివరణ ఇవ్వాలని సీఓఏ ఆదేశించింది. పాండ్య తన సహచర ఆటగాడు కేఎల్ రాహుల్‌తో కలిసి 'కాఫీ విత్ కరన్' షోలో ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు సీఓఏ చీఫ్ వినోద్ రాయ్ పిటీతో చెప్పాడు. ఈ ఘటనపై పాండ్య మంగళవారం సోషల్ మీడియా క్షమాపణలు కూడా కోరాడు. తన వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించండి. ఆ షో తీరుకు భిన్నంగా వ్యవహరించినట్లు పేర్కొన్నాడు. ఉద్దేశపూర్వకంగా ఎవరి మనోభావాలు దెబ్బతీయలేదని పునరుద్ఘటించాడు.

'పంత్ నా బిడ్డను ఆడిస్తావా?'


ముంబై, జనవరి 9: ఆస్ట్రేలియా పర్యటనలో స్లెడ్జింగ్, బ్యాటింగ్‌తో వార్తల్లో నిలిచిన రిషబ్ పంత్‌ను ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ భార్య బొన్ని పైన్‌చే ఆ మధ్య బేబి సిట్టర్‌గా కితాబునందుకున్న విషయం తెలిసిందే. అయితే ఇటీవల తండ్రి అయిన టీమిండియా హిట్టర్ రోహిత్ శర్మ కూడా తన కూతురిని ఆడించాలని పంత్‌ను కోరుతున్నాడు. 'గుడ్ మార్నింగ్' అనే పంత్ ట్వీట్‌కు బదులిస్తూ 'శుభోదయం బడ్డీ.. నీవు మంచి బేబీ సిట్టర్‌వని విన్నా. రితికాను సంతోషంగా ఉంచాలంటే నాకు ఓ బేబీ సిట్టర్ కావాలి' అంటూ సరదాగా పేర్కొన్నాడు. ఇదే తరహా బొన్ని పైన్ కూడా మరోసారి పంత్‌ను సాయం కోరింది. 'పంత్ నీవు ఫ్రీగా ఉంటే మరోసారి నా పిల్లల్ని ఆడించవా?' అంటూ ట్వీట్ చేసింది.



భారత్ బౌలింగ్ అద్భుతం

• మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్

ముంబయి, జనవరి 9: ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో భారత బౌలింగ్ లైనప్ బాగుందని, ఎక్కడా ఒత్తిడికి గురికాకుండా బంతులు వేశారని మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కొనియాడారు. భారత బౌలర్లు ఇదే తరహాలో ప్రదర్శన చేయాలన్నాడు.



పుంజుకున్న మార్కెట్


• మళ్లీ 36,000 పాయింట్లకు సూచీ

ముంబయి, జనవరి 9: భారత స్టాక్ మార్కెట్ బుధవారం మరింత పుంజుకుంది. లాభాలను కొనసాగిస్తూ వచ్చిన సెన్సెక్స్ మరోసారి 36,000 పాయింట్లను అధిగమించింది. లావాదేవీలు మొదలైనప్పటి నుంచి సానుకూల ధోరణులు కనిపించడంతో, మదుపరులు కూడా స్టాక్స్ కొనుగోళ్లకు ఆసక్తిని ప్రదర్శించారు. మధ్యలో కొన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ, మొత్తం మీద ట్రేడింగ్ ఆశాజనకంగానే కొనసాగింది. చివరికి 231.98 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్ 36,181.37 పాయింట్ల వద్ద ముగిసింది. ఒకానొక దశలో ఇది అత్యధికంగా 36,250.54 పాయింట్లకు చేరినప్పటికీ, ఆతర్వాత తగ్గుదల నమోదైంది. సస్సెక్స్‌తోపాటు నిఫ్టీ కూడా పెరిగింది. 53 పాయింట్లు లాభపడడంతో నిఫ్టీ 10,855.15 పాయింట్లుగా నమోదైంది. ఎక్కువ సేపు లావాదేవీల్లో నిఫ్టీ 10,870.40-10,749.40 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. చివరికి అటు అత్యధికంగానీ, ఇటు అత్యల్పంగానీ కాకుండా, మధ్యస్తంగా ముగిసింది. బాంబే స్టాక్ మార్కెట్ (బీఎస్ఈ)లో బుధవారం యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ, టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతి, ఐసీఐసీ బ్యాంక్ లాభపడ్డాయి. వీటి షేర్లు సుమారుగా 2.94 శాతం పెరగడం విశేషం. కాగా, ఎస్ బ్యాంక్, టాటా స్టీల్, హీరో మోటోకార్ప్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఫైనాన్స్, ఎన్‌పీటీసీ, హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ కంపెనీల షేర్లు నష్టాలు చవిచూశాయి. వీటి పతనం సగటున 3.07 శాతంగా నమోదైంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధిరేటు 7.3 శాతంగా ఉంటుందని, ఆతర్వాత రాబోయే రెండేళ్ల కాలంలో అది కనీసం 7.5 శాతంగా ఉంటుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేయడంతో స్టాక్ మార్కెట్‌లో సానుకూల సూచీలు కనిపించాయి. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలో స్పష్టం చేసింది. మరోవైపు అమెరికా, చైనా మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధానికి అతి త్వరలో తెరపడుతుందనే వార్త బలంగా వినిపిస్తున్నది. ఈ రెండు అంశాలు ప్రపంచ మార్కెట్‌ను ప్రభావితం చేసింది. అదే విధంగా బీఎస్ఈలోనూ సానుకూల ధోరణులకు కారణమైంది. ఇలావుంటే, డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసిక ఫలితాలను కంపెనీలు వెల్లడించడం మొదలుపెట్టాయి. స్టాక్ మార్కెట్‌పై త్రైమాసిక ఫలితాల ప్రభావం తీవ్రంగా ఉంటుందనేది వాస్తవం. మొత్తం మీద బుధవారం నాటి మార్కెట్ అనుకూల ధోరణుల్లో కొనసాగింది. దేశీయ సంస్థాగత పెట్టుబడిదారు 698.17 కోట్ల రూపాయల విలువైన షేర్లను కొనుగోలు చేయగా విదేశీ మదుపరులు అమ్మిన వాటాల విలువ 553.78 కోట్ల రూపాయలుగా నమోదైంది.

వాణిజ్యభూమి

తగ్గనున్న రొయ్యల ఎగుమతులు


• సుమారు 10 శాతం పతనమవుతుందని ఇక్రా నివేదిక



ముంబయి, జనవరి 9: ఇప్పటి వరకు ముమ్మరంగా జరుగుతున్న భారత రొయ్యల ఎగుమతులు 2019లో సుమారు 7నుంచి 10 శాతం నెమ్మదించే అవకాశం ఉందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా నివేదిక హెచ్చస్తోంది. 2013 నుంచి 2017 వరకు వరుసగా నాలుగేళ్లపాటు రొయ్యల ఎగుమతుల్లో గణనీయమైన అభివృద్ధి చోటుచేసుకుంది. గడచిన నాలుగేళ్లలో మనదేశ ఎగుమతులు ప్రతి యేటా సుమారు 17 శాతం పెరిగాయని ఆ నివేదిక వెల్లడించింది. ప్రధానంగా యూరోపియన్, జపాన్ మార్కెట్లలో డిమాండ్ తగ్గడమే కొత్త యేడాదిలో ఎగుమతుల్లో తగ్గుదలకు దోహదం చేయవచ్చని పేర్కొంది. మరోవైపు చైనా, అమెరికా దేశాల డిమాండ్ కొంతమేర పెరగవచ్చని ఇక్రా అంచనావేసింది. గడచిన యేడాది పది నెలల కాలానికి పరిశీలిస్తే మనదేశ మొత్తం రొయ్యల ఎగుమతుల్లో 11.6 శాతం యూరోపియన్ దేశాలకు, మరో 6.5 శాతం జపాన్‌కు జరిగాయి. 2013 నుంచి 2017 వరకు యూరోపియన్, జపాన్ దేశాల డిమాండ్ స్తబ్ధుగా ఉండేది. ఐతే ఈ కాలంలో సంవత్సరానికి 3.3 శాతం వంతున మనదేశ ఎగుమతులు పెరుగుతూ వచ్చాయి. అలాగే జపాన్ ఎగుమతుల్లో సైతం 4.6 శాతం తగ్గుదల చోటుచేసుకుంది. మనదేశంలో అవసరమైన రొయ్యల ఉత్పత్తి జరగక పోవడంతోబాటు దేశీయంగా వినియోగం పెరగడం వల్ల చైనా డిమాండ్‌కు అనుగుణంగా ఎగుమతులు జగలేదని ఇక్రా వెల్లడించింది. అయితే ఇందుకు సంబంధించిన వాణిజ్య ఒప్పందాలను పునర్వ్యవస్థీకరించుకునేందుకు ఇరు దేశాలు ముందుకు వస్తున్నాయని ఇక్రా నివేదిక వెల్లడించింది. అంతేకాక యూరోపియన్ దేశాలు, జపాన్‌లకు సైతం భవిష్యత్తుల్లో రొయ్యల ఎగుమతులు పెంచుకోవాలని భారత్ భావిస్తోంది. ప్రస్తుతం రొయ్యల ఉత్పత్తిలోనూ, ఎగుమతుల్లోనూ థాయ్‌ల్యాండ్, వియత్నాం అగ్రస్థానంలో ఉన్నాయని ఇక్రా ఉపాధ్యక్షురాలు, కార్పొరేట్ రంగ రేటింగ్స్ అధిపతి పవిత్రా పొన్నయ్య తెలిపారు. 2018లో పది నెలల గణాంకాలు పరిశీలిస్తే మనదేశ మొత్తం రొయ్యల ఎగుమతుల్లో సుమారు 38 శాతం అమెరికాకు జరిగాయి. ప్రధానంగా థాయ్‌ల్యాండ్‌లో డిమాండ్‌కు అనుగుణంగా రొయ్యల ఉత్పత్తి జరగకపోవడం వల్ల మనదేశ రొయ్యలకు అమెరికాలో డిమాండ్ పెరిగిందని పవిత్రా పొన్నయ్య వివరించారు. 2014 నుంచి 17 వరకు ప్రతియేటా అమెరికాకు మనదేశ రొయ్యల ఎగుమతులు 25.2 శాతం వంతున పెరిగాయి.

అమెరికా నుంచి 14వేల అనస్తేషియా ఇంజక్షన్లు వెనక్కి

• సన్‌ఫార్మా నిర్ణయం



హైదరాబాద్, జనవరి 9: అమెరికాలోని తమ సబ్సిడిరీ కంపెనీకి సరఫరా చేసిన అనస్తేషియా ఇంజక్షన్లకు సంబంధించిన 13,918 కార్టన్లను సన్‌ఫార్మాస్యూటికల్ స్వచ్ఛందంగా వెనక్కి రప్పిస్తోంది. తాము సరఫరా చేసిన వెక్యురోనియమ్ బ్రొమైడ్ 10 ఎంజీ, 20 ఎంజీ ఇంజక్షన్లలోని కణరూప ద్రవ్యంలో గాజు అవశేషాలను గుర్తించినందున వాటిని స్వచ్ఛందంగా వెనక్కి రప్పిస్తున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు అమెరికాలోని తమ సబ్సిడిరీ కంపెనీ ఎస్‌పిఐఐకు మూడు లాట్ల ఇంజక్షన్లకు వాడే వెక్యురోనియమ్ బ్రొమైడ్, 10 ఎంజీ లియోఫిలైజ్‌డ్ పౌడర్, ఒక లాటు 20 ఎంజీ లియోఫిలైజ్‌డ్ పౌడర్‌ను ఆసుపత్రి స్థాయి నుంచి వెనక్కి రప్పిస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌కు మంగళవారం లెటర్ ద్వారా తెలియజేసామన్నారు. ఈ ఉత్పత్తులను ఇప్పటికే ఆ దేశంలోని హోల్‌సేల్ కస్టమర్స్, వైద్య సంస్థలకు సరఫరా చేసామని, వాటిని వెంటనే వెనక్కి రప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అయితే తాము పంపిన ఈ ఉత్పత్తులకు సంబంధించి ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, ముందు జాగ్రత్త చర్యగా స్వచ్ఛందంగా వాటిని వెనక్కి రప్పిస్తున్నట్టు సన్ ఫార్మాస్యూటికల్ తెలియజేసింది.

ఇండస్‌ఇండ్ బ్యాంకు నికర లాభాలు రూ.985 కోట్లు

• 5.2 శాతం మేర వృద్ధిరేటు నమోదు

న్యూఢిల్లీ, జనవరి 9: ప్రైవేట్ బ్యాంకింగ్ రంగానికి చెందిన ఇండస్ ఇండ్ బ్యాంకు ఈ ఏడాది మూడవ త్రైమాసిక కాలానికి 5.2 శాతం మేర నికర లాభాల్లో వృద్ధిరేటును సాధించినట్లు ప్రకటించింది. తమ బ్యాంకు రూ.985.03 కోట్ల మేర లాభాలను సాధించిందని పేర్కొన్నారు. అంతకు ముందు ఏడాది తమ బ్యాంకు ఇదే కాలానికి రూ.936.25 కోట్ల నికర లాభాలను సాధించింది. మూడవ త్రైమాసిక కాలంలో రూ.7232.32 కోట్ల రుణాలను ఇచ్చామని చెప్పా రు. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో రూ. 5473.54 కోట్ల రుణాలు ఇచ్చారు. నిరర్థక ఆస్తులు ఆస్తులు 1.16 శాతం ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే నిరర్థక ఆస్తులు 0.46 శాతం నుంచి 0.59 శాతానికి పెరిగాయి.

విమాన ప్రయాణికులకు ఉచిత ట్రావెల్ ఇన్సూరెన్స్!

న్యూఢిల్లీ, జనవరి 9: విమానాల్లో ప్రయాణం చేసే వారికి ఇకపై ఉచిత ట్రావెలింగ్ ఇన్సూరెన్స్ వర్తించనుంది. భారతీ ఏఎక్స్ఏ జనరల్ ఇన్సూరెన్స్‌తో కలిసి ఇండియన్ రైల్వేస్ కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఈ సదుపాయాన్ని అదించనుంది. ఈ విషయాన్ని బుధవారం ఒక ప్రకటనలో ఐఆర్‌సీటీసీ స్పష్టం చేసింది. అయితే, తమ ద్వారా విమానం టికెట్లు కొనుగోలు చేసిన వారికే ఈ సౌకర్యాన్ని వర్తింప చేస్తామని వివరించింది. వారి నుంచి ఒక్క రూపాయి అదనంగా వసూలు చేయకుండా, బీమా మొత్తాన్ని తామే చెల్లిస్తామని ప్రకటనలో పేర్కొంది. వేన్ వే లేదా వన్ ట్రిప్ ప్రాతిపదికన ప్రయాణులకు రూ.50 లక్షలు ఇన్సూరెన్స్ కవరేజ్ ఉంటుందని తెలిపింది.

బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,128.00	1 గ్రాము:	రూ. 3,051.00
8 గ్రాములు:	రూ.25,024.00	8 గ్రాములు:	రూ. 24,408.00
10 గ్రాములు:	రూ. 31,280.00	10 గ్రాములు:	రూ. 30,510.00
100 గ్రాములు:	రూ.3,12,800.00	100 గ్రాములు:	రూ. 3,05,100.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,345.455	1 గ్రాము:	రూ. 3,263.102
8 గ్రాములు:	రూ. 26,763.64	8 గ్రాములు:	రూ. 26,104.816
10 గ్రాములు:	రూ. 33,454.55	10 గ్రాములు:	రూ. 32,631.02
100 గ్రాములు:	రూ. 3,34,545.5	100 గ్రాములు:	రూ. 3,26,310.2
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 332.20	8 గ్రాములు:	రూ. 332.20
10 గ్రాములు:	రూ. 415.00	10 గ్రాములు:	రూ. 415.00
100 గ్రాములు:	రూ. 4,15.00	100 గ్రాములు:	రూ. 4,15.00
ఒక కిలో:	రూ. 41,500.00	ఒక కిలో:	రూ. 41,500.00

గోల్డెన్ పరివార్ హోల్డింగ్స్‌పై సెబీ కొరడా

• నిధులు సమీకరించవద్దని మధ్యంతర ఆదేశం

• ఆస్తుల అమ్మకాలపైనా నిషేధం

న్యూఢిల్లీ, జనవరి 9: కొల్‌కతాకు చెందిన గోల్డెన్ పరివార్ హోల్డింగ్ అండ్ డెవలపర్స్ సంస్థతోబాటు దానికి సంబందించిన ఏడు ప్రమోటింగ్ సంస్థలు ప్రజల నుంచి నిధులు సమీకరించకూడదంటూ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ ఆంక్షలు విధించింది. ఈ సంస్థలు అక్రమ పద్ధతుల్లో నిధుల సమీకరణ చేస్తున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో సెబీ ఈ ఆంక్షల కొరడా ఝుళిపించింది. నిధులిచ్చిన వారికి తిరిగి చెల్లించే మిషతో ఆస్తుల విక్రయాలకు పాల్పడటం వంటి కార్యక్రమాలు చేయకూడదని సైతం సెబీ ఆ సంస్థను ఆదేశించింది. 2011-12 సంవత్సరంలో గోల్డెన్ పరివార్ సంస్థ తొలుత 54 మందికి, తర్వాత 66 మంది వద్ద 11 లక్షల రూపాయలు తీసుకుని ప్రాధాన్యతగల మార్చుకో దగిన వాటాల (ఆర్‌పీఎస్)ను అందజేసిందని, ఆ తర్వాత కూడా మరో 49 మందికి షేర్లు విక్రయించింది. అయితే గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీ సెక్యూరిటీ జాబితాల్లో ఇందుకు సంబంధించి నమోదు చేసుకున్న తర్వాతే ఆర్‌పీఎస్‌కు వెళ్లాలన్న నిబంధనలను గోల్డెన్ పరివార్ సంస్థ ఉల్లంగించిందన్న ఆరోపణలు వచ్చాయని సెబీ పేర్కొంది. అలాగే కంపెనీల చట్టం ప్రకారం రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ (ఆర్‌ఓసీ)లో నమోదు చేసుకోవాల్సి వున్నా ఆ విషయాన్ని కూడా ఉల్లంఘించిందని సెబీ తన మధ్యంతర ఉత్వర్వుల్లో పేర్కొంది. కాగా ఈ కంపెనీతోబాటు, సంబంధిత ప్రమోటర్లు సుకళ్యాణ్ బిశ్వాస్, దేబామితా బిశ్వాస్, బీనా బిశ్వాస్, సుస్మితా బిస్వాస్, సుప్రకాష్ బిశ్వాస్, సుశ్యామల్ బిశ్వాస్, సుకుమార్ బిశ్వాస్‌లకు సెబీ నోటీసులు తాఖీదులు జారీ చేసింది. నిధులు ఇచ్చిన ప్రజలకు వడ్డీలతో సహా తిరిగి చెల్లించాలని ఎందుకు ఆదేశించకూడదో తెలపాలని పేర్కొంది. అంతేకాక ప్రైస్‌మేన్ అడ్వర్టయిజింగ్ లిమిటెడ్‌లో షేర్ల విక్రయానికి అక్రమ పద్ధతులు అనుసరించారంటూ ఆ సంస్థ యజమాని ప్రవీణ్‌కుమార్ అగర్వాల్‌కు 7లక్షల రూపాయల జరిమానా విధిస్తూ సెబీ ఆదేశాలు జారీ చేసింది.

అలా జరిగితే అద్భుతమే!

పోలవరం లక్ష్యాలపై సందేహాలు

- సగానికిపైగా పూర్తికాని కాలువలపై స్ట్రక్చర్లు
- గడువులోగా గ్రావిటీపై నీరివ్వగలరా?

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 9: అవార్డులు, రికార్డులతో నిత్యం వార్తల్లో నిలుస్తున్న పోలవరం జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటిస్తున్న లక్ష్యాలపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన కాలువలపై పలు స్ట్రక్చర్ల నిర్మాణ పనులు ఇంకా ఎక్కడివక్కడే ఉన్నాయి. వీటిలో దాదాపు సగానికి పైగా అసంపూర్తిగా ఉండగా, మరో ఐదు నెలల్లో గ్రావిటీపై నీరివ్వడం ఎలా సాధ్యమనే సందేహం వ్యక్తమవుతోంది. పూర్తికావలసిన పనుల్లో రైల్వే లైను, జాతీయ రహదారిని క్రాసింగ్ చేయాల్సినవి కూడా ఉండటం గమనార్హం.

రాష్ట్రానికి జీవనాడిగా పేర్కొంటున్న పోలవరం ప్రాజెక్టు ద్వారా జూన్‌లో వర్షాల నాటికి గ్రావిటీ ద్వారా కుడి, ఎడమ కాలువలకు నీరందిస్తామని, డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తిచేసి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా గిన్నిస్ రికార్డు సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సైతం ముఖ్యమంత్రి దీన్ని పునరుద్ఘాటించారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిర్మాణ ప్రాంతంలో జరుగుతున్న పనులను పక్కనపెడితే, నీటి పారుదలకు కీలకమైన కుడి, ఎడమ ప్రధాన కాలువలపై పలు స్ట్రక్చర్లు పూర్తికావాల్సివుంది. కుడి ప్రధాన కాలువ విషయానికొస్తే మొత్తం 176.20 కిలోమీటర్ల లైనింగ్ చేయాల్సివుండగా గత నెలలో 157.563 కిలోమీటర్లు పూర్తయింది. స్ట్రక్చర్లు మొత్తం 255 నిర్మించాల్సి ఉండగా ఇప్పటి వరకు 203 పూర్తయ్యాయి. ఎడమ ప్రధాన కాల్వపై మొత్తం 453 స్ట్రక్చర్లకుగాను ఇప్పటి వరకు 153 స్ట్రక్చర్లు మాత్రమే పూర్తయ్యాయి. అంటే మూడోవంతు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన స్ట్రక్చర్ల మాటెలా ఉన్నప్పటికీ లక్ష్యం మేరకు ముఖ్యమంత్రి చెప్పినట్టు గ్రావిటీ ద్వారా విశాఖ వరకు నీరు అందాలంటే మూడు చోట్ల రైల్వే క్రాసింగ్‌లు, మూడు చోట్ల హైవే క్రాసింగ్‌లు పూర్తికావాల్సి వుంది. ముఖ్యంగా ఎడమ ప్రధాన కాలువపై స్ట్రక్చర్లు పూర్తయితేనే విశాఖ వరకు నీటిని తీసుకెళ్లడానికి అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఈ మార్గమధ్యలో ఇంకా స్ట్రక్చర్లు అసంపూర్తిగానే వున్నాయి. కొన్నిచోట్ల పనులు మొదలే కాలేదు. ఇంకొన్ని చోట్ల పనులకు డిజైన్లకు ఆమోదం లభించలేదు. స్ట్రక్చర్ల పనుల విషయాన్ని పరిశీలిస్తే ఎడమ ప్రధాన కాల్వ 1.5 కిలోమీటర్ల వద్ద హెడ్ రెగ్యులేటర్ నిర్మించిన ప్రాంతానికి కాస్తంత దిగువన గండికోట సమీపంలో రెండు స్ట్రక్చర్లు నత్తనడకన సాగుతున్నాయి. ఇందులో ఒక కల్వర్టు నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది. నేలకోట వైపు నుంచి చీపురుపల్లి గ్రామం వైపు పోలవరం, పుష్కర కాల్వలపై ఈ కల్వర్టు నిర్మాణం వల్ల వర్షం నీరు పారేందుకు అవకాశంవుంటుంది. ఈ నిర్మాణం పూర్తికాకపోతే కాల్వ గట్లు వరద నీటి తాకిడికి కోతకు గురయ్యే అవకాశంవుంది. ఇందులో గతంలోనే ఒక పిల్లరు కుంగిపోవడంతో దాన్ని కూల్చేసి, మొత్తం నిర్మాణం తిరిగి చేపట్టారు. అయితే కుంగిన పిల్లర్ వైపు కాన్లను అలాగే వదిలేసి, మిగిలిన భాగాన్ని అసంపూర్తిగా వదిలేశారు. దీనికితోడు ఇదే ప్రాంతంలో మట్టి తవ్వకం జరిగినపుడు వదిలేసిన పెద్ద పెద్ద బండరాళ్లు, మట్టి దిబ్బలతో కాలువ గర్భం అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడ లైనింగ్ కూడా కిలోమీటర్ల మేర జరగలేదు. ఇంకా ఎక్కడ పనులు అక్కడే అన్నట్టుగా వుంది. ఇక్కడ జరుగుతున్న పనులపై పర్యవేక్షణ కొరవడింది. ఈ పనులన్నీ హెడ్ వర్క్సు పరిధిలోకే వస్తాయి. గండికోట సమీపంలో పోలవరం హెడ్ రెగ్యులేటర్ పనుల్లో భాగంగా పుష్కర కాల్వపై నిర్మించిన హెడ్ రెగ్యులేటర్ పనులు కూడా అసంపూర్తిగానే వున్నాయి. కాగా ఎడమవైపు ప్రధానంగా ట్విన్ టన్నెల్స్ పూర్తయితే తప్ప కనెక్టివిటీలు పూర్తయినట్టు కాదు. ఎడమ వైపు 919 మీటర్ల పొడవు కలిగిన టన్నెల్ నిర్మాణ పనులు సుమారు 28.15 శాతం వరకు పూర్తయ్యాయి. మరో 890 మీటర్ల పొడవు కలిగిన టన్నెల్ నిర్మాణం మట్టి పని మాత్రం సుమారు 70 శాతం పూర్తయింది. పోలవరం కనెక్టవిటీలకు సంబంధించి మొత్తం 51.65 శాతం పూర్తయితే, ఎడమ వైపు కనెక్టవిటీలు 48.94 శాతం, కుడి వైపు కనెక్టవిటీలు 73.83 శాతం పనులు పూర్తయ్యాయి. ఇలా ఈ మొత్తం పనులన్నీ పూర్తయితే తప్ప గ్రావిటీ ద్వారా నీరివ్వడానికి అవకాశంలేదు. లైనింగ్, స్ట్రక్చర్ల నిర్మాణ పనుల పరిస్థితి ఇలావుంటే, జూన్‌లో వర్షాలు పడేనాటికి అవన్నీ పూర్తిచేసి, గ్రావిటీ ద్వారా కుడి, ఎడమ ప్రధాన కాలువలకు నీరివ్వగలిగితే నిజంగా ఒక అద్భుతమేనని జలవనరుల నిపుణులు పేర్కొంటున్నారు. ఇదే ప్రభావం మొత్తం ప్రాజెక్టు నిర్మాణంపై కూడా ఉంటుందని వారు చెబుతున్నారు.



1.75 కిలోమీటర్ల వద్ద నిర్మాణంలో వున్న భారీ కల్వర్టు



గండికోట వద్ద నిర్మించిన హెడ్ రెగ్యులేటర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన పుష్కర హెడ్ రెగ్యులేటర్



మట్టిదిబ్బలు, రాళ్లతో నిండిన ఎడమ ప్రధాన కాలువ గర్భం



ఎడమ ప్రధాన కాలువపై గండికోట గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న కల్వర్టు

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy,
PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60



ఎడ్ల బండిపై థియేటర్‌కు వెళుతున్న ఎమ్మెల్యే బుచ్చయ్య, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ తదితరులు

ఎడ్ల బండ్లపై 'ఎన్టీఆర్'ను చూసేందుకు..!

- రాజమహేంద్రవరంలో టీడీపీ నేతల ఉత్సాహం

ఆంధ్రభూమి బ్యూరో

రాజమహేంద్రవరం, జనవరి 9: సినీ చరిత్రలో జాతి గర్వించదగిన మహానటుడు నందమూరి తారకరామారావు అని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నందమూరి అభిమానుల సంఘం గౌరవాధ్యక్షుడు, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ అన్నారు. ఎన్టీఆర్ బయోపిక్ కథానాయకుడు చిత్రం విడుదల సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో బుధవారం టీడీపీ నేతలు, నందమూరి అభిమానులు హల్‌చల్ సృష్టించారు. ఎడ్ల బండ్లపై స్వామి థియేటర్‌కు చేరుకుని సినిమాను వీక్షించారు. ముందుగా నగరంలో రెండెడ్ల బండ్లపై అభిమానులు ర్యాలీ నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గుడా ఛైర్మన్ గన్ని కృష్ణ, డిప్యూటీ మేయర్ వాసిరెడ్డి రాంబాబు తదితర నాయకులు ఎడ్ల బండ్లపై థియేటర్‌కు చేరుకున్నారు.

ప్రైవేటీకరణతో పోటీతత్వం పెరగదు

- గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 9: ప్రైవేటును ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ రంగం పోటీతత్వంతో పనిచేస్తుందనే భావన సరికాదని తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అభిప్రాయపడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖ ఏయూలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అంతకు ముందు ప్రైవేటు యూనివర్శిటీలను ప్రోత్సహించడం ద్వారా ప్రభుత్వ యూనివర్శిటీలు పోటీతత్వంతో పనిచేస్తాయన్న మంత్రి గంటా అభిప్రాయాన్ని గవర్నర్ ఖండించారు. మెరుగైన వైద్యం అందించేందుకు కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహించామని, అయితే ప్రభుత్వ వైద్యాన్ని కార్పొరేట్ ఆసుపత్రులు కబళించాయని గుర్తుచేశారు. సామాన్యులకు విద్య, వైద్యం వంటి వాటిని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని, దీన్ని విస్మరించడం భావ్యం కాదన్నారు. యూనివర్శిటీలు ఇస్తున్న పీహెచ్‌డీలు అదనపు డిగ్రీలుగా మాత్రమే ఉపయోగపడుతున్నాయన్నారు. సాంకేతికతకు పెద్ద పీట వేస్తున్న మనం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ, రియల్ ఇంటిలిజెన్స్ అవసరమన్నారు. విద్యతోనే సమాజం ఫరిడవిల్లుతుందని, విద్య ఒక్కటే గౌరవాన్ని పెంచుతుందన్నారు.



ప్రసంగిస్తున్న గవర్నర్ నరసింహన్

మాతృభూమి
పర స్త్రీలను తల్లులుగా
పర ధనమును మట్టివోలె భావించుటయే
పరమోన్నత సంస్కారము
సరళముగా పొందగల్గు సాయుజ్యమిదే
ఆంధ్రభూమి
గురువారం, 10 జనవరి 2019

మతం వద్దంటే మరణమా?







ఇస్లాం మతాన్ని, స్వదేశాన్ని, అయినవాళ్లను విడిచి దూరంగా వెళుతూ.. బ్యాంకాక్ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయిన 18 ఏళ్ల సౌదీ యువతి రహాఫ్ మొహమ్మద్ అల్ కునన్ ఎట్టకేలకు ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ ఆశ్రయాన్ని పొందింది. వివరాల్లోకి వెళితే..

రహాఫ్ మొహమ్మద్ అల్ కునన్ సౌదీ యువతి. సౌదీ అరేబియా చట్టం ప్రకారం మహిళలు పురుషుల సంరక్షణలో ఉండాలి. మహిళ ఉద్యోగం చేయాలన్నా, ప్రయాణించాలన్నా, పెళ్లి చేసుకోవాలన్నా, చివరికి బ్యాంక్ అకౌంట్ తెరవాలన్నా కుటుంబానికి చెందిన పురుషుల అనుమతి కావాల్సిందే.. అయితే రహాఫ్‌కు చదువుకోవాలని, ఉద్యోగం చేయాలని కోరిక.. కానీ ఇంట్లో ఒప్పుకోలేదు. వెంటనే రహానా సోషల్ మీడియా ద్వారా నాకు స్వేచ్ఛ కావాలి. నేను నా దేశంలో నాకిష్టం వచ్చిన చదువు చదువుకోలేను. ఉద్యోగం చేయలేను. అందుకే నేను దేశం విడిచి వెళ్లాలనుకున్నాను. మా నాన్న నాపై కోపంతో ఉన్నారు. అందుకే నేను నా విషయాలను, ఫొటోలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నాను అని తెలిపింది. తన పరిస్థితి గురించి రహాఫ్ ఎప్పటికప్పుడు సోషల్ మీడియా పోస్టుల ద్వారా వెల్లడిస్తుండడంతో ఆమె అందరి దృష్టినీ ఆకర్షించింది. సౌదీలో మతమార్పిడికి అవకాశం లేదు. అది నేరంతో సమానం. ఆ నేరానికి మరణశిక్ష కూడా విధించే అవకాశం ఉంది. రహాఫ్ ఒకసారి జుట్టు కత్తిరించుకుంది. అందుకుని ఆమె కుటుంబం రహాఫ్‌ను ఇంట్లోనే ఆరు నెలలపాటు బంధించింది. అందుకే రహాఫ్ తనకు ఆశ్రయం కల్పించాలని కోరుతూ ఆమె ప్రపంచంలోని అనేక దేశాలకు విజ్ఞప్తి చేసింది. చివరకు రహానా ఆస్ట్రేలియాకు వెళ్లాలని నిర్ణయించుకుంది. ఆస్ట్రేలియాకు వెళ్లేందుకు కనెక్టింగ్ ఫ్లయిట్ కోసం థాయ్‌ల్యాండ్ ఎయిర్‌పోర్టులో దిగినప్పుడు తనతో పాటు విమానంలో వస్తున్న సౌదీ దౌత్యవేత్త తన పాస్‌పోర్టును లాక్కున్నాడని రహాఫ్ ఆరోపించింది. థాయ్‌ల్యాండ్ ఇమిగ్రేషన్ అధికారులు రహాఫ్ దగ్గర సరైన పత్రాలు లేవని కారణాలు చెప్పి.. మరోవైపు సౌదీ అరేబియాలోని ఆమె కుటుంబం చెంతకు తిప్పి పంపేందుకు ప్రయత్నించారు. రహాఫ్ మాత్రం తనకు సౌదీకి తిరిగి వెళ్లే ఉద్దేశ్యం లేదని చెప్పింది. అయినా వినకుండా ఆమెను జనవరి 7వ తేదీన సౌదీకి వెళ్లేందుకు టికెట్లు తీశారు. కానీ సౌదీ విమానం ఎక్కడానికి నిరాకరించిన రహాఫ్ తనను తాను ఎయిర్‌పోర్టులోని హోటల్ రూంలో బంధించుకుంది. నేను ఇస్లాం మతాన్ని వదిలేశాను. కాబట్టి నా కుటుంబానికి నేనంటే పగ. వారు నన్ను చంపేయడానికి చూస్తున్నారు. కాబట్టి నా జీవితం ప్రమాదంలో ఉంది అంటూ ఆందోళన వ్యక్తం చేసింది రహాఫ్. థాయ్‌ల్యాండ్ ఇమిగ్రేషన్ అధికారులు ఆమెను థాయ్‌లోనే ఉండమన్నారు. కానీ ఆమె ఒప్పుకోలేదు. దీంతో హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థతో పాటు, మానవ హక్కుల సంస్థలు రహాఫ్ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశాయి. అటు ఆస్ట్రేలియా ప్రభుత్వం మాత్రం రహాఫ్ పరిస్థితిని పరిశీలిస్తున్నామని తెలిపింది. ఈ సంఘటనలతో దిగొచ్చిన థాయ్ ఇమిగ్రేషన్ అధికారులు రహాఫ్‌ను థాయ్‌ల్యాండ్‌లోనే ఉండేందుకు అనుమతించారు. కానీ ఆమె ఐక్యరాజ్యసమితి ఆశ్రయం లభించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. థాయ్‌ల్యాండ్ ఐక్యరాజ్యసమితి శరణార్థి ఒప్పందంలో భాగస్వామి కాదు. శరణార్థులకు ఆ దేశం న్యాయపరమైన రక్షణ కల్పించదు. అంతకుముందు థాయ్ న్యాయవాదులు కొందరు ఆమెను స్వదేశానికి పంపే ప్రయత్నాలను ఆపాలని కోర్టును ఆశ్రయించినా, కోర్టు దాన్ని తోసిపుచ్చింది. కానీ రహాఫ్ ఎట్టకేలకు ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ ఆశ్రయం పొందింది. సౌదీ నుంచి పారిపోవాలనుకున్న మహిళల్లో రహాఫ్ మొదటి మహిళ కాదు. గతంలో కూడా ఓ మహిళ విషయంలో ఇలాగే జరిగింది. 24 ఏళ్ల దినా అలీ లస్లూమ్ కూడా సౌదీ నుండి ఆస్ట్రేలియా వెళుతుండగా ఆమెను మనీలా ఎయిర్‌పోర్ట్ నుంచి వెనక్కి తీసుకెళ్లారు. అంతకు మునుపే ఆమె తన ప్రాణాలకు ప్రమాదం ఉందని ఆమె ట్విట్టర్‌లో పోస్టు చేసింది. సౌదీ అరేబియాకు తిరిగి వెళ్లిన లస్లూమ్ పరిస్థితి ఏమిటో.. ఆమె ఎలా ఉందో? ఇప్పటివరకుతెలియలేదు.

విశ్వాసమా? రాజ్యాంగమా??

సందిగ్ధంలో మహిళ

మత విశ్వాసాలు చాలా బలీయమైనవి. మత విశ్వాసాలను నమ్మేవారు హక్కులను వదులుకొని బానిసలుగా బతకడానికి సిద్ధపడతారు. 'మతం మత్తుమందు' అని కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ అన్నారు. 'మతం ఒక భ్రమ, అశాస్త్రీయమైనది' అని ఏంగెల్స్ అన్నారు. వారు అధ్యయనం చేసింది క్రైస్తవ, ఇస్లాం, యూదు మతాలనైనప్పటికీ మత విశ్వాసాలన్నీ అశాస్త్రీయమైనవే. ప్రపంచంలో ఏ మతం మనుషులను మనుషులుగా చూడలేదు. మతాల పెద్దలు ప్రజాస్వామ్య, సామ్యవాద ఉద్యమాలను తొక్కేశారు. విజ్ఞాన పరిశోధనలను వెలుగులోనికి రానివ్వలేదు. కొన్ని మతాలు మనుషులను జాతులుగా విడగొట్టి హీనంగా చూస్తే, హిందూ మతం కులాల పేరుతో అంటరానితనం పాటించి అత్యంత దారుణంగా హింసించింది. ఇక్కడ చాలా కాలం మనువాద సిద్ధాంతం రాజ్యమేలింది. ప్రపంచంలోని దాదాపు అన్ని మతాలు మహిళలను తక్కువగా చూశాయి, చూస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు కోపర్నికస్, గెలీలో, జాన్ కెప్లర్, బ్రూనో వంటివారు క్రైస్తవులైనప్పటికీ ఆ మత పెద్దలే వారిని చిత్రహింసలకు గురిచేసి ప్రాణాలు తీశారు. వారి పరిశోధనా పాత్రలు, గ్రంథాలపై నిషేధం విధించారు. వాటిని తగులబెట్టారు. మత విశ్వాసాలు ప్రపంచ అభివృద్ధిని వందల ఏళ్లు వెనక్కు నెట్టేశాయి. మన దేశం ఇప్పుడు రెండు మతాలకు సంబంధించి రెండు ప్రధాన సమస్యలను ఎదుర్కొంటోంది. ఆ సమస్యలు రెండూ మహిళల సమానత్వానికి సంబంధించినవే. 21వ శతాబ్దంలో భారత్ వంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ఇటువంటి సమస్యలను ఎదుర్కోవడం అత్యంత దారుణం. ఈ మత విశ్వాసాలు రాజకీయాలను కూడా ప్రభావితం చేసే స్థాయికి ఎదగడం బాధాకరం. దేశంలో న్యాయంపై మతం, రాజకీయాలు పైచేయి సాధించడానికి ప్రయత్నించడం దురదృష్టకరం.



కేరళ రాష్ట్రంలోని శబరిమల అయ్యప్ప ఆలయంలోకి మహిళలకు ప్రవేశం కల్పిస్తూ 2018 సెప్టెంబరు 28న ఐదుగురు జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా తీర్పును చదివారు. ''చట్టాలు, సమాజం అందరినీ గౌరవించాలి. దైవత్వం లింగ విభేదాలు చూపించదు. అన్ని వయస్సుల మహిళలు శబరిమల ఆలయంలోకి వెళ్లవచ్చు. భారతదేశంలో మహిళలను దేవతలతో కొలుస్తారు. అలాంటప్పుడు లింగ భేదం చూపలేం. మహిళను తక్కువగా చేసి చూడలేం. మతం అనేది ప్రాథమిక జీవన విధానంలో భాగం. మతం విషయంలో మహిళలకు సమాన హక్కులు ఉండాల్సిందే. శారీరకమైన మార్పులను సాకుగా చూపి మహిళలపై వివక్ష చూపించడం సరికాదు. మహిళలను శబరిమల ఆలయంలోకి ప్రవేశించడాన్ని నిరాకరించడం అంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 25లను ఉల్లంఘించినట్టే'' అని ఆ తీర్పులో పేర్కొన్నారు. ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో నలుగురు ఈ తీర్పుతో అంగీకరించగా, ఏకైక మహిళా జడ్జి జస్టిస్ ఇందూ మల్హోత్రా భిన్నమైన అభిప్రాయాన్ని వెల్లడించడం విశేషం. సతీసహగమనం లాంటి సామాజిక రుగ్మతలు మినహా మతపరమైన విధానాలను తొలగించే దానిపై నిర్ణయం తీసుకునే అంశం కోర్టుకు సంబంధించినది కాదన్నారు. దేశంలో లౌకిక వాతావరణాన్ని కల్పించేందుకు బలంగా నాటుకుపోయిన మతపరమైన ఆచారాల్లో మార్పు చేయవద్దన్నారు. సుప్రీంకోర్టు తీర్పుని దేవస్థానం బోర్డు స్వాగతించింది. తీర్పుపై బోర్డు రివ్యూ పిటిషన్ కూడా వేయదలచుకోలేదు.

అయితే అయ్యప్ప భక్తులు ఈ తీర్పుని వ్యతిరేకించారు. కేరళ రాష్ట్రంలో నిరసన ప్రదర్శనలు చేశారు. మహిళల చేత కూడా చేయించారు. ఆందోళనలు చేశారు. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆలయంలో ప్రవేశించడానికి ప్రయత్నించిన మహిళలను అడ్డుకున్నారు. వారిపై దాడులు కూడా చేశారు. దాంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు. ఎవరి హక్కులనైతే కాపాడటానికి అత్యున్నత న్యాయస్థానం ప్రయత్నిస్తుందో వారు కూడా ఆ హక్కులు వద్దనడం మత మౌఢ్యానికి నిదర్శనం. ఈ నేపథ్యంలో స్త్రీ పురుష సమానత్వం, సామాజిక సంస్కరణలపై ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకునేందుకు కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'వనితా మతిల్' పేరుతో భారీ మానవహారాన్ని ఏర్పాటుచేశారు. 2019 జనవరి 1వ తేదీ సాయంత్రం సముద్ర తీరం వెంబడి రహదారులపై ఉత్తరాన కాసర్‌గాడ్ నుంచి దక్షిణాన తిరువనంతపురం వరకు 620 కిలోమీట్ల పొడవున దాదాపు 40లక్షలమందికి పైగా మహిళలు భారీ మానవహారంలో పాల్గొన్నారు. మహిళా శక్తి ప్రదర్శనలో కేరళ ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయం. చివరకు జనవరి 2వతేదీ తెల్లవారు జామున 3.45 గంటలకు కొందరి రక్షణతో 50ళ్ళ లోపు వయసున్న ఇద్దరు మహిళలు బిందు అమ్మిని (40), కనకదుర్గ (39) తొలిసారిగా ఆలయంలోపలకు ప్రవేశించారు. దీంతో రెచ్చిపోయిన హిందూ మత సంస్థలు, అయ్యప్ప భక్తులు ఆందోళనకు దిగారు. ఈ నెల 3వతేదీ కేరళ బంద్‌కు పిలుపుఇచ్చారు. ఆ రాష్ట్రంలో ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థిలు నెలకొన్నాయి. ఈ సంఘటనలకు రాజకీయ రంగు పులుముకున్నది.

ఇక రెండవది ముస్లింలకు చెందిన ట్రిపుల్ తలాక్ అంశం. ఇది కూడా స్త్రీ పురుష సమానత్వానికి చెందినదే. ముస్లింలలో భర్తలు భార్యలకు విడాకులు ఇవ్వడం అత్యంత సులభమైన పని, ఏకపక్షమైనది. న్యాయస్థానంతో సంబంధం లేకుండా ఎలాంటి కారణం చెప్పకుండా ఏకపక్షంగా భర్త మూడుసార్లు తలాక్ చెప్పి ఇచ్చే విడాకులను తలాక్ అంటారు. మరో మూడురకాలుగా కూడా భార్యాభర్తలు విడిపోతారు. అయితే ఈ తలాక్ పద్ధతే అత్యంత దారుణమైనది. భార్యను నిరాశ్రయురాలిని చేస్తుంది. భర్తకు భార్య తలాక్ పద్ధతిలో విడాకులు ఇచ్చే అవకాశం లేదు. ట్రిపుల్ తలాక్‌ను సుప్రీం కోర్టు 2017లో రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. అయినా ఈ సంప్రదాయం ఇంకా కొనసాగుతోంది. ఈ తీర్పు వెలువడిన తరువాత కూడా దేశవ్యాప్తంగా దాదాపు 45 మంది భర్తలు తమ భార్యలకు తలాక్ చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు వారికి అండగా నిలవలేకపోయింది. తలాక్ చెప్పిన భర్త మరో పెళ్లి చేసుకుంటున్నాడు. సరైన చట్టాల రూపకల్పన ద్వారా స్త్రీ పురుషులిద్దరికీ సమాన న్యాయం అందించవలసిన బాధ్యత పార్లమెంటుపై వుంది. ముస్లిం పర్సనల్ లా తప్ప అన్ని వర్గాల పర్సనల్ లాలను పార్లమెంటు సంస్కరించింది. ముస్లిం పర్సనల్ లా సంస్కరణకోసం ముస్లిం మహిళలే దశాబ్ద కాలంగా ప్రయత్నాలు చేశారు. వారు సంఘటితమై సమాన న్యాయం కోసం ఖురాన్ బోధనలు, రాజ్యాంగ నిబంధనలపై అవగాహనను పెంచేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వానికి వినతిపత్రాలు కూడా అందజేశారు. సంప్రదాయ ముస్లిం మత పెద్దలు ముస్లిం మహిళల డిమాండ్లను అసలు పట్టించుకోలేదు. హిందూ, క్రైస్తవ, జైన్ మహిళలతో సమానంగా ముస్లిం మహిళలకు కూడా న్యాయం అందించాలన్న అంశంపై దేశంలోని రాజకీయ పార్టీలలో ఏకాభిప్రాయం లేదు. ఈ నేపథ్యంలో ముస్లిం మహిళలకు న్యాయం చేసే తలాక్ బిల్లు (ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లు) 2018 డిసెంబర్ 27న లోక్‌సభలో 245 ఓట్లతో ఆమోదం పొందింది. అయితే పలు విపక్షాలు సభ నుంచి వాకౌట్ చేశాయి. ఈ బిల్లును డిసెంబర్ 31న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. అయితే విపక్ష పార్టీల సభ్యులు బిల్లును అడ్డుకున్నారు. దీనిపై సభలో గందరగోళం నెలకొనడంతో చైర్మన్ సభను జనవరి 2కు వాయిదా వేశారు. రాజ్యసభలో ఈ బిల్లు భవితవ్యం అనిశ్చితిలో పడింది. ఈ బిల్లుకు యథాతథంగా మద్దతు ఇవ్వం అని కాంగ్రెస్ ప్రకటించింది. బిల్లును జాయింట్ సెలక్షన్ కమిటీకి పంపాలని డిమాండ్ చేస్తోంది. వివిధ కారణాల రీత్య విపక్షాలు ఈ బిల్లుకు మద్దతు తెలుపడంలేదు. పూర్తిగా వ్యతిరేకించడంలేదు. బిల్లులో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. కొందరు ముస్లిం మహిళలు కూడా దీనిని వ్యితిరేకించి నిరసన ప్రదర్శనలు చేయడం శోచనీయం.

ఈ బిల్లుపై తలెత్తిన వివాదం రాజకీయ రంగు పులుముకుంటోంది. ఆ కారణంగా ముస్లిం బాధిత మహిళలు నష్టపోతారు. మత విశ్వాసాలు ఎంత బలీయంగా ఉంటాయో, ప్రభుత్వాలను కూడా ఎలా ఇరుకున పెడతాయో, రాజకీయాలను కూడా ఎలా శాసిస్తాయో ఈ సంఘటనల ద్వారా స్పష్టమవుతోంది.

- శిరందాసు నాగార్జున
94402 22914

జంక్ ఫుడ్‌తో జంకే..



మన దేశంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న వాటిలో జంక్‌ఫుడ్ మార్కెట్‌దే మొదటిస్థానం. ఏటా 20 శాతం చొప్పున అమ్మకాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ బిజినెస్‌లో లక్ష కోట్లు జరుగుతోంది. రాబోయే రెండు సంవత్సరాల్లో ఈ బిజినెస్ మరింత విస్తరిస్తూ రెట్టింపు అయ్యే అవకాశం ఉందని అంచనా.. ఫాస్ట్‌ఫుడ్ మార్కెట్‌ను చేజిక్కించుకునేందుకు మల్టీనేషనల్ కంపెనీలు తీవ్రంగానే ప్రయత్నిస్తున్నాయి. జంక్‌ఫుడ్ కంపెనీలు కొన్ని పది నుంచి ఇరవై సంవత్సరాల వయస్సు గ్రూపులను టార్గెట్ చేసుకుంటూ బిజినెస్ వ్యూహాలు రూపొందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా జంక్‌ఫుడ్స్ వ్యాపారంలోకి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే ప్రముఖ పానీయ కంపెనీ 500 కోట్ల డాలర్లు అంటే 30 నుంచి 35 వేల కోట్ల రూపాయల దాకా గుమ్మరించేందుకు సిద్ధమైంది.


జంక్‌ఫుడ్ మార్కెట్ విస్తరించడం శుభపరిణామం కాదు. అది రాబోయే అనారోగ్య సమాజానికి హెచ్చరిక. జంక్‌ఫుడ్ ఆరోగ్యానికి హానికరం. మత్తు, మాదకద్రవ్యాలు, సిగరెట్లు ఆరోగ్యాన్ని కుళ్లబొడిచినట్లే జంక్‌ఫుడ్ కూడా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. మధుమేహం, గుండె, రక్తనాళాలకు సంబంధించిన వ్యాధులకు కూడా ఈ జంక్‌ఫుడ్ కారణమవుతోంది. దీని కారణంగా తలెత్తే ఆరోగ్య రుగ్మతలకు చికిత్స చేయించుకోవడానికి భారత దేశం జాతీయాదాయంలో ఏటా దాదాపు రెండు వేల కోట్లకు పైగా నష్టపోతున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. రోజురోజుకీ విస్తరిస్తున్న జంక్‌ఫుడ్ కల్చర్ ఆరోగ్యాన్నే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తోంది.

ఫాస్ట్‌ఫుడ్ కంపెనీల ప్రచారానికి ప్రధానంగా స్కూల్, కాలేజీ పిల్లలే.. వీటికి అలవాటుపడ్డ పిల్లల్లో ఊబకాయం, బీపీ, షుగర్, మతిమరుపువంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పిల్లల ఆరోగ్యంపై వీటి ప్రభావాన్ని గుర్తించిన కొన్ని దేశాలు స్కూళ్లలో వీటి అమ్మకాలను, టీవీలలో అడ్వర్టయిజ్‌మెంట్లను నిషేధించాయి. చిప్స్, కుకీస్, క్యాండీ, కార్బొనేటెడ్‌సోడాలను స్కూల్స్‌లో విక్రయించకూడదని కోస్టారికా ఆంక్షలు విధించింది. స్కూల్ పిల్లలకు షుగరీ సోడాలు, ప్రాసెస్డ్ స్నాక్స్ మొదలైనవి విక్రయించకూడదని మెక్సికో ఆదేశించింది. టాకోస్, బర్కిటోస్, సలాడ్స్ వంటి వాటిల్లో కొవ్వు తక్కువగా ఉండాలని నిబంధనలు విధించింది. పాఠశాల దగ్గర ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలను మాత్రమే విక్రయించాలని పెరూ చట్టం చేసింది.

మనదేశంలోనూ స్కూళ్ల కేంటీన్లలో జంక్‌ఫుడ్స్ అమ్మకూడదన్న నిబంధలున్నప్పటికీ అవి అమలుకావడం లేదు. కొన్ని స్కూల్స్ నిర్వహించే కార్యక్రమాలకు బడా సంస్థలు స్పాన్సర్లుగా వ్యవహరిస్తూ తమ అమ్మకాలు పెంచుకుంటున్నాయి. మనదేశంలో ఫాస్ట్‌ఫుడ్ ఉత్పత్తి, అమ్మకాలు, ప్రచారాన్ని నియంత్రించే చట్టాలు చేయాల్సిన అవసరం ఉంది. కేరళలోని వామపక్ష ప్రభుత్వం జంక్‌ఫుడ్స్ వాడకాన్ని తగ్గించే ఉద్దేశ్యంతో ఇలాంటి చర్యలకు శ్రీకారం చుట్టడం సంతోషకర పరిణామం. జంక్‌ఫుడ్స్‌పై ఫ్యాట్ పన్ను విధించడం వల్ల కేరళ ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం రాకపోయినప్పటికీ కనీసం అల్పాదాయ వర్గాలవారైనా జంక్‌ఫుడ్ జోలికి వెళ్లరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.


ఫాస్ట్‌ఫుడ్స్ వాడకం నియంత్రించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ మూడు రకాల సిఫార్సులు చేసింది. పండ్లు, కూరగాయల ధరలు తగ్గేలా, ఫాస్ట్‌ఫుడ్ ధరలు పెరిగే పన్నులుండాలన్నది వీటిలో ఒకటి. పండ్లు, కూరగాయల సాగుకు సబ్సిడీలిచ్చి వాటిని ప్రోత్సహించాలన్నది ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల్లో మొదటిది. ఫాస్ట్‌ఫుడ్ కూల్‌డ్రింక్స్ ప్రచారాన్ని కట్టుదిట్టంగా కట్టడి చేయాలన్నది రెండో అతి ముఖ్య సూచన. ఆహార ఉత్పత్తుల పాకెట్లు, డబ్బాలపై మరింత స్పష్టమైన, సమగ్రమైన సమాచారంతో కూడిన లేబుల్స్ ఉండాలన్నది మూడో సూచన. ధూమపానం ఆరోగ్యానికి హానికరం అనే స్లోగన్ సిగరెట్ పాకెట్లపై ముద్రించినట్లే, ఫాస్ట్‌ఫుడ్ పాకెట్స్‌పై కూడా ఇలాంటి హెచ్చరిక ముద్రించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ★


రంగవల్లి



కె.ఎస్.వి. సుప్రజ
విజయవాడ

19 చుక్కలు, 10 వరకు
మధ్య చుక్కలు





పి.వి.ఎల్. సుజాత
సైనిక్‌పురి, సికింద్రాబాద్

16 చుక్కలు, 2 వరుసలు, 2 వరకు సరిచుక్కలు

శ్రీనరసింహ శతకము

సీ. నీమీద కీర్తనల్ నిత్యగానము సేసె
రమ్యమొందింప నారదుఁడఁగాను
సావధానముగ నీ చరణ పంకజ సేవ
సలిపి మెప్పింపంగ శబరిఁగాను
బాల్యమప్పటి నుండి భక్తి నీయందున
గలుగఁగ ప్రహ్లాద ఘనుఁడఁగాను
ఘనముగా నీమీఁద గ్రంథముల్ గల్పించి
వినుతి సేయును వ్యాసమునిని గాను

తే॥ సాధుఁడను, మూర్కమతి మనుష్యాధముఁడను
హీనుఁడను సుమ్మి నీవు నన్నేలు కొనుము
భూషణ వికాస ! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం:
ఓ స్వామీ ! నీపై పాటలు పాడి మెప్పించుదామంటే నేను నారదుణ్ణికాను. భక్తి నీ పాదపద్మాల నర్చిం మెప్పు సంపాదించటానికి నేన శబరికాను, చిన్ననాటి నుంచి భక్తిభావం కల్గి ఉండడానికి నేను ప్రహ్లాదుడిని కాను. నీపై కృతులు వ్రాయటానికి వ్యాసుణ్ణి అసలే కాను. మానవుల్లోకనిష్టుణ్ణి సుమా! నన్ను కాపాడు




అనంతం

32 -గోపరాజు నాగేశ్వరరావు

"రగిలిపోతారని ఎలా చెప్పగలరు"
"ఇంటలిజెన్స్ వర్గాల సమాచారం"
"మీ తదుపరి కార్యక్రమం?"
"పిచ్చుకల ప్రాజెక్టు"
"వ్వాట్"
"సెల్ టవర్లవల్ల పిచ్చుక జాతి అంతరించి పోతోంది"
"ఐతే.?"
"అడవుల్లో రక్షిత ప్రాంతాలు నెలకొల్పాలి"
"అన్నిరకాల పిచ్చుకలకూనా?"
"ఊరపిచ్చుకలకు మాత్రమే"
"ఎందుకని"
"దేశభక్తి"
"ఊర పిచ్చుకలకీ దేశభక్తికీ ఏమిటి సంబంధం."
"ఊరపిచ్చుక లేహ్యం ధాతుపుష్టికి దివ్యమైన ఔషధం."
"ధాతు పుష్టికి దేశభక్తికీ ఏమిటి సంబంధం."
"చీపులిక్కరు గుట్కాలు మాదకద్రవ్యాలు- కలుషితమైన గాలి నీరూ... జాతిని నిర్వీర్యం చేస్తున్నాయి! వాళ్ళకి ఊరపిచ్చుక లేహ్యం అందించి పుష్టి సంపన్నులను చెయ్యటమే దేశభక్తి."
"ప్రభుత్వానికి ప్రపోజల్ పంపిస్తారా."
"అందులో ఒక చిక్కుంది."
"ఏమిటో...?"
"అమెరికా వాళ్ళతో కలసి లేహ్యం చెయ్యాలంటారు."
"నిధులకు దిగులుండదు కదా."
"ఇండియా ఊర పిచ్చుకల మీద అమెరికా పెత్తనం చేస్తుంది."
"చేస్తే ఏం?"
"మన ఊర పిచ్చుక లేహ్యం అమెరికాలోనే అమ్మాలంటారు."
"లాభమే కదా."
"లేహ్యం మనది. ధాతుపుష్టి వాళ్ళకా? అన్యాయం."
అందరూ భళ్ళున నవ్వారు.
మళ్ళీ గ్లాసుల నిండా మందు నిండింది.
"ప్రొడక్షన్ మొదలైతే నాకూ ఊరపిచ్చుక లేహ్యం పంపించండి" అన్నాడొక పోలీసు అధికారి నవ్వుతూ.
"పరిస్థితి చెయ్యి దాటిపోయిందా." గరుడాచలం అడిగాడు.
"టెన్స్! బట్ అండర్ కంట్రోల్" అన్నాడతను.
మళ్ళీ అక్కడ నవ్వులు విరిసాయి...
విందు పూర్తయ్యింది.

అందరూ వెళ్ళిపోయాక గరుడాచలం, రాగ్యా మిగిలారు.
"సారూ"అని నెమ్మదిగా పిల్చాడు రాగ్యా.
"ఏమిటి? చాంద్‌నీ విషయమేనా?" అడిగాడు గరుడాచలం.

అప్పటికప్పుడు కారుమబ్బులు క్రమ్ముకున్న ఆకాశంలా అతని మొహం నల్లగా మాడిపోయింది రాగ్యా గమనించలేదు!
"అనుకున్నట్టే అంతా జరుగుతుంది. ఎమ్మెల్లేగారు కూడా పట్టుదలతో ఉన్నారు.



అతని జ్ఞాపకశక్తికి రాగ్యాకి ఆశ్చర్యమనిపించింది!
అంత నిషాలోకూడా తన విషయం అతనికి గుర్తున్నదంటే ఎంత అభిమానం తన పట్ల!
"దేవర జాతరొత్తుండాది"అని గుర్తుచేశాడు రాగ్యా.

కాయా? పండా? అన్నది త్వరలోనే తేల్చేస్తారు"అని రాగ్యాకి ధైర్యం చెప్పాడు గరుడాచలం.
కొంత సమయం గడిచింది.
కీ.శే.పెద్దిరెడ్డి కొడుకు ఎమ్మెల్లే పెంటారెడ్డి ఎక్కడికో వెళ్ళి, వ్యవహారాలన్నీ చక్కదిద్దుకొని వొచ్చాడు.

గరుడాచలం అతనికి ఎదురువెళ్ళి స్వాగతం పలికాడు!
ఇద్దరూ ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.
"రాగ్యా నీతోనే ఉన్నాడా?" గుడారంలోకి వెళ్ళకుండా బైటే నిలబడి అడిగాడు ఎమ్మెల్లే.
"ఏమంటాడూ! చాందినీ కావాలిట. తొందరపడుతున్నాడు"
"నీకుమాత్రం తొందరగా లేదూ"అని, క్రీగంట గరుడాచలాన్ని చూస్తూ అదోలా నవ్వాడు ఎమ్మెల్లే.
గరుడాచలం మౌనంగా నవ్వూరుకున్నాడు.
"అంతా నాకు తెలుసు! ప్రతీకారం తీర్చుకోవటంకన్నా, నీకు చాంద్‌నీని అనుభవించాలన్న ఆసక్తే ఎక్కువగా వుంది."
"నా కళారాధన అలాంటిది"అన్నాడు గరుడాచలం.
"కీపిట్టప్! శృంగారం కూడా ఓ కళే! పైగా, అన్ని కళల్లోనూ అదే గొప్పది! రసికులెవ్వరూ దాన్ని కాదనరు."
"నేను మాత్రం అన్నానా."
"రాగ్యాకేమీ అనుమానం రాలేదా?"
"ఇప్పటివరకు రాలేదు."
"జాగ్రత్తగా డీల్ చెయ్యాలి వాడ్ని."
"అవస్యం"అన్నాడు గరుడాచలం.
"రాగ్యా ఎక్కడున్నాడు" క్షణం తర్వాత ఎమ్మెల్లే అడిగాడు.
"నా గుడారంలో.."
"ఒంటరిగా నువ్వొకసారి రావాలి. గుడారంలోనే వుంటాను"అని చెప్పాడు ఎమ్మెల్లే, తన గుడారంలోకి దారితీస్తూ.
గరుడాచలం రాగ్యా దగ్గరికి వెళ్ళాడు.
ఏవో ఊహల్లో తేలిపోతూ బాహ్యప్రపంచాన్నే పూర్తిగా మరచిపోయి, ఓ మూల కూర్చొని ఉన్నాడు రాగ్యా.
"రాగ్యా"అని పిలుస్తూ గరుడాచలం వచ్చి, భుజంమ్మీద చేత్తో తట్టేదాకా రాగ్యా యీ ప్రపంచంలోకి రాలేదు.
"ఏమిటలా ఉన్నావు?" గరుడాచలం అడిగాడు.
"శాందినీ గురుతొస్తుంది"అన్నాడు రాగ్యా దీనంగా.
మఫ్టీ కానిస్టేబులు కనకయ్య వొచ్చాడు. గరుడాచలానికి అభివాదం చేసాడు.
"ఎమ్మెల్లేగారు త్వరగా రమ్మంటున్నారు"అని చెప్పాడు.

(ఇంకా ఉంది)

ప్రజల మనిషి

-వట్టికోట ఆళ్వారుస్వామి

వినమరుగైన..

-సి.రాఘవాచారి

ఆ విషయాన్ని ఆళ్వారుస్వామి గారు చాలా వాస్తవికత ప్రాతిపదికగా చిత్రించటానికి ప్రయత్నించారు. మనకు సాధారణంగా ఇలాంటి నవల లొచ్చినపుడు వాటిలో ఎక్కువ కాల్పనికమైనటువంటి అంశం చాలా వుంటుంది.

ముఖ్యంగా ఆళ్వారుస్వామిగారి ఈ ప్రజల మనిషి, దీని అనంతరం వచ్చినటువంటి గంగు వీటిని తీసుకుంటూ తెలంగాణలో ఆ రోజు వున్నటువంటి దుస్థితే కాకుండా, ఆ దుస్థితినుంచి బయటపడటానికి, అలాగే తమ శక్తిని గుర్తించటానికి, ప్రజలలో వివిధ వర్గాలకు ఏ విధంగా ఆ పరిస్థితి ఉపయోగపడిందీ మనకర్థమవుతుంది. అందుకనే మహాకవి దాశరథి చెప్పినట్టు ఒక్క తెలంగాణా ఉద్యమంలోనే కాకుండా అన్ని చోట్లా కూడా ప్రజల తరపున వున్నటువంటి నాయకులు తయారుకావటానికి కొంతకాలం పడుతుంది. వారికి కూడా వున్నటువంటి పరిమితులు పోవటానికి ఇంకా అనుభవం తోడ్పడుతుంది.

అప్పటివరకు దోపిడీ వ్యవస్థలో చితికి, చివికిపోయి తాము నిస్సహాయంగా వున్నామనుకున్న సామాన్య ప్రజ శక్తిమంతులవటానికి, సాహసోపేతమైన కార్యాలు చేయటానికి తగిన భూమిక ఈ నవలలో చిత్రించబడింది. ఇక్కడ వట్టికోట ఆళ్వారుస్వామిగారు ఒక వాస్తవిక రూపంగల రచయితగా తప్ప తానుగా కాల్పనికమైనటువంటి అంశం ఏదీ చొప్పించలేదు. ముఖ్యంగా ఇతర నవలలు తెలంగాణకు సంబంధించి వచ్చిన వాటిలో ఈ కాల్పనికఅంశం ఎక్కువగా కనపడుతుంది.

అక్కడివాడు, అక్కడి ఉద్యమంలో తాను పాల్గొన్నవాడు, ఆద్యమం ఎలా క్రమంగా రూపుదిద్దుకున్నదీ పరిశీలించినటువంటి వాడు కనుక ఆళ్వారుస్వామి దానిని తాను తిరిగినటువంటి ప్రదేశాలను, తాను కలిసినటువంటి మనుషుల యొక్క అనుభవాలని దృష్టిలో పెట్టుకుని దాన్ని ఒక చారిత్రక నవలగా తీర్చిదిద్దినటువంటి అంశం మనకు స్పష్టమవుతుంది. ముఖ్యంగా నిజామాబాద్ జైల్లో ఆయన జైలరుతో చేసినటువంటి వాదనలో రాజ్యాంగం, జైళ్లు, పరిపాలన వాటికి సంబంధించిన అనేక అంశాలపై ప్రాథమిక స్థాయిలో చర్చలు కనపడతాయి. అందులోను ప్రతి పాత్ర కూడా తాను మూసపోసినట్లుగా కాకుండా వైవిధ్యంతో కూడినట్లు ఉండటం -చిత్రించటంలో ఆళ్వారుస్వామిగారు కృతకృత్యులయ్యారు. అందుకే వాస్తవానికి ఆళ్వార్లు పన్నిద్దరే అయినా మా వట్టికోట పదమూడో ఆళ్వారని దాశరథి అగ్నిధారను ఈయనకంకితమిస్తూ చెప్పింది అక్షర లక్షలలు చేసేటటువంటి సత్యమని మనం భావించాల్సి వుంటుంది.

సమాప్తం

రెండు దశాబ్దాల క్రితం విజయవాడ ఆకాశవాణిలో ప్రసారమైన - శత వసంత సాహితీ మంజీరాలు - శీర్షిక నుంచి..

శ్రీ


చం॥ సరియగు బాటలోన మనసారగ సాగఁగఁ బూని భూమిలో
మురియుచు సేవఁ జేయగను మోదమునందుచు నీకుమ్రొక్కరే?
యరయగ మారుదేవునిగ హారతులందెదవే ఘనంబుగా
విరియును నీదు కీర్తి పదివేలకుఁ బైబడి వత్సరమ్ములన్ !

ఉ. మానవసేవయున్నరయ మాధవ సేవయునాటి మాట కుం
బ్రాణముఁ బోయనెంచియును రమ్యపు బాటన సాగిపోవలెన్
కానకనాగఁబోవు కలికాలపురుగ్మతలారిప వేయగాఁ
బూనియు మార్గదర్శివయి పూర్ణపు సేవకుఁ జుట్టు మోయిశ్రీ!

కొడుకుల సూర్యసుబ్రహ్మణ్యం
9492457262

మాటాట

నిర్వహణ: సుధామ 1842



అడ్డం — ఆధారాలు — నిలువు

అడ్డం:
1. గాలిబ్‌గీతాలు తెలుగుచేసిన మహాకవి
5. యంత్రము
7. రోగగ్రస్తుడు
8. సంకోచించు
9. పార్వతి
10. నిడుపాటి కోల
12. పాఠశాల
14. సంపెంగ

నిలువు:
2. యుద్ధము
3. కొండముచ్చు
4. లక్ష్మి
6. అల్లరి, గొడవ
7. వెంట్రుక
10. పొగరు
11. వెట్టి చాకిరి
13. ప్రియురాలు, సఖి

మాటాట-1841 సమాధానాలు

అడ్డం: 1. ముఖ్య అతిథి, 5. కాన, 7. రతి, 8. వారం, 9. శ్వాస, 10. ఊరు, 12. ఊహ, 14. అంగారకుడు

నిలువు: 2. అక్కర, 3. ఇంకా, 4. ద్యుతి, 6. నవారు, 10. ఊర్మిళ, 11. రాదుగా, 13. హరుడు

కచ్చితత్వం లేని కొలమానం!

పరిపూర్ణం
ఒక వైద్యుడే కావచ్చు గాక!
రోగుల పట్ల అతడి హృదయస్పందనలు
మంచివేనా అంటే
ఎలా చెప్పగలం?

ఒక ఉపాధ్యాయుడే
కావచ్చుగాక!
పిల్లల భవితల్ని కాంక్షించే
నిత్యస్వాప్నికుడు
అతనిలో ఉన్నాడా అంటే
ఎలా చెప్పగలం?

ఒక కొలువుచేసే
అధికారే కావచ్చుగాక!
ఆ కొలువులోని నీతి
అతనిలో కొలువై
ఉందా అంటే
ఎలా చెప్పగలం ?

ఒక రాజకీయవేత్తే కావచ్చు
అతడి రాజనీతిలో
ప్రజాహితం ఉందా అంటే
ఎలా చెప్పగలం?

నిజాయితీ అనేది
మనసును బట్టి ఉంటుంది
మనసును బట్టి



మంచే కాదు చెడూ ఉంటుంది

అది ఎన్నడూ
తన పరిపూర్ణప్రాతినిధ్యాన్ని
ఏ ఒక్కదానికో
పరిమితం చేయలేదు

మంచిచెడుల మధ్య
కొట్టుమిట్టాడే మనిషి
పరిపూర్ణుడు ఎన్నటికీ కాలేడు!

ఇది ముమ్మాటికీ నిజమే!

వ్యవస్థీకృతమైన ధర్మాలను
పంచభూతాలు
సుస్థిరం చేసుకొన్నాయి

పంచభూతాత్మకమైన
మనిషి మాత్రం
స్వధర్మాన్ని విడిచి
మానవతకు దూరంగా
మిగిలిపోతున్నాడు

సుస్థిరమైన మానవత్వానికి
ప్రతీకగా
నిలువలేక పోతున్నాడు

అందుకే మనిషి
అర్థం గోచరించని ఒక పదం
స్పష్టత లేని ఒక వాక్యం

సంశయాత్మకమైన ఓ స్వాభావికం
కచ్చితత్వం లేని ఓ కొలమానం!

- కె. రవీంద్రబాబు
9052778988

పల్లెకు పోదాం!

అక్కడ
ఆత్మీయతకు ఆవాసం
అనుబంధాలకు ఆలవాలం
మనస్సుల్లో మమకారం
మాటల్లో మాధుర్యం
చేతల్లో సహకారం
నిలకడైన జీవనానికి
నిండైన భాష్యం
నెమ్మదైన జీవితానికి
మెండైన అర్థం

అక్కడి
గాలిలోని స్వచ్ఛత
మనసుకు పాకుతుంది
మట్టిలోని మమకారం
మానవత్వాన్ని నేర్పిస్తుంది
నీటిలోని మాధుర్యం
మాటలో ప్రతిఫలిస్తుంది
అందుకే పద పోదాం పల్లెకు
శాంతికి నెలవుగా
మమతకు కొలువుగా
అలరారే పల్లెకు పోదాం!

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
మనోల్లాసాన్ని పొందుతారు. సోదరులతో వైరమేర్పడకుండా మెలగాలి.ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి. నూతన వ్యక్తుల జోలికి వెళ్లరాదు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
తరచూ ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అకాల భోజనంవల్ల ఆరోగ్యం చెడిపోతుంది. వృత్తిరీత్యా జాగ్రత్తగా నుండుట మంచిది. సహనం అన్ని విధాలా శ్రేయస్కరం.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
బంధు, మిత్రులతో కలుస్తారు. నూతన గృహ నిర్మాణ ప్రయత్నం చేస్తారు. ఆకస్మిక ధనలాభంతో, ఋణబాధలు తొలగిపోతాయి. కుటుంబ సౌఖ్యముంటుంది. శత్రుబాధలు దూరమవుతాయి.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరును. బంధు, మిత్రులతో సరదాగా గడుపుతారు. ప్రయాణాలవల్ల లాభం చేకూరును. శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. ధనచింత ఉండదు. సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయి.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
తోటివారితో విరోధమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. వ్యాపార మూలకంగా ధననష్టం కలిగే అవకాశాలున్నాయి. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. కుటుంబ విషయాలందు అనాసక్తితో వుంటారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. ఆకస్మిక ధన లాభయోగముంటుంది. ప్రయత్న కార్యాల్లో విజయం సాధిస్తారు. బంధు, మిత్రులతో కలుస్తారు. క్రీడాకారులు, రాజకీయ రంగాల్లో వారు ఉత్సాహంగా ఉంటారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
వృత్తి, ఉద్యోగ రంగాల్లో ఆలస్యంగా అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. ఆకస్మిక ధనలాభంతో ఋణబాధలు తొలగిపోతాయి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. ఇతరులు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకొనుటకు కృషి చేస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
క్రొత్త కార్యాలు ప్రారంభిస్తారు. మానసికానందాన్ని పొందుతారు. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశముంది. వృత్తిరీత్యా క్రొత్త సమస్యల నెదుర్కొంటారు

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
మిక్కిలి ధైర్య, సాహసాలు కలిగియుంటారు. సూక్ష్మబుద్ధితో విజయాన్ని సాధిస్తారు. మీ పరాక్రమాన్ని ఇతరులు గుర్తిస్తారు. శత్రుబాధలు తొలగిపోతాయి. శుభకార్య ప్రయత్నాలు నెరవేర్చుకుంటారు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఋణప్రయత్నం ఫలిస్తుంది. చెడు సహవాసం వైపు వెళ్లకుండా వుంటే గౌరవం దక్కుతుంది. కలతలేర్పడే అవకాశముంది. బంధు, మిత్రులతో జాగ్రత్తగా నుండుట మంచిది.

సౌందర్యారాధనం



సౌందర్యాధనం చాలామంది చేస్తుంటారు. అందం అంటే ఇష్టం లేనివారు ఎవరూ ఉండరు. అందులోను శారీరిక సౌందర్యం కాదు ఆత్మసౌందర్యం అంటే ప్రీతి చెందని వారు ఎవరూ ఉండరు. ఆ ఆత్మ సౌందర్యాని కన్నా మించిన సౌందర్యం కృష్ణపరమాత్మది. ఆ దేవదేవుని సౌందర్యాన్ని చూడడానికి రెండు కనులూ చాలవంటారు కృష్ణభక్తులు. ఇపుడు అసలే మార్గశీర్షమాసం. గోదాదేవి ఆమె చెలికత్తెలందరూ పొద్దుపొద్దునే లేచి ఆ గోపాలబాలుని నందుగోపుని చూడరమ్మని ఒకరినొకరు పిలుచుకుని వెళ్తుంటారు.

అలా వెళ్లడానికి కారణం వారు ఆ పరమాత్మను మనసున నిలుపుకొనడం. ఆ పరమాత్ముని సేవించడానికి పూర్వజన్మ పుణ్యంకావాలి. యశోదాదేవికి గారాలతనయుడైన ఆ కృష్ణపరమాత్మ తమకూ తనయుడు కావాలని కొందరు కోరుకుంటే మరికొందరు రుక్మిణీ సత్యభామలకు ప్రియాతి ప్రియుడైన ఆ కృష్ణపరమాత్మ తమకు కూడానాథుడు కావాలని కోరుకుంటారు.

అందరూ మాత్రం చిన్ననాడు చిద్విలాస మూర్తియై చేసిన ఎన్నెన్నో దుష్టసంహారాలను, చూపిన లీలావిలాసాలను స్మరించి ఆనందిస్తుంటారు. అట్లాంటి ఆనందాల్లో కృష్ణపరమాత్ముని అంగాంగ సౌందర్యాన్ని వర్ణించుకుంటూ ఆ చిన్నివాడు గర్గముని దగ్గర నేర్చుకున్న పాఠాలు, తోడి గోపబాలురతో గోవులను కాయడానికి వెళ్లిచూపిన మహాత్మ్యాలు ఎన్నెన్నో ఉన్నాయి.

అట్లాంటివాటిల్లో పెరియాళ్వారు ఒకసారి కుంభకోణంలోని రాముల వారి కోవెలకు వెళ్లారట. అక్కడ కోదండపాణియైన రాముడు, ఆయన ప్రక్కన విల్లంబులు ధరించి లక్ష్మణ మూర్తి కనిపించారట. అంతే ఆ స్వామిని వారి చేతిలోని కోదండాన్ని చూసి న పెరియాళ్వారుకు కృష్ణయ్య గుర్తుకువచ్చాడట.

ఆహా! ఇదేమి చోద్యం అలనాడు యశోదమ్మ ఒడిలో కూర్చుని పాలుకుడుపుతూ ఉంటే ఆ తల్లి కన్నయ్య ముఖారవిందంపై పరుచుకుంటున్న ముంగురులను సరిచేస్తూన్నపుడు కనీ కనబడుకుంటా కనబడిన కనుగొమ్మలు కదా ఇవి అనుకొన్నాడట. చూశారా! ఇది ఆళ్వారుల హృదయం. పైగా చిన్ని కృష్ణయ్య యశోద కస్తూరీ తిలకాన్ని, కాటుకను దిద్దుతున్నపుడు ఆ కన్నయ్య కనుగొమ్మలను చేతితో ముట్టుకుంటూ చక్కగా సరిచేస్తున్నట్టు భావన చేస్తున్నపుడు పెరియాళ్వారుకు ఎనలేని సౌందర్యం స్వామి ముఖారవిందంలో కనిపించిందట. ఆ స్వామి కనుగొమ్మలు ఎంత శక్తివంతమైనవో కదా అనిపించిందట.

ఆ స్వామిని పెంచడానికి ఈ యశోదానందులు ఎంత పుణ్యం చేసుకొన్నారో కదా. దేవకీదేవులకన్నా వీరి పుణ్యం ఎంచగా వీలులేనిది లెక్కపెట్టగలేనన్ని పుణ్యారాశులను చేసుకొన్నారు కనుకనే ఈ కన్నయ్యను కడుపార కన్నట్టు, ఆతడే తమను పాలించే పాలకుడని అనుకుంటూ పెంచుతున్నారు. నిజమే వీరినేనా ఆయన పాలించేది అఖిల భువనాలను తన చిరు బొజ్జలో దాచుకున్న చిరుదరహాసమూర్తి కదా. వారినొక్కరినే కాదు కదా చరాచర జగత్తునంతా స్వామి కరుణార్ద్ర దృక్కులతో పాలిస్తున్నాడుకదా. అనుకొంటూ ఎంతో పొంగిపోయారట పెరియాళ్వారు.

ఆళ్వారులు స్వామిని ఎంతగా సేవించారో. లోకంలోని ప్రతీదీ వారికి స్వామి లాగే కనబడుతుంది. ఆ పెరియాళ్వారు ఆ కనుగొమ్మలను చూసి మన్మథుడు యువతీయువకులు ఒకరినొకరు ప్రేమించుటకై నల్లని బాణాలను వదిలాడు. ఈ రాముడు అజ్ఞాన అహంకారాలు కలిగిన ఈరావణాసురుని నిర్జించడానికి బాణాలు వదిలాడు. కానీ నా కన్నయ్య మాత్రం అందరూ తనను చూసి ప్రీతిచెంది హృదయానందాన్ని పొంది ఆ ఆనందంతో అడుగులు వేస్తూ వేస్తూ నా దగ్గరకు వచ్చి అచంచలమైన ప్రేమానందాబ్ధిలో మునిగి స్వధర్మాచరణను చేస్తూ అన్యథాశరణం నాస్తి త్వమేవ శరణం మమ అంటూ నన్నే నమ్ముకునేట్లుగా చేసి వారి వారి పాపపంకిలాన్ని కడిగివేసి వారిని తనతో పాటుగా దివ్యపదానికి తీసుకెళ్లదామని స్థిర నిశ్చయంతో రెండు నల్లని వంగిన కనుగొమ్మలను తన ముఖంపై పెట్టుకున్నారు కదా.

ఆహా కృష్ణయ్యా! నీకెంత వాత్సల్యమూ, కరుణ ఉన్నాయో కదా. స్వామి నీవే నాకు పరమపదానివి. నాకు నీవు తప్ప ఎవరునూ అక్కర్లేదు. సదా నీ నామస్మరణ చేసుకొంటూ నీ రూపాన్ని కనులారా చూస్తూ నీ తత్వాన్ని ఆకళింపుచేసుకొనే శక్తి నిమ్ము అని కోరుకుంటున్నారట పెరియాళ్వారు.

మరి ఇదే మంచికాలంకదా. మార్గళివ్రతాన్ని ఆచరించే మనమందరమూ ఆ అందాల యశోదాబాలుని సౌందర్యారాధనం చేస్తూ సేవించుదాం తరలిరండి తరణులారా!

- వాణి ప్రభాకరి

హంసకాకీయోపాఖ్యానం

పూర్వ సముద్ర తీరంలో ఒక ధర్మాత్ముడైన రాజు ఉండేవాడు అతని రాజ్యంలో గొప్ప సంపదకలిగిన ఒక వైశ్యుడు ఉండేవాడు అతను చాలా ఉదారుడు. ఓర్పు కలవాడు ధర్మాచరణ చేసేవాడు. అతనికి చాలా మంది పుత్రులు కలరు. ఆ గృహంలో ఒక కాకి కూడా ఉండేది. అది ఆ పిల్లలు పారవేసిన ఎంగిలి మెతుకులు తింటూ అక్కడే ఉండేది. ఆ తిండితో అది పొగరెక్కి తనతో సమానమైనది, తన కంటే గొప్పది ఇంకో పక్షి లేదని అనుకుంటూ అహంకరించి ఇతర గొప్ప పక్షులనూ కూడా అవమానించేది.

ఒకనాడు ఆ సముద్ర తీరానికి గరుడునితో సమానంగా ఎగురుతూ కొన్ని హంసలు మానస సరోవరంలో నివసించేవి వచ్చాయి. ఆ హంసలను చూసి ఆ వైశ్య పిల్లలు కాకితో ఇలా అన్నారు.-''ఓ పక్షీ! అన్ని పక్షులలో నీవే శ్రేష్ఠమైన దానివి. ఈ హంసలు కూడా ఆకాశంలో చాలా దూరం ఎగురుతున్నాయి. నీకు కూడా అంత ఎత్తు ఎగిరే శక్తి ఉన్నా ఇంత వరకూ ఎక్కడికీ ఎగురలేదు''. పిల్లలు చెప్పిన మాటలు విన్న మూర్ఖకాకి ఆమాటలు నిజమేనని నమ్మి, ఈ హంసల గొప్పదనం పరిక్షించాలని నిశ్చయించుకొంది. ఎంగిలి మెతుకులు తినే ఆ దుర్బుద్ధి గల కాకి ఆహంసలను ''ఎగురుదాం రండి'' అని పోటీకి పిలిచింది. బలిష్టంగా ఉండి ఎక్కువ దూరం ఎగుర గల హంసలు ఆ కాకి ప్రేలాపన విని పగలబడి నవ్వాయి.

ఆ హంసలు అప్పుడు కాకితో ఇలా అన్నాయి. ''ఓ వాయసమా! పక్షులలో చాలా దూరం ఎగరటానికి మేము ప్రసిద్ధి చెందాము. మా నివాసమే అత్యంత పవిత్రమైన మానస సరోవరం, ఆ సరస్సు కైలాసం దగ్గర ఉంటుంది. అంటే మేము శివునికి సమీపంలో ఉండేవారం. అప్పుడప్పుడు ఈ భూమ్మీద విహరిస్తూ ఉంటాము మా అవయావాల మీద చక్రచిహ్నాలు ఉంటాయి. అలాంటి మాతో పోటీకి రావాలని ఎలా తలుస్తున్నావు. నీవు కాకివి. నీకు మాతో పోటీ ఏమిటి'' కాని వాటి మాటలను మూర్ఖ వాయసం వినకుండా పదే పదే తన గొప్పలు చెప్పుకుంటూ హంసలను నిందిస్తూ వాటిని చులకన చేసి మాట్లాడుతూ ఇలా సమాధానం చెప్పింది -

''ఓ హంసా! నేను నూటొక్క రకాలుగా ఎగురుతాను. వాటిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క దానితో యోజనం దూరం ఎగురలేను. వాటిలో కొన్ని - క్రిందికి పైకి ఎగరటము నాలుగువైపులా ఎగరటం, వెనక వైపులా ఎగరటం అడ్డంగా ఎగరటం, అన్నివైపులా ఎగరటం గిర గిరా తిరిగి క్రిందకిరావటం ఇలాగ నూటొక్క రకాల విధాల నేను ఎగురగలను. ఇప్పుడు మీరంతా చూస్తూ ఉండగా అన్ని రకాలుగా ఎగిరి మీకు చూపెట్టగలను. అప్పుడు నా గమనం, బలం మీకు అర్థమవుతాయి. ఏ గతిలో ఎగురాలో చెప్పండి'' అని డాంబికంగా పలికింది.

అప్పుడు ఒక హంస ఇలా జవాబు చెప్పింది. ''ఓ కాకీ నీవు నూటొక్క రకాలుగా ఎగరగలవు కాని నేను అన్ని పక్షులకూ తెలిసిన ఒకే ఒక గమనంతో ఎగురుతాను, నాకు ఇంకొక రకమైన గమనం తెలియదు నీకు ఏది నచ్చితే ఆ గమనం ఎగురు''.

అప్పుడు అక్కడ చేరిన కాకులు పరిహాసంగా ఇలా అన్నాయి ''ఈ హంస ఒకే ఒక గమనంతో నూరు రకాల గమనాన్ని ఎలా జయిస్తుంది? పైగా ఈ కాకి చాలా బలిష్ఠంగా ఉంది. వేగంగా ఎగరగలదు''.



మహాభారతంలో ఉపాఖ్యానాలు

96

డాక్టర్ ముదిగొండ ఉమాదేవి


తర్వాత హంసలు కాకులు పోటీపడి ఎగిరాయి. ఒకే గమనంతో హంస, నూరు గమనాలతో కాకులు ఎగరటం మొదలు పెట్టాయి. ఇటు నుంచి చక్రాంగం హంస ఎగిరింది. అటునుంచి కాకి ఎగిరింది. వాని విచిత్ర గమనాలతో చూచేవారిని ఆశ్చర్యపరుచ దలచి కొత్త కొత్త విన్యాసాలను చేసి తనను తాను పొగడుకుంటున్నది. అవి చూసి తక్కిన కాకులు గట్టిగా కావుకావు మని అరిచాయి. అవి హంసలను చూసి హేళన చేశాయి. హంస మాత్రం ఏమీ పట్టించు కోకుండా ఒకే విధమైన గమనంతో సాగిపోతున్నది. రెండు గడియలలో కాకి ఓడిపోతున్నట్లనిపించింది. అయినా కాకులు హంసను హేళన చేస్తునే ఉన్నాయి. ''ఆ ఎగురుతున్న హంస కాకి కంటే వెనకబడి ఉన్నది'' అని అరిచాయి. వాటి మాటలు విన్ని హంస సముద్రం మీద పైపైకి పశ్చిమ దిక్కున ఎగుర సాగింది. అప్పుడు కాకి ఆయాసపడసాగింది. దానికి వాలటానికి ఆ సముద్ర మధ్యంలో ఎక్కడా ఒక చెట్టు కూడా కన్పించలేదు. దానికి భయం కలిగింది. అప్పుడు కాకి ఇలా అనుకున్నది బాగా అలసటగా ఉంది ఇప్పుడు నేను ఎక్కడ వాలాలి? ఈ సముద్రం ఎన్నో భయంకరమైన జలజంతువులతో నిండి ఉంది. కనుక ఇంత దూరం సముద్రం మీద ఎగిరి ఆవలి ఒడ్డుకు ఎలా చేరగలను?''

హంస రెండు గడియలు ఎగిరి కాకి కోసం చూస్తూ ముందరికి వెళ్ళ లేదు. చక్రాంగం కాకిని దాటి ముందుకు వెళ్ళింది. ''కాకి కూడా ఎగురుతూ నా దగ్గరకు రావాలి'' అని ఎదురు చూసింది. ఇంతలో హంస కాకితో ఇలా అంది ''కాకీ! ఇప్పుడు నీవు ఏగతిలో ఎగురుతున్నావు? బాగా అలసిపోయావు'' అని హంస దగ్గరకు వచ్చింది. దాని శరీరం శిథిలమై పోయింది. ఎంత ఎగిరినా ఆ నీటికి అంతు లేదు. అది క్రిందపడిపోతున్నది. అప్పుడు కాకి హంసతో ఇలా అన్నది ''సోదరా హంసా! మేము కాకులం ఊరికే కాకా అని అరుస్తూ ఉంటాము. నేను నిన్ను శరణు వేడుతున్నాను. ఈ నీటినించి ఒడ్డుకు చేర్చు''

ఇలా ప్రార్థిస్తూ కాకి ఆ మహాసముద్రంలోని నీటిని రెక్కలతో, ముక్కుతో తగులుతూ బాగా అలసిపోయి ఆ నీటిలో పడిపోయింది. దానికి చాలా బాధకలిగింది. అతి దీనంగా అది సముద్రంలో పడి మరణించబోతున్న కాకిని చూసి హంస ఇలా అన్నది -

''కాకీ నీవు గర్వంతో నూటొక్క గతులతో ఎగురుతాను అని ఆత్మస్తుతి చేసుకుంటూ మమ్మల్ని హేళన చేస్తూ వచ్చావు. మరి అంత గొప్పగా ఎగర గలిగితే ఇలా సముద్రంలో పడిపోయావు ఎందుకు?''

అప్పుడు సముద్రపు నీళ్ళలో పడి కొట్టుకుంటున్న కాకి దీనంగా ఇలా అంది.- ''హంసా! వైశ్య బాలకులు పడవేసిన ఎంగిలి మెతుకులు తిని మదించిన నేను గరుత్మంతునితో సమానమని తలచి అహంకరించాను. నిన్ను ప్రాణాల కోసం శరణువేడుతున్నాను. నన్ను దయచేసి ఒడ్డుకు చేర్చు. ఇక ముందు ఎవ్వరినీ హేళన చేసి అవమానించను. ఈ ఆపద నుంచి నన్ను రక్షించు''. అప్పుడు హంస దయతో వేగంగా వచ్చి కాళ్ళతో కాకిని లేవదీసి తన వీపుమీద ఎక్కించుకొని పూర్వం తాము పోటీ మొదలు పెట్టిన చోటికి తీసుకొని వెళ్ళింది. కాకిని అక్కడ దించి హంస వేగంగా తన ఇష్టంవచ్చిన చోటికి వెళ్ళింది. హంస చేతిలో అలా ఓడిపోయి కాకి బల పరక్రమాలు వదిలి శాంతంగా జీవించింది.



ఇంకావుంది...

సుందరకాండ


ఈ రాక్షస రాజ భార్యలెలా ఉన్నారో శ్రీరామ ధర్మపత్ని కూడా అలాగే ఉన్నట్లయితే ఈతని జన్మ శోభావహమైయుండెడిది కదాః అని సాధు బుద్ధి అయిన హనుమ మనసులో అనుకొన్నాడట ఎంత మాట!

సాధుబుద్ధేమిటి! ఇలా అనుకొనడమేమిటి! అంటే-

ఆ సాధుత్వము- సీతా దుఃఖ అసహిష్ణుత్వమునందు. స్వామి సీతాకష్టమునూహించుకొని సహింపలేక పోయినాడు. అతి స్నేహఃఖలు పాపశంకీ అని కదా! సూక్తి. అతి స్నేహం ఔచిత్యాన్ని పాటింపనీయదు.

అట్టి తీరులోనిదీ మాట. అందుకే స్వామి వెంటనే పశ్చాత్తప్తుడై

పునశ్చ సో చింతయదార్త రూపో
ధ్రువం విశిష్టా గుణతోహి సీతా
అధా యమస్యాం కృతవాన్ మహాత్మా
లంకేశ్వర: కష్టమనార్య కర్మ- అని చెంపలువేసికొన్నాడు.



ఇదంతా మదస్నేహమట. అందుకనే తెలివి రాగానే ఈ ఏకత భిన్నమవుతుంది.

నతత్రకాచిప్రమదా ప్రసహ్య వీర్యోపపన్నేన గుణేనలబ్ధా

నచాన్య కామాపి నచా న్యపూర్వా వినా
వరార్హం జనకాత్మజాం తాం

ఈ స్త్రీలలో ఎవరూ-

రావణ వీర్యంచేత బలాత్కారంగా తీసికొని రాబడినవారు కాదు. మరి!

అతని గుణాన్ని వలచి వచ్చిన వారే కాని. రావడానికి ముందు-

మరొకని వలచిన వారూకారట- ఇన్నిటికీ- విరుద్ధంగా జనక మహారాజు కూతురొక్కతే అక్కడ ఉందట.

నచాకులీనా నచహీనరూపా నా దక్షిణా నానుపచారయుక్తా

భార్యా భవత్తస్య నహీన సత్వా న చాపి కాంతస్య నకామనీయా

వారిలో ఎవరూ రూపానికి తక్కువ వారు కారు

కులానికీ తక్కువవారుకారు

రావణుని యందనురాగాన్ని పంచనిది లేదు.

ఆయన యందు కామము లేనిది లేదు.

ఒక్క సీత తప్ప అతణ్ణి కాదన్న స్త్రీయే లేదు.

ఇటువంటి స్త్రీ సమూహాన్ని వారి సుఖాన్ని వారి భోగాల్ని చూస్తూన్న స్వామి-

బభూప బుద్ధిస్తు హరీశ్వరస్య
యదీదృశీ రాఘవ ధర్మపత్నీ
ఇమాయథా రాక్షసరాజ భార్యాః
సుజాత మస్యేతి హి సాధు బుద్ధేః- అని అనుకొన్నాడు.

పశ్చాత్తాపం సామాన్య స్థితిలో లేదు. ఆర్తుడైపోయేడు. తన ఉపాస్యదేవతకు తనే కళంకాన్ని ఆపాదించే క్షుద్ర భక్తునిగా తనను తలంచుకొని వాపోయేడు. సీత వీరందరి కంటె గుణ విశిష్టురాలనే సత్యాన్ని స్మరించుకొన్నాడు.

లంక ఒక ఇంద్రజాలం

అందులో తగుల్కొంటే కాని దానిని చూసి ఔనని సంతోషిస్తాడు అయిన దానిని చూసి కాదని దుఃఖిస్తాడు. ఇందులోనుండి బయట పడడం ప్రాజ్ఞునికి మాత్రమే తెలుస్తుంది. తెల్లవారితే ఈ ఇంద్రజాలం దగ్ధమవుతుంది. ఇటువంటి స్త్రీసమూహ మధ్యనుండి స్వామి ముందుకు నడుస్తున్నాడు.

తత్రదివ్యోపమం ముఖ్యం స్ఫాటికం రత్నభూషితం

అవేక్షమాణో హనుమన్ దదర్శ శయనాసనమ్
దంతకాంచన చిత్రాంగై ర్వైదూర్వైశ్చ వరాసనై:
మహార్హాస్తరణో పేతైరుపపన్నం మహాధనై:

స్ఫటికతో చేయబడిన మంచం. దానికి రత్నాల్ని పొదిగించిన అలంకరణ.

దాని క్రింద కాలానుకొనడానికి ముక్కాలి పీట

దాన్ని దంతంతో చేసేరట. దాని చుట్టూ బంగారపు అంచు

ఆ అంచుపై వైడూర్యాలు పొదిగేరు.

ఆ మంచానికి తలదిక్కున పూర్ణచంద్రునిలా మెరసిపోతూన్న శ్వేతచ్ఛత్రం.

ఇదీ రావణ శయనాసన సౌందర్యం.

ఆ మందిరం సుగంధాలతో పుష్ప సౌరభాలతో గత భోగాల్ని స్ఫురణకు తెస్తోంది.

ఇంకావుంది...

పరమహంస బోధామృతము



కామ కాంచన మోహాగ్ని చల్లారిననే కాని భగవద్దర్శనము కానేరదు.

87.తీవ్ర వైరాగ్యము పూని యొక్కసారి భగవద్దర్శనము పొందినంతనే అత్యంత బలీయమగు మోహపాశములు విచ్ఛిన్నమైపోవును. అట్టివానికిక భార్యవలననైనను ఇటు నటు అసమమైన రెండు సూదంటు రాళ్లున్నయెడల వానిలో ఏది దానిని విశేష బలముతో నాకర్షించును? వానిలో పెద్దదియే కదా? భగవంతుడే ఈ పెద్ద సూదంటు రాయి. అపుడు చిన్నసూదంటు రాయి వంటి స్త్రీ అందులకు వ్యతిరిక్తముగా ఏమి చేయగలదు?

88. పాములు విషజంతువులు గదా? నీవు వానిని పట్టుకొనబోయినయెడల తప్పక నిన్ను కరచును. కాని, మన్ను మంత్రించి వానిపై జల్లి వానిని వశమొనర్చుకొన నేర్చినవానికి పాములను బట్టుకొనుట అంత కష్టమైన పని కానేరదు. ఏడెనిమిది పాములను సైతము అతడు చేతులకును మెడకును జుట్టుకొని వానితో పాములను సైతము అతడు చేతులకును మెడకును జుట్టుకొని వానితో ఆటలాడగల్గును. (అదేవిధముగా బ్రహ్మ సాక్షాత్కారము నొందినవాడు సంసార భయమునుండి విముక్తుడగును.)

89.ఒక మార్వాడీ పెద్దమనుష్యుడొకనాడు శ్రీరామకృష్ణుని సందర్శించి కొన్ని వేల రూపాయలను సమర్పింప దనకు అనుజ్ఞనీయుడని వేడుకొనెను. అతడెట్టి సదుద్దేశము కలిగియున్నను శ్రీగురుదేవుడు ఖండితముగా వలదని చెప్పి దానిని స్వీకరింపడయ్యెను. ''నాకు డబ్బుతో నెట్టి సంబంధము నుండరాదు. దానిని స్వీకరించితినా, నా మనస్సు ఇక సదా దానిమీదనే నిలిచియుండును'' అనెను. అంత నా పెద్దమనుష్యుడు, సొమ్ము శ్రీరామకృష్ణుని సేవకు వినియోగపడుటకై అతని బందుగులలో నొకరి పేర నుంచెదననెను. శ్రీరామకృష్ణుడిట్లు బదులు చెప్పెను. ''వలదు, అది కపటమైన పని. ఇంతేకాక దానిచే ఒకరి దగ్గర నా సొమ్ము, ఉన్నదను భావము సదా నా మనస్సులో గలుగుచుండును''.

అప్పుడును ఆ మార్వాడీ ఊరకుండక, ''మనస్సు తైలము వంటిదై యున్నయెడల కామినీ కాంచనములను సాగరముపై తేలయాడగలదు''' అను శ్రీరామకృష్ణుని వచనములనే యుదాహరించి తన కానుక నంగీకరింపుడని పట్టుపడెను.

అంత శ్రీరామకృష్ణుడిట్లు సమాధానమొసగెను: ''ఆ మాట నిజము. కాని ఆ చమురే చాలా కాలము నీటిపైని తేలిచుండినయెడల మురుగెత్తునుకదా! అటులనే కామినీ కాంచనములను సాగరముపైని ఊరక తేలుచున్నను గూడ దానితో చిరకాలము నిరంతరమైన సంసర్గము కలిగెనా, మనస్సు క్రుళ్లి కంపుకొట్టును''.

కాంచన మోహమును జయించుటెట్లు?

90.కాంచన మోహము, లేక ధనరాగము సాధకుని ధర్మ మార్గమునుండి పెడత్రోవ త్రొక్కించునని తెలుపుచు శ్రీగురుదేవుడు యువకుడగు నొక శిష్యుని జూచి యొకప్పుడిట్లు పలికెను: '' లౌకికునివలె- పామరునివలె- నీవు డబ్బు పుచ్చుకొని ఉద్యోగము చేయనారంభించినావు. కాని నీ తల్లి నిమిత్తము నీవు పాటుపడుచున్నావు. లేనియెడల, ఛీ ఛీ! ఛీఛీ యని యుందును''. పదే పదే యిట్లని తుదకు, ''భగవంతుని దప్ప మరెవ్వరిని సేవింపకుము'' అనియెను.

91.డబ్బుకోసం ఉద్యోగము చేయుట యెట్టి పతన హేతువో తెలుపుచూ శ్రీ గురుదేవుడొకప్పుడొక శిష్యునకిట్లనియెను: ''వానిమొగ మెట్లు కళావిహీనమైన యున్నదో కనుడు. నల్లని పొర వాని మొగము నావరించినట్లున్నది. ఇది యంతయు 'ఉద్యోగ మహాత్మ్యము'. జమా ఖర్చు లెక్కలు, మరి యిట్టి వేయి విషయములలో అతడు మునిగితేలుచుండును''.

92.ధనము మనుష్యుని స్వభావమునే మార్చివేయునట్టి ఉపాధి. దాని ప్రభావము యిట్టిదని చెప్పనలవికాదు; ఎవ్వడైనను ధనవంతుడైనంతనే వాని నైజము పూర్తిగా మారిపోవును. ఎంతయో వినయ విధేయతలుగల బ్రాహ్మణుడొకడు ఇచటికి (దక్షిణేశ్వరమునకు) తరచుగా వచ్చుచుండెడివాడు. కొంతకాలమునకు అతడిచటికివచ్చుట మానివేసెను.వాని సంగతి సందర్భములేవియు మాకు దెలియలేదు. ఒకనాడు మేము కొన్నగరమునకు పడవనెక్కి వెడలితిమి. మేము పడవ దిగుచు, గంగానది యొడ్డున గూర్చుండిన యా బ్రాహ్మణుని జూచితిమి.

ఇంకావుంది...

శ్రీ రామకృష్ణ బోధామృతము - పరిశోధితమగు 112 మహోపదేశములుగల శ్రీరామకృష్ణ వాక్య రత్నాకరము - సంగ్రహ జీవిత సహితము - అనువాదకుడు: శ్రీ చిరంతనానందస్వామి

స్వాధ్యాయ సందోహం

హిందీ మూలం: స్వామీ వేదానంద తీర్థ
తెలుగు అనువాదం: డా॥ పాలకోడేటి జగన్నాథరావు 9490620512

191

మనిషి తానుచేసే పనికి ఏ విఘ్నాలు సంభవించకుంటే తన నిశ్చితాభిప్రాయాలను సవరించుకోవడంగాని విరమించడంగాని చేయడు. అట్టివాడు ఎవడూ ఎవరి సహాయమూ అర్థించడు. కాని లోకంలో యుద్ధముంది. ఒకరికి మరొకరిమీద విరోధముంది. ఒకడు మరొకణ్ణి హీనంగా చూస్తాడు. దీని పేరే యుద్ధం.

లోక సమష్టిలో ఉన్న ఈ యుద్ధం వ్యక్తి వైయక్తిక జీవితంలోకూడ ఉంది. ఇంద్రియాలు, దేహమూ ఆత్మను తమ వశం చేసుకొనేందుకు నిమగ్నమైయుంటాయి. కాని ఆత్మ దేహేంద్రియాలు తన వశంలో ఉండాలని భావిస్తుంది. దైవీభావాలు అసురభావాలను తమ అధీనంలోనే తెచ్చుకోవాలని భావిస్తాయి. అసురీశక్తులు దైవీశక్తులను అణచివేయాలని నిత్యం ప్రయత్నిస్తూ ఉంటాయి. ఈ దేవాసుర యుద్ధవిషయమటుంచండి. మనిషి తన జీవితాన్ని సుఖమయం చేసుకొనేందుకు ప్రకృతితో ఎంత సమరస యుద్ధంచేయవలసియుంటుంది?

ఏ యుద్ధానికైనా విధిగా సహాయకులు కావలసియుంటుంది. అందుచేత 'స్మిన్నరో విహ్వయంతే సమీకే' ''నాయకులంతా జీవన సంగ్రామంలో సహాయకునిగా ఆ దైవాన్నే ఆహ్వానిస్తారు'' నాయకులే కాదు-

ఇంద్రం పరే- వరే మధ్యమాస ఇంద్రం యాంతో- వసితాస ఇంద్రమ్।

ఇంద్రం క్షియంత ఉత యుధ్యమానా ఇంద్రం నరో వాజయంతో హవంతే॥ ఋ.4-25-8.

ఉత్తమ, మధ్యమ, అధములైనవారు సహితం ఇంద్రునే (భగవంతునే) సహాయకునిగా ఆహ్వానిస్తారు. యుద్ధంచేసేవారు, దానినెదుర్కొనేవారు ఇంద్రుణ్ణే పిలుస్తారు. నిరాశావహులు హతాశులు కూడ ఆయన్నే స్వాగతిస్తారు. వీరేగాక జీవితంలో జ్ఞానం, ధనం, బలం, సంతానం మొదలయినవి కోరుకొనేవారు సహితం ఆ దైవాన్నే(ఇంద్రునే) అర్థిస్తారు. ఆశావాదులు, నిరాశావాదులు, జ్ఞాన ప్రవణులు, ధ్యాన తత్పరులు, సజ్జనులు, దుర్జనులు, మధ్యేవర్తులు అందరూ ఆ భగవంతునే సహాయమర్థిస్తుంటారు. ఈ విధంగా అర్థించే స్థితిలో అందరూ సమానులే. భగవద్వారంవద్ద ఒక విధంగా అందరూ యాచకులే. భగవద్ద్వారం వద్దనున్న వారందరూ 'రిరిక్వాం సస్తన్వఃఅగ్మన్' ''రిక్త శరీరులై మాత్రమే చేరుకొంటారు'' అట్టివారే భగవంతుని వద్దనుండి ఏదైనా పొంది తెచ్చుకోగలరు. దేహంమీద ఏదో బరువైన వస్తువులు మోసుకొనిపోయి నిలిచినవారు ఆయననుంచి ఇక అధికంగా తెచ్చుకోగలిగే దేముంటుంది.

యోధులు ఆత్మసంరక్షణార్థం కవచాదులను ధరించి యుద్ధంలోనికి వెళతారు. కాని జీవన సమరంలోఉన్న యోధుడు దైవద్వారానికి ముందు నిలిచేందుకు ముందుగా శరీరంమీద ఉండే రక్షణ కవచాదులను తొలగించుకొని నిలబడాలి. ఎందుకంటే 'తన్వః కృణ్వత త్రామ్' ఆ దైవమే ఆ యోధుడికి శరీర సంరక్షణచేసే కవచమైపోతాడు. ఇంకో విశేషమేమంటే ఆ దైవద్వారం వద్ద నిలిచేందుకు వెళ్లేవాడు ఆయనకు కానుకగా త్యాగమనే మహాఫలాన్ని తీసుకొనిపోవాలి. 'మిథో యత్ త్యాగముభయాసో అగ్మన్.'

పరమార్థ ప్రాపక క్రమం

యత్సానోః సానుమారుహద్ భూర్యస్పష్ట కర్త్వమ్।

తదింద్రో అర్థం చేతతి యూథేన వృష్ణిరేజతి ॥ ఋ.1-10-2॥

భావం:- ఒక శిఖర మధిరోహించిన తరువాత మరల అధిరోహించదగిన శిఖరం కనబడిన విధంగా ఒక పురుషార్థాన్ని సాధించిన తరువాత సాధించదగిన మరో పురుషార్థాన్ని ఆత్మ గుర్తిస్తుంది. అలాగే ప్రాణాయామాది అష్టాంగ యోగాభ్యాసం ద్వారా సాధించదగిన నిర్వికల్ప సమాధాని ఆత్మసాధించి మోక్ష పురుషార్థాన్ని పొందగలుగుతుంది.

వివరణ:- పర్వతారోహణం చేసే వారికి ఈ మంత్రంలో చెప్పబడిన అనుభవం సాధారణంగా కలుగుతుంది. ఎదురుగా ఉన్న పర్వత శిఖరాన్ని ఎక్కగానే తృప్తి కలుగకముందే ఆ పైన కనబడే మరో పర్వత శిఖరాన్ని కూడ ఎక్కాలనే కోరిక కలుగుతుంది. ఆ ఎత్తైన శిఖరాన్ని అధిరోహించడమొక్కటే సాధించవలసిన విజయంగా ఒక తీవ్రవాంఛ జనిస్తుంది. అది వాంఛ మాత్రంగానే కాదు. 'భూర్య స్పష్ట కర్త్వమ్' ''ప్రధాన కర్తవ్యంగా తోస్తుంది.'' వెనుక సాధించిన పర్వత శిఖరారోహణ విజయం మరుపునకు వస్తుంది.

ఇంకావుంది...

ఆంధ్రభూమి

చిత్రభూమి

జీవితమొక నటనయనే
వివేకమును ప్రోదిజేసి విందుగ పరచే
నవరసముల సినిమాయై
అవిరళముగ ముదమునిచ్చుటద్భుతమేగా!

గురువారం 10, జనవరి 2019

మణిశర్మ 'ఆరే'స్తాడా?





రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న ఇస్మార్ట్ శంకర్ సినిమాకు మణిశర్మ సంగీతం అందించనున్నారు. ఆరోసారి వీళ్లిద్దరితో కలిసి పనిచేయబోతున్నారు. గతంలో పూరి జగన్నాథ్, మణిశర్మ కలిసి పనిచేసిన ఐదు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ ఇద్దరూ చివరిగా టెంపర్ సినిమాకు పనిచేశారు. ఇపుడు రామ్ హీరోగా నటిస్తున్న ఇస్మార్ట్ శంకర్ సినిమాకు సంగీతం అందిస్తున్నారు మణిశర్మ. వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న తొలి సినిమా ఇదే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రానికి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నాడు. ఫస్ట్‌లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. రెగ్యులర్ షూటింగ్ జనవరి చివర్లో మొదలు కానుంది. పూరీజగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ నిర్మాణ సంస్థలపై దర్శకుడు పూరి జగన్నాథ్, ఛార్మికౌర్ సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు.



కొత్తగా.. శర్వా

వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ ట్యాలెంటెడ్ హీరోగా పేరు తెచ్చుకున్నాడు యంగ్ హీరో శర్వానంద్. ఇటీవల రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'పడి పడి లేచె మనసు'తో ప్రేక్షకుల ముందుకొచ్చిన శర్వాకి, అది అనుకున్నంత విజయాన్ని అందించలేక పోయింది. నిజానికి ఈ సినిమాపై శర్వా భారీ ఆశలే పెట్టుకున్నాడు. కానీ అంచనాలను అందుకోలేకపోయింది. ఇప్పుడు తన తదుపరి చిత్రంపై పూర్తిగా దృష్టి పెట్టాడట. 'స్వామి రారా' ఫేమ్ సుధీర్‌వర్మ దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు శర్వా. 1980 బ్యాక్‌డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న చిత్రంలో, శర్వా ద్విపాత్రాభినయం చేయనున్నాడట. అందులో ఒకటి యువకుడి పాత్ర అయితే, మరొకటి వృద్ధుడి పాత్ర అని సమాచారం. ప్రస్తుతం చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. 'హలో' ఫేమ్ కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తుంది.

ఇమేజ్ గురించి ఆలోచించను



జీవితంలో ఎప్పుడూ ఆనందంగా ఉండేందుకు ప్రయత్నించాలి. అంతేకానీ అనవసర విషయాల గురించి ఎక్కువగా ఆలోచించి మైండ్ పాడుచేసుకోకూడదని అంటున్నాడు ప్రముఖ నటుడు వెంకటేష్. ఆయన మెగాహీరో వరుణ్‌తేజ్‌తో కలిసి నటించిన చిత్రం 'ఎఫ్2'. ఫన్ అండ్ ఫ్రస్టేషన్ ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రానికి అనీల్ రావిపూడి దర్శకత్వం వహించారు. సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలవుతున్న సందర్భంగా వెంకటేష్‌తో ఇంటర్వ్యూ...

★ **ఫన్ ఎవరికి? ఫ్రస్టేషన్ ఎవరికి?**

- ఇందులో ఉండే ఫన్, ఫ్రస్టేషన్ ప్రేక్షకులను నవ్వించేందుకే. ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సరిగ్గా సంక్రాంతి పండగకు కావలసిన సినిమా.

★ **ఇంతకీ కథ ఏమిటి?**

- పెళ్లికి ముందు పెళ్లి తరువాత మగవాడి జీవితం ఎలా వుంటుందన్న పాయింట్‌తో పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన కథ. ప్రతీ మనిషికి కనెక్ట్ అవుతుంది. ఇందులో చూసే సన్నివేశాలు ప్రేక్షకుల్ని నవ్విస్తాయి.

★ **గురు తరువాత గ్యాప్‌కు కారణం?**

- ఆ సినిమా తరువాత చాలా కథలు విన్నాను. ఏదో కొత్తగా చేద్దామని ట్రై చేశాను కానీ కుదరలేదు. మళ్లీ రెగ్యులర్ ఫార్మెట్‌లో ఈ కథనే ఎంచుకున్నాను.

★ **వరుణ్‌తేజ్‌తో వర్కింగ్ ఎక్స్‌పీరియెన్స్?**

- వరుణ్ మంచి నటుడు. తను ఇప్పటివరకూ ఇలాంటి జోనర్‌లో సినిమా చేయలేదు. తనను తాను ప్రూవ్ చేసుకోవడానికి భిన్నమైన కథల్ని ఎంచుకుంటున్నాడు. కొత్త జోనర్‌నైనా చక్కగా నటించాడు. తనతో పని చేస్తూ ఎంజాయ్ చేశాను.

★ **ఇప్పటివరకూ పెళ్లికాని ప్రసాదుగా చూశారు. ఇపుడు పెళ్లైన ప్రసాదు సమస్యలు చూపిస్తారా?**

- మల్లీశ్వరిలో పెళ్లికాని ప్రసాదు పాత్ర బాగా గుర్తుండిపోయింది జనాలకు. ఈ సినిమాలో కూడా నా పాత్రకు మంచి ఇంపాక్ట్ వుంటుంది. పెళ్లైన తరువాత మగవాడి జీవితం ఎలా వుంటుందనేదాన్ని కామెడీగా చూపించాము.

★ **దర్శకుడు అనీల్ గురించి?**

- అనీల్ క్లారిటీ వున్న దర్శకుడు. ఈ కథను చెప్పినపుడు అందులో వున్న ఫన్‌ను బాగా ఎలివేట్ చేశాడు. తను సెట్స్‌లో కూడా అంతమంది ఆర్టిస్టులను డీల్ చేయడంలో ఎక్కడా తడబడలేదు.

★ **మీ కెరీర్‌లో ఇమేజ్ కోసం చేసిన సినిమాలున్నాయా?**

- ఇమేజ్ అనేదాన్ని నేను నమ్మను. నేను ఇలాంటి పాత్రలే చేస్తాను, ఇలాగే వుంటానంటే ఇక్కడ కుదరదు. అన్నిరకాల పాత్రల్లో మెప్పించినపుడే నటుడిగా పూర్తిస్థాయి గుర్తింపు దక్కుతుంది.

★ **ఎక్కువగా మల్టీస్టారర్లే చేయడానికి కారణం?**

- అలా అని కాదు. మల్టీస్టారరా, సోలో సినిమానా అనేది ఆ కథల్ని బట్టి వస్తాయి. నా దగ్గరకు వచ్చిన బెస్ట్ కథలను చేస్తున్నాను.

★ **ఫ్యామిలీ చిత్రాల్లో మిమ్మల్ని ఎక్కువగా చూస్తున్నాం. దానికోసం ప్రత్యేక కేర్ తీసుకుంటారా?**

- నాకన్నీ అలాంటి కథలే వచ్చాయి. నిజానికి రోజా సినిమా సమయంలో నాకు గాయం అవ్వడంవల్ల ఆ సినిమా మిస్ అయ్యాను. ఆ తరువాత అన్ని ఫ్యామిలీ కథలు రావడంతో అలాగే కంటిన్యూ అయ్యాను. లేదంటే రోజా చేసి వుంటే హిందీలో సెటిల్ అయ్యేవాడినేమో.

★ **డ్రీమ్ పాత్రలు ఏమైనా ఉన్నాయా?**

- అలాంటివి ఏమీ లేవు. మంచి పాత్రలకోసం చూస్తున్నా.

★ **వెంకీ మామ గురించి...**

- చైతుతో కలిసి చేస్తున్న సినిమా ఇది. ఇప్పటికే కొంత షూటింగ్ జరిగింది. తప్పకుండా మంచి సినిమా అవుతుంది.

★ **తదుపరి చిత్రాలు..?**

- వెంకీమామతోపాటు త్రివిక్రమ్‌తో ఓ సినిమా ఉంటుంది. అలాగే అనీల్ రావిపూడితో మరో చిత్రం ప్లాన్ చేస్తున్నా. మరిన్ని కథలు కూడా వింటున్నా.

- శ్రీ

'కాంచన-3' వస్తోంది



ముని, కాంచన, కాంచన-2తో హర్రర్ కామెడీ చిత్రాల్లో సౌత్ ఇండియాలోనే హ్యూజ్ సక్సెస్‌ని సాధించిన రాఘవ లారెన్స్ హీరోగా, దర్శకుడిగా ముని ఫ్రాంచాయిస్ నుండి వస్తున్న హర్రర్ కామెడీ చిత్రం కాంచన-3. రాఘవ లారెన్స్ అందించిన హర్రర్ చిత్రాలన్నీ బ్లాక్‌బస్టర్ చిత్రాలుగా బాక్సాఫీస్‌ని షేక్ చేసినవే. ఈ కాంచన-3 చిత్రం మాత్రం లారెన్స్‌కి స్పెషల్ చిత్రంగా తెరకెక్కుతుంది. తమిళ, తెలుగు భాషల్లో ఈ చిత్రం షూటింగ్ దాదాపు పూర్తికావస్తోంది. రాఘవ లారెన్స్ ఏమి చేసినా స్పెషల్‌గా ఉంటుంది. ఇప్పుడు కాంచన-3 కోసం ఆయన ఒక మోషన్ పోస్టర్‌ని తెలుగు వెర్షన్‌కోసం రిలీజ్‌చేశారు. అయితే ఒక శ్లోకంలో స్టార్టయ్యి స్లమ్ ఏరియాని చూపిస్తూ క్లాత్‌నుండి యాక్షన్ సీన్ అక్కడినుండి రుద్రాక్షలు ధరించి, తెల్లటి పంచె కట్టుకుని, వైట్ హెయిర్ స్టైయిల్‌తో దర్జాగా కూర్చునివున్న హీరో పోస్టర్‌ని తెలుగులో మొట్టమొదటిసారిగా డాల్బీ అట్మాస్ సౌండ్‌లో విడుదల చేశారు. ఈ చిత్రాన్ని తెలుగులో లైట్‌హౌస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై బి.మధు సమర్పణలో రాఘవేంద్ర ప్రొడక్షన్స్ బ్యానర్‌లో రాఘవ నిర్మాణంలో తెరకెక్కించారు. ఏప్రిల్ 18న విడుదలకానున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ మోషన్ పోస్టర్‌ని పాత్రికేయ మిత్రులకోసం ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బి.మధు మాట్లాడుతూ.. రాఘవ లారెన్స్ స్వయంగా అందించిన హర్రర్ సినిమాలు అన్నీ సూపర్ హిట్లే. అందులో ముని సీక్వెల్స్ మరీ స్పెషల్. కాంచన పేరుతో స్టార్టయిన తరువాత ఇప్పుడు కాంచన-3గా ప్రేక్షకుల ముందుకు ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నాము. రాఘవ లారెన్స్‌కి ఈ చిత్రం చాలా ప్రత్యేకం అనే చెప్పాలి. ఈ సిరీస్‌లో ఇది నాలుగో చిత్రం. ఆయన ప్రతి చిత్రంలో తన గెటప్‌ని సామాన్య ప్రేక్షకుడికి దగ్గరగా వుండేలా చూసుకున్నారు. ఇప్పుడు ఈ చిత్రంలో వైట్ హెయిర్‌తో న్యూస్టైల్‌కి నాంది పలికారు. మేము విడుదలచేసిన కాంచన-3 మోషన్ పోస్టర్ విత్ సౌండ్‌కి ఇప్పటికే స్పందన చాలా బాగుంది. ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మా బ్యానర్ లైట్‌హౌస్ మూవీ మేకర్ ఎల్ఎల్‌పి బ్యానర్‌లో రాఘవ నిర్మాణంలో తెరకెక్కించాము. ఆడియన్స్ కూడా చాలా ఆసక్తిగా ఎదురుచూడటం విశేషం. గత మూడు చిత్రాలని మించి కాంచన-3 వుండబోతుందని నమ్ముతున్నాము అని అన్నారు.

రాం..రాం?

తెలుగులో డీజే చిత్రంతో గ్రాండ్‌గా రీఎంట్రీ ఇచ్చి, అందాల ప్రదర్శనతోపాటు ఫుల్ ఎనర్జిటిక్ నటనతో ముద్దుగుమ్మ పూజా హెగ్డే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ చిత్రం తర్వాత తెలుగులో పూజా హెగ్డే లక్కీ బ్యూటీగా పేరు దక్కించుకుంది. ఎన్టీఆర్‌తోఅరవింద సమేత చిత్రంతోపాటుబెల్లకండ హీరోతో కూడా సినిమా చేసింది. ప్రస్తుతం రెండు సినిమాల్లో నటిస్తోంది. ఇటీవలే తాను ఒక పెద్ద సినిమాలో ఎంపిక అయ్యానంది. అయితే ఆ సినిమా వివరాలను మాత్రం వెల్లడి చేసేందుకు ఆమె ఒప్పుకోలేదు. దాంతో ఈమె అల్లు అర్జున్- త్రివిక్రమ్ మూవీకి ఓకె అయ్యిందనే పుకార్లు షికార్లు చేశాయి. ఆ విషయంపై క్లారిటీ రావాల్సి వుంది. తెలుగులో స్టార్ హీరోయిన్స్ జాబితాలో వున్న పూజా హెగ్డే బాలీవుడ్‌కు పరిమితం అయ్యేనా అంటూ అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పూజాహెగ్డే చేసిన మొదటి హిందీ సినిమా అంతగా ఆకట్టుకోలేదు. దాంతో అక్కడ పూజకు పెద్దగా స్కోప్ లేదని అంతా భావించారు. అయినా కూడా అక్కడ చిన్నా చితకా పాత్రల్లో ఆఫర్లు దక్కించుకుని నటిస్తూ వస్తోంది. ఆ సినిమాలో పూజా బాలీవుడ్‌లో నిలదొక్కుకోవటం కష్టమే అనుకున్నారు. కానీ తాజాగా ఆమెకు వచ్చిన ఆఫర్‌తో బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిపోయి అక్కడ మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా లక్కీ బ్యూటీగామారిపోవడం ఖాయం అంటున్నారు. బాలీవుడ్‌లో కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన రోహిత్ శెట్టి ఇటీవలే 'సింబా' సినిమాతో భారీ విజయాన్ని దక్కించుకున్నాడు. సింబా సక్సెస్ జోష్‌లో వున్న రోహిత్ శెట్టి తన తదుపరి చిత్రాన్ని అక్షయ్‌కుమార్‌తో చేయబోతున్నాడు. అక్షయ్‌కు జోడీగా పూజా హెగ్డేను ఎంపిక చేసినట్లుగా తెలుస్తోంది.





బుల్లితెరపై శ్రద్ధ..!

తెలుగులో పలు సినిమాల్లో నటించినా కూడా ఒక్కటంటే ఒక్కటి కూడా ఈమెకు పెద్దగా గుర్తింపును తెచ్చిపెట్టలేకపోయాయి. హీరోయిన్‌గానే కాకుండా క్యారెక్టర్ ఆర్టిస్టుగా చేసినా విలన్‌గా చేసినా కూడా ఈమెకు కాలం కలిసి రాలేదు. తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఇక మనుగడ సాధ్యంకాదని భావించిన శ్రద్ధాదాస్ బాలీవుడ్ వెళ్లి అక్కడ ప్రయత్నాలు చేసింది. హిందీలో చేసిన సినిమాలు కూడా శ్రద్ధాకు గుర్తింపును తెచ్చి పెట్టలేకపోయాయి. వచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకుని విచ్చలవిడిగా అందాల ప్రదర్శన చేసి గ్లామర్‌తో రెచ్చిపోయేందుకు విపరీతంగా ప్రయత్నించింది. కాని అందాల ప్రదర్శనను ఆస్వాదించిన ప్రేక్షకులు ఆమెపై అంతగా ఆసక్తి చూపలేరు. వెండితెరపై దాదాపు పదేళ్ల ప్రయత్నించినా కూడా సక్సెస్ దక్కకున్నా కూడా ఇంకా ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉంది. వెండి తెరను వదిలేసి ఈసారి బుల్లితెరను ఎంపిక చేసుకుంది. ఈమధ్య కాలంలో వెబ్ సిరీస్‌లకు మంచి గిరాకీ ఉంది. అందుకే ఈమె తాజాగా 'శింగార్‌దాన్'అనే వెబ్ సిరీస్‌లో నటించింది. సినిమాల్లో అందాల ప్రదర్శన చేసినట్లుగా వెబ్ సిరీస్‌కోసం కూడా అడ్డుఅదుపులేకుండా ఈమె స్కిన్‌షో చేసినట్లుగా తెలుస్తోంది.



బైలంపుడి పాట విడుదల

తార క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ పారిశ్రామికవేత్త బ్రహ్మానందరెడ్డి నిర్మిస్తోన్న చిత్రం 'బైలంపుడి'. హరీష్ వినయ్, తనిష్క తివారి జంటగా నటిస్తోన్న ఈ చిత్రం ద్వారా అనిల్ పిజిరాజ్ దర్శకుడుగా వ్యవహరిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం లిరికల్ సాంగ్ బుధవారం హైదరాబాద్‌లో ఫిలిం ఛాంబర్‌లో బాలీవుడ్ హీరోయిన్ మైరా అమిథి చేతులమీదుగా లాంచ్ చేశారు. అనంతరం మైరా అమిథి మాట్లాడుతూ.. 'పిల్లల దేవుడు'పల్లవితో సాగే సాంగ్ చాలా బావుంది. టీమ్ అందరికీ నా శుభాకాంక్షలు అన్నారు. నిర్మాత బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. 'పారిశ్రామికవేత్తగా ఉన్న నేను సినిమామీద ఆసక్తితో తొలిసారిగా నిర్మాతగా 'బైలంపుడి' చిత్రాన్ని నిర్మిస్తున్నా. అందరూ కొత్తవారైనప్పటికీ ఎంతో సహజసిద్ధంగా నటించారు. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హైటెక్నికల్ వాల్యూస్‌తో సినిమాని తెరకెక్కించాము. 'ఇక్కడ యుద్ధంచేయాలి.. గెలవడానికి కాదు, బతకడానికి'అనేది మా సినిమా క్యాప్షన్. 'పిల్లల దేవుడు'అనే లిరికల్ సాంగ్ రిలీజ్ చేశాం. అందరికీ పాట నచ్చుతుందన్న నమ్మకం ఉంది''అన్నారు. సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ మాట్లాడుతూ.. 'ఇందులో రెండు పాటలున్నాయి. ఈరోజు పిల్లల దేవుడు అనే పాట లాంచ్ చేశాం. పాట అందరికీ నచ్చుతుంద'న్నారు. హీరో హరీష్ వినయ్ మాట్లాడుతూ.. 'సుభాష్‌గారు అద్భుతమైన సాంగ్ ఇచ్చారు. దర్శక నిర్మాతలు ఎక్కడా రాజీపడకుండా సినిమా తీసారు' అన్నారు. దర్శకుడు అనిల్ పిజి రాజ్ మాట్లాడుతూ.. 'కెమెరామేన్‌గా నా కెరీర్ స్టార్ట్‌చేశాను. చాలా చిత్రాలకు వర్క్‌చేశాను. దర్శకుడుగా ఇది తొలి సినిమా. 'బైలంపుడి'అనే గ్రామంలో జరిగే లవ్ అండ్ పొలిటికల్ చిత్రమిది. ప్రతి పాత్ర ఎంతో సహజసిద్ధంగా ఉంటుంది. ఒక విలేజ్‌లో ఏమైతే అంశాలు ఉంటాయో.. మా సినిమాలోకూడా అన్ని అంశాలుంటాయి. నిర్మాత ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మించారు. ప్రస్తుతం కొత్త కథలను ఆదరిస్తున్నారు. ఆ తరహాలో వచ్చే మా సినిమాను కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా'' అన్నారు.



నాట్య ప్రణవం

చరిత అండ్ గౌతమ్ ప్రొడక్షన్స్ పతాకంపై 'ఈరోజుల్లో'- శ్రీమంగం, శశాంక్, అవంతిక హరి నల్వా, గాయత్రి అయ్యర్ ప్రధాన పాత్రల్లో కుమార్ జి. దర్శకత్వంలో తను.ఎస్ నిర్మిస్తోన్న చిత్రం 'ప్రణవం'. ఈ చిత్రం షూటింగ్ కార్యక్రమాలు పూర్తిచేసుకుని ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సందర్భంగా దర్శకుడు కుమార్ జి చిత్ర విశేషాలు తెలియజేస్తూ.. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చండీఘర్‌కు చెందిన మోడల్ అవంతిక హరి నల్వా హీరోయిన్‌గా నటిస్తుండగా, గాయత్రి అయ్యర్ మరో ముఖ్య భూమికలో నటిస్తోంది. భరతనాట్యం నేపథ్యంలో లవ్, సస్పెన్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. అన్నివర్గాల ప్రేక్షకులకు నచ్చే సినిమా అవుతుందన్న నమ్మకంతో ఉన్నాం. అలాగే మా సినిమాకు మ్యూజిక్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ఆర్.పి.పట్నాయక్‌గారు, ఉషగారు కలిసి ఒక డ్యూయట్ మా సినిమాలో ఆలపించారు. త్వరలో ఆడియో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నాం. ఫ్రెష్ కాన్సెప్ట్‌తో యంగ్ టీమ్ అంతాకలిసి చేస్తోన్న మా ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాం' అన్నారు.